మంగళవారం
29•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 123
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






సోమవారం రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ గ్రామంలోని చినజీయర్ స్వామి ఆశ్రమంలో జరిగిన తిరునక్షత్రోత్సవంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులకు పట్టువస్త్రాలు అందించి ఆశీర్వదిస్తున్న స్వామివారు.

# త్వరలో ప్రైవేటు పర్మిట్లు!

### నాలుగు వేల రూట్లలో ప్రారంభం!.. రేపోమాపో రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం

మోటార్ వెహికిల్ సవరణ చట్టం ప్రకారం ప్రజలకు మెరుగైన రవాణా లక్ష్యం

ప్రైవేటు పర్మిట్లకు అవకాశం కల్పిస్తున్న కేంద్ర చట్టం • దానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోనున్న రాష్ట్ర క్యాబినెట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేందుకు త్వరలోనే మూడు నుంచి నాలుగు వేల రూట్లలో ప్రైవేటువాహనాలకు పర్మిట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఆర్టీసీ కార్మికసంఘాలు తరచూ సమ్మెలకు దిగడం వల్ల ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని శాశ్వతంగా అధిగమించడానికి ప్రభుత్వం ఈ ఆలోచన చేస్తున్నదని సమాచారం. రెండుమూడ్రోజుల్లోనే రాష్ట్ర క్యాబినెట్ సమావేశం నిర్వహించి, అందులో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని విశ్వసనీయంగా తెలిసింది. ఆర్టీసీ సమస్యను కార్మికసంఘాలు న్యాయస్థానాలకు తీసుకెళ్లినందున, అది తేలేవరకు చాలా సమయం పట్టే అవకాశం ఉన్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈలోపు ప్రజలకు మరింత అసౌకర్యం కలిగే ప్రమాదం ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలుగకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నదని సమాచారం.

**పార్లమెంట్ చట్టం ప్రకారమే**

పార్లమెంటు చేసిన మోటర్ వాహనాల (సవరణ) చట్టం– 2019 సెక్షన్ 67 ప్రకారం.. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు, పోటీతత్వం పెంచేందుకు ప్రైవేటు వాహనాలకు పర్మిట్లు జారీచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నది. ఈ చట్టం 2019 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రసాదించిన అధికారాలు, అవకాశాలను వినియోగించుకుని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు 3–4 వేల రూట్లలో ప్రైవేటు వాహనాలకు పర్మిట్లు ఇవ్వాలని ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రైవేటువాహనాలకు పర్మిట్లు ఇవ్వడంవల్ల వారు ఆదాయం కోసం తమకు కేటాయించిన రూట్లలో ఎక్కువ ట్రిప్పులు నడుపుతారు. షిఫ్టుల గొడవ లేకుండా వాహనాలను ప్రజల రవాణాకు ఎక్కువ సమయం అందుబాటులో ఉంచుతారు. తద్వారా ప్రజలకు ఇప్పటికంటే ఎక్కువ రవాణాసౌకర్యం అందుబాటులో ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. దీనివల్ల రోడ్డు రవాణాలో ఆరోగ్యకరమైన పోటీని నెలకొల్పాలనే పార్లమెంటు చట్టం ఉద్దేశాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసినట్టు అవుతుంది.

**ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు!**

ఎట్టిపరిస్థితుల్లోనూ ఆర్టీసీ ప్రైవేటీకరణ జోలికి వెళ్లరాదని ప్రభుత్వం విస్పష్టంగా ఉన్నదని సమాచారం. ప్రైవేటు బస్సులకు పర్మిట్లు ఇవ్వటానికి, ప్రైవేటీకరణకు సంబంధం లేదని

మిగతా 2వ పేజీలో




**రూట్లకు** పర్మిట్లు ఇస్తే బస్సులు నడపడానికి ప్రైవేటువాహన యజమానులు కూడా సిద్ధంగా ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం వెయ్యి రూట్లలో పర్మిట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తే.. 21,453 దరఖాస్తులు రావడం గమనార్హం. దీన్నిబట్టి రాష్ట్రంలోని ప్రైవేటువాహన యజమానుల నుంచే కాకుండా.. ఇతర రాష్ట్రాల నుంచి కూడా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నదని రవాణాఅధికారులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది.

# ఫిబ్రవరిలో యాదాద్రి ఆలయ ప్రారంభం

అదే సమయంలో యాదాద్రిలో మహాసుదర్శనయాగం

ప్రపంచవ్యాప్తంగా వైష్ణవపీఠాల స్వాములకు ఆహ్వానం

రామానుజ విగ్రహావిష్కరణ అద్భుతంగా నిర్వహిస్తాం

ముచ్చింతల్‌లో తిరునక్షత్ర ఉత్సవాల్లో సీఎం కేసీఆర్

దైవానుగ్రహానికి అందరూ యోగ్యులే

భక్తులకు అనుగ్రహభాషణలో చినజీయర్‌స్వామి

సీఎం కేసీఆర్ ఆధ్యాత్మిక, సామాజిక, ప్రజాసేవకు ప్రశంసలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ శంషాబాద్:** యాదాద్రి ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తికావచ్చాయని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. చినజీయర్ స్వామి సంకల్పం మేరకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఆలయ ప్రారంభం ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా 1008 కుండాలతో మహా సుదర్శనయాగం చేయాలని సంకల్పించినట్టు చెప్పారు. దీనికి ప్రపంచవ్యాప్తంగా వైష్ణవ పీఠాలన్నింటి నుంచి స్వాములను పిలిపించాలని జీయర్‌స్వామిని వేడుకొన్నానని, దీనికి ఆయన ఒప్పుకొన్నారని తెలిపారు. తాను ఎక్కడకు వెళ్లినా అందరూ స్వామి వారి ప్రతిభ గురించి చెప్తున్నారని సీఎం కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. తాను శ్రీరంగంలో స్వామి పేరుచెప్తే.. 'మీ జీయర్ స్వామి' అని వాళ్లు అన్నారని, అందుకు తాను.. 'మీకు స్వామి కాదా?' అని అంటే.. మాకు కూడా స్వామియేనని చెప్పారని

మిగతా 2వ పేజీలో



# ఆర్టీసీ విలీనం ఎలా సాధ్యం?

చర్చలకు ఆ డిమాండే ప్రధాన ఆటంకం • దానిని పక్కనపెట్టకపోతే సంక్షోభం ముదురుతుంది

అందుకే ఇతర అంశాలపై చర్చించాలన్నాం • సమ్మె వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

ఆర్థికభారం కాని అంశాలపై చర్చించాలని చెప్పాం

ఆర్టీసీ కార్మికసంఘాల తీరుపై హైకోర్టు వ్యాఖ్యలు

2

# పల్లెపల్లెకు బస్సులు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముమ్మరం
- రోడ్డెక్కిన 6,209 బస్సులు
- ప్రయాణికులతో కిటకిటలాడిన సర్వీసులు

7



కరీంనగర్ బస్టాండ్‌లో..



అబూబకర్ అల్-బగ్దాదీ

# అల్ బగ్దాదీ ఖతం

ఐఎస్ అధిపతిని మట్టుబెట్టిన అమెరికా

సిరియాలో సీక్రెట్ ఆపరేషన్

### ఏ దారీ లేక సొరంగంలో తనను తాను పేల్చుకున్న ఉగ్ర దళపతి

ఆపరేషన్ మొత్తాన్ని వైట్‌హౌస్ నుంచి ప్రత్యక్షంగా వీక్షించిన అమెరికా అధ్యక్షుడు

పిరికిపందలా కుక్క చావు చచ్చాడని ట్రంప్ వ్యాఖ్య

రష్యా, టర్కీ సహకారంతో ఆపరేషన్ పూర్తి

**అత్యంత** క్రూరమైన ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు, మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ అబూబకర్ అల్–బగ్దాదీ హతమయ్యాడు. వాయవ్య సిరియాలోని ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో తన ప్రత్యర్థి ఇంట్లో తలదాచుకున్న ఉగ్రవాద నాయకుడిని అమెరికా ప్రత్యేక దళాలు రహస్యంగా చేపట్టిన ఆపరేషన్‌లో మట్టుబెట్టాయి. ప్రత్యేకదళాల దాడితో తన ముగ్గురు పిల్లలను తీసుకొని ఓ సొరంగంలోకి పారిపోయిన బగ్దాదీ తప్పించుకునే అవకాశం లేక తనను తాను పేల్చుకున్నాడు. ఈ ఘటనలో బగ్దాదీ, అతని పిల్లలు సొరంగంలో హతమయ్యారు. అమెరికాకు చెందిన ఎనిమిది హెలికాప్టర్లు, రహస్య ఆపరేషన్లలో నిష్ణాతులైన కమాండోలు, ప్రత్యేక శిక్షణ పొందిన కే9 జాగిలాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. సొరంగంలోకి బగ్దాదీని తమ జాగిలాలే తరిమినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. 'ప్రపంచ నంబర్ వన్ ఉగ్రవాది బగ్దాదీ పిరికిపందలా కుక్క చావు చచ్చాడు. బగ్దాదీ ఎంతో దుర్మార్గుడు, క్రూరుడు. అమెరికా దళాల బారినపడి ప్రాణభయంతో పరుగెత్తుతూ.. ఏడుస్తూ, అరుస్తూ హతమయ్యాడు' అని ఆయన వ్యాఖ్యానించారు. సొరంగంలో మరణించింది బగ్దాదీయేనని డీఎన్‌ఏ పరీక్షల ద్వారా నిర్ధారించామని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో తమకు సహకరించిన రష్యా, టర్కీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.



సిరియాలోని ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో అమెరికా దళాల దాడిలో నేలమట్టమైన అల్ బగ్దాదీ తలదాచుకున్న స్థావరం

5

## భార్యే ఉప్పందించింది!

అధికారులకు బగ్దాదీ ఆచూకీ వెల్లడి

కూరగాయల బస్సుల్లో బగ్దాదీ ప్రయాణిస్తాడని చెప్పిన అతని సన్నిహితుడు

## కర్కోటకుడు

మతం పేరుతో మారణహోమం సృష్టించిన అల్ బగ్దాదీ

బందీలను దారుణంగా హతమార్చేలా అనుచరులకు శిక్షణ



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

సీనియర్ పాత్రికేయుడు, విశాలాంధ్ర మాజీ ఎడిటర్

# రాఘవాచారి కన్నుమూత

### అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస

నిబద్ధత కలిగిన జర్నలిస్టు: సంతాపం ప్రకటించిన సీఎం కేసీఆర్

మఖ్దూమ్‌భవన్ వద్ద పలువురు ప్రముఖుల నివాళి

విజయవాడలోని పిన్నమనేని సిద్ధార్థ దవాఖానకు భౌతికకాయం అప్పగింత

3






## డిసెంబర్ నాటికి పుత్తడి@42 వేలు

శనివారం బంగారం

పది గ్రాముల ధర రూ. 39,840

9

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 71.00 | రిటైల్ లైవ్ | 93.00 |
| డ్రెస్‌డ్ | 135.00 | స్కిన్‌లెస్ | 153.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 393.00 | రంగారెడ్డి | 393.00 |
| మెదక్ | 393.00 | కరీంనగర్ | 396.00 |
| వరంగల్ | 396.00 | చిల్లర ధర | 4.50 |

# గౌడలకే నీరా స్టాళ్లు

### నీరాను కల్తీ చేస్తే లైసెన్స్ రద్దు

ప్రభుత్వం తరఫున హైదరాబాద్‌లో స్టాళ్ల ఏర్పాటు

మార్గదర్శకాలు విడుదల చేసిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో నీరా పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలోనే నీరా పాలసీని ప్రకటించగా.. సోమవారం బీఆర్కే భవన్‌లో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ పాలసీ మార్గదర్శకాలను విడుదల చేశారు. వీటిప్రకారం.. నీరా స్టాళ్ల లైసెన్స్‌ల మంజూరులో గౌడ, ఈడిగ కులస్థులకే ప్రాధాన్యమిస్తారు. ఈ స్టాళ్లలో కల్లు అమ్మడానికి వీలు లేదు. వీటిని ఏర్పాటు చేసే ప్రాంతాలను ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ఖరారు చేస్తారు. నీరాను సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తరువాతే తీయాల్సిఉంటుంది. నీరాను కల్తీ చేసినట్టు రుజువైతే లైసెన్స్‌ను రద్దు చేస్తారు. తెలంగాణ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ద్వారా ఏర్పాటుచేసిన సహకార సంఘాల ద్వారా కూడా స్టాల్స్‌ను ఏర్పాటుచేయవచ్చు. ఈ సందర్భంగా

మిగతా 6వ పేజీలో

# వీడని మహా ఉత్కంఠ!

గవర్నర్‌తో విడివిడిగా భేటీ అయిన సీఎం ఫడ్నవీస్, శివసేన నేత దివాకర్ రౌత్

బీజేపీ, శివసేన మధ్య కుదరని సయోధ్య

అధికారంలో సమభాగం ఇవ్వాల్సిందేనని శివసేన పట్టు

రిమోట్ కంట్రోల్ తమ చేతుల్లోనే ఉందని వెల్లడి

5

# నకిలీ ఏజెంట్ల టికెట్ల దందా

రైల్వే అధికారుల దాడి..

రూ.14.51 లక్షల విలువైన టికెట్లు సీజ్

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రత్యేక డ్రైవ్

III

epaper.ntnews.com



రాజ్‌భవన్ దర్బార్‌హాలులో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు పుస్తకాలు అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు. చిత్రంలో వకులాభరణం కృష్ణమోహన్ కూడా ఉన్నారు.

# బొకేలు వద్దు.. పుస్తకాలు ఓకే

- తెలంగాణ వేగంగా ఎదుగుతున్నది
- గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తనను కలువడానికి రాజ్‌భవన్‌కు వచ్చేవారు పుష్పగుచ్ఛాలు (బొకేలు) తేవొద్దని, అంతగా కావాలంటే మంచి పుస్తకాలు తీసుకురావాలని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ కోరారు. దీపావళి సందర్భంగా ఆదివారం దర్బార్‌హాల్‌లో పౌరసంఘాలు, మహిళాసంఘాలు, పురప్రముఖులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు గవర్నర్‌ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తనను కలువడానికి వస్తున్న వారిలో అధిక శాతం మంది బొకేలు తెస్తున్నారని, కొందరు పుస్తకాలు తీసుకువస్తున్నారని అన్నారు. పూల బొకేలు తీసుకురాకుండా సమాజానికి ఉపయోగపడే మంచి పుస్తకాలు తెస్తే సంతోషిస్తానని చెప్పారు. తన వద్దకు చేరిన పుస్తకాలను పోగుచేసి విద్యార్థులకు, లైబ్రరీలకు, అవసరమున్న ఇతరులకు పంపిణీచేస్తానని తెలిపారు. రాజ్‌భవన్‌లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించినట్టు వెల్లడించారు. చివరకు టీ ప్లాస్కులను కూడా రాగి పాత్రలనే వాడుతున్నామని చెప్పారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఫిట్ ఇండియాలో భాగంగా రాజ్‌భవన్‌లో యోగా తరగతులను ఏర్పాటుచేశామని వివరించారు. తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న డైనమిక్ స్టేట్ అని కితాబిచ్చారు. ఇక్కడి ప్రజలు సౌమ్యులు, తెలివైనవారని పేర్కొన్నారు. రాష్ట్రంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడానికి త్వర లో తండాల్లో పర్యటిస్తానని, ఒకచోట రాత్రి బస కూడా చేస్తానని చెప్పారు.

### గవర్నర్ చేతులమీదుగా ధరణి ఫౌండేషన్ లోగో ఆవిష్కరణ

డాక్టర్ శ్రీధర్ స్థాపించిన 'శ్రీధరణి ఫౌండేషన్' లోగోను గవర్నర్ తమిళిసై ఆవిష్కరించారు. సమాజం నుంచి ఎంతో పొందుతున్న తాను తిరిగి సమాజానికి నిస్వార్థంగా సేవచేయాలన్న లక్ష్యంతో ఈ ఫౌండేషన్‌ను స్థాపించానని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రాజేష్ పొన్నాడ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ప్రైవేటు పర్మిట్లు!

మొదటిపేజీ తరువాయి...

అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీని ప్రైవేటీకరించరాదని స్పష్టమైన ఆలోచనలో ఉన్న ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం మేరకు కొన్ని రూట్లలో ప్రైవేటు బస్సులు నడుపుకోవటానికి మాత్రమే పర్మిట్లు జారీ చేయనున్నదని తెలుస్తున్నది.

### శాశ్వత పరిష్కారం దిశగా..

రూట్లకు పర్మిట్లు ఇస్తే బస్సులు నడుపడానికి ప్రైవేటువాహన యజమానులు కూడా సిద్ధంగా ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం వెయ్యి రూట్లలో పర్మిట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తే.. 21,453 దరఖాస్తులు రావడం గమనార్హం. దీన్నిబట్టి రాష్ట్రంలోని ప్రైవేటువాహన యజమానుల నుంచే కాకుండా.. ఇతర రాష్ట్రాల నుంచి కూడా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నదని రవాణాశాఖ అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది. విద్యార్థులకు పరీక్షలు ఉన్నప్పుడు, పండుగల సీజన్ ఉన్నప్పుడు.. ఇలా అదను చూసుకుని కార్మికసంఘాలు సమ్మెలకు పిలుపునిస్తున్నాయి. ప్రభుత్వాన్ని బెదిరింపులకు గురిచేస్తున్నాయి. సమ్మె జరిగినప్పుడల్లా ప్రజలకు విపరీతమైన అసౌకర్యం కలుగుతున్నది. దాదాపు 40 ఏండ్ల నుంచి ఇదేతంతు నడుస్తున్నది. దీన్నుంచి శాశ్వతంగా విముక్తి కావడానికి వివిధరూట్లలో బస్సులు నడిపేందుకు ప్రైవేటువారికి అవకాశం కల్పించడమే ఉత్తమమని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. త్వరలో జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### ప్రజలకు మెరుగైన సౌకర్యం కోసం..

ప్రస్తుతం ఆర్టీసీ వ్యవహారం కోర్టులో నానుతున్నది. ఇది ఎప్పటికి పరిష్కారం అవుతుందో తెలియదు. ప్రస్తుతం హైకోర్టులో ఉన్న కేసు సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశాలను కూడా తోసిపుచ్చలేమని అధికారవర్గాలు చెప్తున్నాయి. మరోవైపు ఆర్టీసీ నష్టాల్లో ఉన్నది. వచ్చే ఆదాయం కూడా సమ్మెవల్ల రావడంలేదు. తీవ్ర ఆర్థికసంక్షోభంలో ఆర్టీసీ చిక్కుకున్నది. దీని ఫలితంగా బస్సులకు డీజిల్ పోసే బంకులకు బకాయిలు పెద్దఎత్తున పేరుకుపోయాయి. ఏ క్షణమైనా బంకులు డీజిల్ సరఫరా నిలిపివేసే ప్రమాదం కూడా లేకపోలేదు. అదే జరిగితే ప్రస్తుతం తిరుగుతున్న బస్సులు కూడా ఏ క్షణమైనా ఆగిపోయే అవకాశం ఉన్నది. మరోవైపు తీసుకున్న అప్పులకు కిస్తీలు చెల్లించలేని స్థితిలో ఆర్టీసీ కూరుకుపోతున్నది. ఏ క్షణమైనా ఆర్టీసీని నాన్ పర్ఫార్మింగ్ అసెట్ (ఎన్పీయే)గా గుర్తించే అవకాశం ఉన్నది. ఈ పరిస్థితుల్లో తాము ప్రేక్షక పాత్ర వహించకూడదని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా, మరింత మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రూట్లకు పర్మిట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది.

## 24 గంటల్లో ఓ మోస్తరు వర్షాలు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** తెలంగాణలోని పలు ప్రాంతాల్లో రాగల 24 గంటల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నది. దక్షిణ శ్రీలంక తీరానికి దగ్గరలో నైరుతి బంగాళాఖాతంలో సోమవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 5.8 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది రాగల 24 గంటల్లో తమిళనాడు, శ్రీలంక మధ్య కోమోరిన్, దాని పరిసర ప్రాంతాల్లో తీవ్రంగా మారే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇది మరో 24 గంటల్లో ఆగ్నేయ అరేబియా సముద్రం, దానిని అనుకొని ఉన్న లక్షద్వీప్, మాల్దీవుల ప్రాంతాల్లో వాయుగుండంగా మారే అవకాశమున్నది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం తెలంగాణపై ఉండదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఇంకోవైపు అరేబియా సముద్రంలో ఏర్పడిన 'క్యార్' తుపాన్ ప్రభావం ఎంత మాత్రం తెలంగాణ రాష్ట్రం పై ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. కాగా రాగల 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నదని తెలిపారు. రాగల 36 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

### ఆదిలాబాద్ జిల్లాల్లో పిడుగుపాటుకు ఆరు గొర్రెలు మృత్యువాత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంతోపాటు సుజాతనగర్, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో సాయంత్రం వర్షం పడింది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో ఓ మోస్తరు వర్షం పడింది. దేవాపూర్ శివారులో పిడుగుపడటంతో ఆరు గొర్రెలు చనిపోగా, కాపరి గోనే సత్తయ్యకు తీవ్రగాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి పత్తి, మిర్చి, వరి పంటలు నీట మునిగాయి. తాడూరు మండలం పాపగల్‌లో ఇండ్లలోకి వరద నీరు చేరింది.



కొత్తగూడెం జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం



# రాత్రికిరాత్రి విలీనం ఎలా సాధ్యం?

## చర్చలకు ఆ డిమాండే ప్రధాన ఆటంకం

దానిని పక్కనపెట్టకపోతే సంక్షోభం ముదురుతుంది

అందుకే అది మినహా ఇతర అంశాలపై చర్చించాలన్నాం

ఆర్టీసీ కార్మికసంఘాల తీరుపై హైకోర్టు వ్యాఖ్యలు

నాలుగు డిమాండ్ల కోసం రూ.47 కోట్లు ఇవ్వగలరా?

వివరాలు తెలుపాలని ఏజీకి ధర్మాసనం సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

- ఆర్టీసీ వద్ద ఉన్నది రూ.10 కోట్లే
- రూ.47 కోట్లు ప్రభుత్వం ఇవ్వలేదు
- ఇప్పటికే రూ.425 కోట్లు ఇచ్చాం
- కార్మిక నేతల ప్రవర్తన సరిగాలేదు
- చర్చల నుంచి అర్ధంతరంగా వెళ్లారు
- 21 డిమాండ్లలో 16 ఆర్థిక పరమైనవి
- ఆర్టీసీ యాజమాన్యం వాదనలు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న మొదటి డిమాండ్.. మొత్తం చర్చల ప్రక్రియకు ఆటంకంగా మారిందని హైకోర్టు వ్యాఖ్యానించింది. రాత్రికిరాత్రి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించింది. ఆర్టీసీ సమ్మెను విరమింపజేసి, ప్రజల ఇబ్బందులు తొలిగించేలా ఆదేశాలు జారీచేయాలని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. విలీనం డిమాండ్‌ను పక్కనబెట్టి చర్చించాలని గత ఉత్తర్వుల్లో తాము చెప్పామని ధర్మాసనం పేర్కొన్నది. విలీనం అంశంపై పట్టుపబడితే సంక్షోభం మరింత ముదిరిపోతుందని వ్యాఖ్యానించింది. ఆర్థికంగా భారంపడని 21 డిమాండ్లపై చర్చించాలని చెప్పామని గుర్తుచేసింది. కార్మికుల సమస్యల కంటే తమకు ప్రజల సమస్యలే ప్రధానమని తెలిపిన ధర్మాసనం.. ఈ నెల 5 నుంచి జరుగుతున్న సమ్మెవల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించింది. 45 డిమాండ్లలో మొదటి డిమాండ్ అయిన విలీనంపై పట్టుబట్టబోమని చెప్తేనే తాము చర్చలు జరుపాలని పేర్కొన్నామని తెలిపింది. కార్మికసంఘాలు హామీ ఇచ్చిన తర్వాతే చర్చల దిశగా ప్రభుత్వం కూడా తన వైఖరిని మార్చుకున్నట్టుగా ధర్మాసనం గుర్తుచేసింది. మొత్తం డిమాండ్లను ఒకేసారి ముందుకు తెస్తే ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో, ఆర్టీసీ కార్మికులకు విశ్వాసం కల్పించేందుకు తాము 21 అంశాలపై చర్చలు జరుపాలని సూచించామని పేర్కొన్నది. విలీనం అంశాన్ని ఒక్క రాత్రిలో తేల్చలేమని వ్యాఖ్యానించింది. ప్రస్తుతానికి విలీనం డిమాండ్ పక్కనపెట్టడం వల్ల వచ్చిన ఇబ్బంది ఏమిటని కార్మిక సంఘాల తరపు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది.



### ఆర్టీసీ వద్ద ఉన్నది రూ.10 కోట్లే: ఏఏజీ

ప్రస్తుతానికి ఆర్టీసీ వద్ద రూ.10 కోట్లు మాత్రమే ఉన్నాయని అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు తన వాదనల సందర్భంగా పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్టీసీకార్మిక సంఘాలతో చర్చలకు సంబంధించిన నివేదికను ధర్మాసనం ముందుంచారు. 21 అంశాలపై చర్చించాలని హైకోర్టు సూచిస్తే విలీనం సహా అన్ని అంశాలపై చర్చలకు కార్మికసంఘాల నేతలు పట్టుబట్టారని, హైకోర్టు ఆదేశాలు లెక్కచేయకుండా రాజకీయపార్టీలతో సమావేశమై 19న బంద్ నిర్వహించారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశం మధ్యాహ్నం రెండు గంటలకయితే 2.55 గంటలకు వచ్చారని, చర్చల మధ్యలోనే మిగతా నేతలతో మాట్లాడి వస్తామని అర్ధాంతరంగా వెళ్లిపోయారని తెలిపారు. విలీనం డిమాండ్‌పై షరతులు పెట్టబోమని కార్మికసంఘాల న్యాయవాది పేర్కొన్నారని.. కార్మికసంఘాల నేతలు మాత్రం అన్ని అంశాలపై చర్చలకు పట్టుబట్టారని, చర్చల ప్రక్రియను అడ్డుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీ వద్ద రూ.10 కోట్లు మాత్రమే ఉన్నాయని, రూ.47 కోట్లు ఆర్టీసీకి ప్రభుత్వం ఇచ్చే పరిస్థితి లేదని స్పష్టంచేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.550 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఇప్పటికే రూ.425 కోట్లు విడుదల చేసిందని, ఇంకా నిధులు ఇచ్చే పరిస్థితి లేదని చెప్పారు. ఏటా కార్పొరేషన్‌కు రూ.1200 కోట్లు నష్టాలు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత సమ్మె కారణంగా రూ.175 కోట్ల మేర నష్టం వచ్చిందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి సంస్థ రూ.5,269 కోట్ల నష్టాల్లో కొనసాగుతున్నదని చెప్పారు. దీంతోపాటు 2600 బస్సులను మార్చాల్సి ఉన్నందున అదనంగా రూ.829 కోట్లు భారం పడుతుందని తెలిపారు. హైకోర్టు సూచించిన 21 డిమాండ్లలో 16 డిమాండ్లు ఆర్థిక సంబంధమైనవని, మరో రెండు డిమాండ్లు తీవ్ర భారం పడనున్న నేపథ్యంలో సాధ్యంకాదని తెలిపారు. మరో డిమాండ్‌ను ఏపీ పునర్విభజన చట్టం కారణంగా అమలు చేయడం సాధ్యంకాదని తెలిపారు. కేవలం రెండు డిమాండ్లు మాత్రమే ఆమోదయోగ్యంగా ఉన్నాయని ఈడీల కమిటీ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. ఈ నివేదికలోని అంశాలు ఆర్టీసీ యాజమాన్యం గుర్తించిన వాస్తవ పరిస్థితి అని, ఈ అంశాలను ఎలా అమలుచేయాలి? ఏయే సమస్యలు ఉన్నాయి? అనేదానిపై చర్చించి ఓ అంగీకారానికి రావాల్సిన బాధ్యత కార్మికసంఘాలపై ఉన్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఈడీల కమిటీ గుర్తించిన నాలుగు డిమాండ్లకు రూ.47 కోట్లు అవసరమని పేర్కొన్న ధర్మాసనం.. రూ.47 కోట్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదా? అని ఏఏజీ జే రాంచంద్రరావును ప్రశ్నించింది. ప్రస్తుతం ఆర్టీసీ వద్ద రూ.10 కోట్లు మాత్రమే ఉన్నాయని, ఇప్పటికే భారీగా నిధులు విడుదల చేసిన దరిమిలా రూ.47 కోట్లు ప్రభుత్వం ఇచ్చే పరిస్థితి లేదని కోర్టుకు వెల్లడించారు. ప్రభుత్వ వైఖరిని తెలుసుకునేందుకు అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్‌ను పిలిపించిన ధర్మాసనం.. ఆయన అభిప్రాయం కోరింది. ఈ సందర్భంగా ఏజీ వాదనలు వినిపిస్తూ.. చర్చల సందర్భంగా కార్మికసంఘాల నేతలు ప్రవర్తించిన తీరు తీవ్ర ఆక్షేపణీయంగా ఉన్నదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రూ.47 కోట్లు ఇచ్చినంత మాత్రాన సమస్య పరిష్కారంకాదని తెలిపారు. రూ.47 కోట్లు ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందని తాము భావిస్తున్నామని తెలిపిన ధర్మాసనం.. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని పేర్కొన్నది.

### బకాయిలపై స్పష్టత ఇవ్వండి..

ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ నుంచి ఆర్టీసీకి రావాల్సిన బకాయిలపై కార్మికసంఘాల తరపున న్యాయవాది చెప్పిన లెక్కలపై స్పష్టత ఇవ్వాలని ఏజీకి హైకోర్టు సూచించింది. రీయింబర్స్‌మెంట్ కింద, జీహెచ్‌ఎంసీ నుంచి దాదాపు రూ.4,900 కోట్లు రావాలని కార్మికసంఘాలు పేర్కొన్న లెక్కలపై స్పష్టత ఇవ్వాలని తెలిపింది. ఈ మేరకు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## ప్రభుత్వ దవాఖానలో ఐటీడీఏ పీవో సతీమణి ప్రసవం

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాచలం ప్రభుత్వ దవాఖానలో సోమవారం ఐటీడీఏ పీవో గౌతమ్ సతీమణి గౌతమి ప్రసవించారు. గౌతమి గర్భిణిగా కొన్ని నెలల నుంచి భద్రాచలం ప్రభుత్వ దవాఖానలోనే వైద్యసేవలు పొందుతున్నారు. నెలలు నిండటంతో సోమవారం ఆమె దవాఖానలో చేరగా.. వైద్యాధికారులు ఆమెకు సుఖప్రసవం చేశారు. గౌతమి పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవోకు పలువురు అభినందనలు తెలిపారు.



## నల్లమలపై మంచుదుప్పటి..

**నల్లమల** అడవిని మంచు దుప్పటి కప్పేసింది. ఎటు చూసినా పొగ మంచు కనువిందు చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని శ్రీశైలం ప్రధాన రహదారిపై ఉదయం 8 గంటలు దాటినా మంచు కురుస్తూనే ఉంది. ఈ దారి పొడువునా మంచు కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు, వ్యక్తులు కనిపించడపోవడంతో వాహనదారులు చాలా ఇబ్బందులకు గురయ్యారు.

- అమ్రాబాద్ రూరల్

### ముహూర్తం



సూర్యోదయం: 6.14 గంటలకు



సూర్యాస్తమయం: 5.42 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తికమాసం, శుక్లపక్షం, విదియ తె.జా. 3.47 (తెల్లవారితే బుధవారం) వరకు, తదుపరి తదియ, నక్షత్రం: విశాఖ రాత్రి 11.10 వరకు, తదుపరి అనురాధ, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.02 నుంచి సాయంత్రం 4.31 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 2.50 నుంచి సాయంత్రం 4.16 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.31 నుంచి 9.17 వరకు, తిరిగి రాత్రి 10.40 నుంచి 11.26 వరకు, వర్జ్యం: ఉదయం 6.10 నుంచి 7.39 వరకు.

### లోకం పోకడ



'చేయి' కాలింది దీపావళి పటాసుల్లో కాదు, హుజూర్‌నగర్ ఎన్నికల్లో!

# ఫిబ్రవరిలో యాదాద్రి ఆలయ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి...

వివరించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ గ్రామంలో చినజీయర్ స్వామి ఆశ్రమంలో జరిగిన తిరునక్షత్రోత్సవంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు పాల్గొన్నారు. సీఎం దంపతులకు చినజీయర్ స్వామి పట్టువస్త్రాలు అందించి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలోని పలు ప్రాంతాల్లోని పండితులను యాదాద్రిలో జరిగే మహా సుదర్శనయాగానికి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. 'చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో విశేష యాగాన్ని తలపెట్టాం. ఆలయ సేవలకు భంగం కలుగకుండా మీకు రెండు ప్రత్యేక విమానాలు ఏర్పాటుచేస్తం. మీరు రోజు వచ్చి మా కార్యక్రమంలో పాల్గొనాలి' అని కోరితే ఆ పండితులు సంతోషపడ్డారని చెప్పారు. యాదాద్రి పునర్నిర్మాణంపై జీయర్ స్వామి సలహాలు అపారమైనవని అన్నారు. ఆయన మీద ఉండే విశ్వాసం, భక్తితో యాదాద్రి పునర్నిర్మాణ పనులు చేపట్టామని చెప్తే తిరుమల ప్రధాన అర్చకులు చూడటానికి వచ్చి చాలా వైభవంగా ఉన్నదన్నారని, యాగానికి కూడా వస్తామని చెప్పారని పేర్కొన్నారు. మహాసుదర్శన యాగం, రామానుజ జీయర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాలు గొప్పగా జరుగుతాయని చెప్పారు. యాదాద్రికి అందరినీ వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోవచ్చునని, కానీ, శుభప్రదమైన తిరునక్షత్రం రోజున.. ఈ వేదిక నుంచి ఆహ్వానిస్తున్నానని చెప్తూ.. మహాసుదర్శన యాగానికి మీరంతా వచ్చి, స్వామి వారిచేత ప్రసాదం స్వీకరించాలని కోరారు. యాగ నిర్వహణ బాధ్యత, క్రమశిక్షణతో ఉండే వికాస తరంగిణికి అప్పగిస్తామని ప్రకటించారు.

### తల్లిదండ్రుల నుంచే సంస్కారం

భగవండిని పూజించే సంస్కారం, ఆచారం తనకు తల్లిదండ్రుల నుంచే పరంపరగా వచ్చిందని సీఎం కేసీఆర్ చెప్పారు. చినజీయర్ స్వామి 1986-87 ప్రాంతంలో సిద్దిపేటలో బ్రహ్మయజ్ఞం చేయాలని తలపెట్టారని, ఆ సమయంలో స్వామి తనను అనుగ్రహించి, ఆ ఏడురోజులు తమ ఇంట్లోనే బసచేశారని గుర్తుచేసుకున్నారు. స్వామికి తానే కారు డ్రైవర్‌గా మారిపోయానన్నారు. యాగం మధ్య బ్రహ్మాండమైన వర్షం కురుస్తుందని స్వామి చెప్తే తాను నమ్మలేదని, కానీ సరిగ్గా యజ్ఞం ఐదోరోజు కార్యక్రమాలు పరిసమాప్తి అయ్యే సమయంలో అద్భుతమైన వర్షం వచ్చిందన్నారు. అప్పటి పరిస్థితుల్లో అశాంతి, హత్యల వంటివి జరుగకూడదని తాను ప్రత్యేకంగా ప్రార్థిస్తే స్వామి అనుగ్రహించి సిద్దిపేటలో శాంతి మంత్రాలు జపిస్తూ పట్టణమంతా శాంతి యాత్ర కూడా చేశారని గుర్తుచేశారు.

### మన సంస్కారం చాలా బలమైనది

మన హైందవ మతం, మన సంస్కారం చాలా బలంగా ఉంటాయని సీఎం కేసీఆర్ చెప్పారు. 'ఒకరోజు రవీంద్రభారతిలో సిద్ధాంతిగారిని వారి షష్టిపూర్తి సందర్భంగా పల్లకిలో మోసుకెళ్లి గొప్పగా కార్యక్రమం చేస్తున్నాం. ఆ రోజు అక్కడున్న స్వాములు 'హైందవ సంప్రదాయం మీద దాడి జరుగుతున్నది. కంసుడిని పూజించాలనే దుర్మార్గులు బయదేరారు. ఇది చాలా ప్రమాదకరం' అని చెప్పారని గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో స్వామివారు తనను మాట్లాడాల్సిందిగా కోరితే.. 'చిన్న పాపాయిని లాలిస్తూ తల్లి 'జో అచ్యుతానంద.. జోజో ముకుంద.' అని పాడుతుందే తప్ప.. 'జో దుర్యోధన.. జో కుంభకర్ణ.. జో కంస'.. అని ఏ తల్లి కూడా పాడదు. అటువంటి ఆదర్శం చనుబాలు తాగిస్తూనే ఆ తల్లి పిల్లవానికి అందిస్తుంది. అంత బలమైన సంప్రదాయానికి, మన పద్ధతికి అసలు విఘాతం కలిగే ప్రశ్న లేనేలేదు.. ఎవ్వరూ గాభరాపడకండి' అని చెప్పానని గుర్తుచేసుకున్నారు. అట్లాంటి సందర్భం వస్తే జీయర్ స్వామి లాంటివారు చాలామంది ఉన్నారని, వారే కాపాడుతారని, లక్షలమంది మంది భక్తులను తయారుచేస్తారని చెప్పానని తెలిపారు.

### సేవకుడిగా పనిచేస్తా

చినజీయర్‌స్వామి సంకల్పం మేరు రామానుజ జీయర్‌స్వామి హైదరాబాద్‌లో వెలియడం మనందరికీ గర్వకారణమని సీఎం కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో తాను ఒక సేవకుడిగా పనిచేస్తానని చెప్పారు. విదేశాల నుంచి వచ్చిన కొంతమంది శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగుతుంటే పెద్ద విగ్రహం కనిపించిందని, అది ఎవరిదని తనను అడిగారని, అందుకు తాను.. అది తమకు పెద్ద గురువు, రెవల్యూషనరీ గురువుదని చెప్పానని తెలిపారు. స్వామిని తిరునక్షత్రం సందర్భంలో దర్శించుకోవడమే మహాభాగ్యమని చెప్పారు. ఈ రోజు మా తల్లిగారి ఆబ్దికం ఉంటే బంధువులంతా వచ్చారని, తాను తిరునక్షత్రం వేడుకల్లో పాల్గొనేందుకు చినజీయర్‌స్వామి ఆశ్రమానికి వెళుతున్నానని చెప్తే వారంతా కూడా తనతో వచ్చారని తెలిపారు. 'స్వామివారి దివ్య విగ్రహం దివ్యదేశాలకు సంబంధించిన అద్భుతమైన ప్రాంగణం. ఇది ఇండియాలో ఎక్కడా దొరుకదు. 108 క్షేత్రాలు తిరిగితే తప్ప ఆ భాగ్యం కలుగదు' అని చెప్పారు. ఇంతటి మహా ప్రాంగణం హైదరాబాద్‌వాసులకు గర్వకారణమని, పూర్వజన్మ సుకృతమని అన్నారు. దీని నిర్మాణంలో జూపల్లి రామేశ్వరరావు కృషి అపారమైనదంటూ ప్రశంసించారు. జీయర్ స్వామి తనను అనుగ్రహించి, మంగళాశాసనం చేసి, వస్త్రాలు, పెద్దస్వామి సేవలకు సంబంధించిన పెద్ద పుస్తకాన్ని బహూకరించారని చెప్తూ.. ధన్యవాదాలు తెలిపారు.

### దైవానుగ్రహానికి అందరూ యోగ్యులే

'విశ్వ శరీరి అయిన భగవంతుడు ఒక్కడే. ఆయన దయామయుడు. జాతి, కులం, విద్య, సంపదలతో సంబంధం లేకుండా ఆ దైవానుగ్రహం పొందేందుకు అందరూ యోగ్యులేనని మొదటగా లోకానికి చాటిన మహనీయులు భగవద్రామానుజులు, శ్రీశ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి' అని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి వక్కాణించారు. చినజీయర్‌స్వామివారి తిరునక్షత్ర మహోత్సవ వేడుకల్లో భాగంగా తొలిరోజు సోమవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని ముచ్చింతల్ సమీపంలో ఉన్న శ్రీరామనగరంలో ఘనంగా ప్రారంభోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి భక్తులకు మంగళాశాసనాలు అనుగ్రహించారు. స్వామి అనుగ్రహభాషణంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆధ్యాత్మిక, సామాజిక, పాలనాపరమైన ప్రజాసేవను కొనియాడారు. సమాజంలో వేదం జ్ఞానప్రసాదం వంటిదని, సర్వానికి వేదమే మూలాధారమని తెలిపారు. వేద వాఙ్మయంతోనే పెద్దజీయర్ స్వామి.. సమాజంలో నిర్లక్ష్యానికి గురైన ఉపేక్షిత, దళితవర్గాలకు దేవాలయప్రవేశం కల్పించి మంత్రోపదేశం చేశారని, సంఘసంస్కర్తగా నిలిచారని తెలిపారు. వారు సంస్కరించిన ఉదాత్త సామాజిక, ధార్మిక చైతన్య ఉద్యమంలో ప్రతిఒక్కరు సమాజశ్రేయస్సులో భాగస్వాములుకావాలని పిలుపునిచ్చారు. భగవద్రామానుజులవారి సహస్రాబ్ది ఉత్సవాల గురించి తెలియజేశారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవల్లో మై హోం గ్రూపు సంస్థల అధినేత జూపల్లి రామేశ్వరరావు కృషి అద్వితీయమని అభినందించారు. జూపల్లి రామేశ్వరరావు మాట్లాడుతూ తిరునక్షత్ర మహోత్సవాలు అత్యంతవైభవంగా ఇక్కడ జరుగటంతో ఈ ప్రాంతం పునీతమైందన్నారు. సమాజశ్రేయస్సుకు అహర్నిశలు కృషిచేస్తున్న చినజీయర్ స్వామి 126 ఏండ్లపాటు జీవించాలని ఆకాంక్షించారు. పలువురు పీఠాధిపతులు మాట్లాడుతూ చినజీయర్ సంస్థల సామాజిక, ఆధ్యాత్మిక సేవలను ప్రశంసించారు.



సోమవారం ముచ్చింతల్‌లోని ఆశ్రమంలో తన తిరునక్షత్ర వేడుకల్లో మాట్లాడుతున్న చిన్న జీయర్‌స్వామి. చిత్రంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు, ఎంపీ సంతోష్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు జూపల్లి రామేశ్వర్‌రావు కూడా ఉన్నారు.



పెద్ద జీయర్‌స్వామిపై రచించిన 'సత్య సంకల్ప' పుస్తకాన్ని సీఎం కే చంద్రశేఖర్‌రావు దంపతులకు బహూకరిస్తున్న చిన్నజీయర్‌స్వామి. చిత్రంలో ఎంపీ సంతోష్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు జూపల్లి రామేశ్వర్‌రావు ఉన్నారు.

### దివ్యసాకేతంలో ప్రత్యేక పూజలు

అంతకుముందు చినజీయర్‌స్వామి దివ్యసాకేతంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామీజీకి ఆశీస్సులు అనుగ్రహించారు. చినజీయర్ తిరునక్షత్ర మహోత్సవం వేడుకల ప్రారంభానికి సీఎంతోపాటు మై హోం అధినేత, టీటీడీ బోర్డు సభ్యుడు డాక్టర్ జూపల్లి రామేశ్వరరావుతోపాటు బెంగళూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి, హిందూ దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కమలానందభారతిస్వామి, మంత్రాలయ పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థస్వామి, శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ జీయర్‌మఠం పీఠాధిపతి శఠగోప రామానుజజీయర్‌స్వామి, అహోబిల జీయర్ స్వామి, దేవనాథ జీయర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ సంతోష్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో జీయర్ అవార్డు-2019ను కాకతీయ వీరయ్య, తిరుపతి వాస్తవ్యులు మద్దులపల్లి సూర్యనారాయణ ఘనాపాటి, సలక్షణ ఘనాపాటి పురుషోత్తమాచార్యులకు ప్రదానం చేశారు. చినజీయర్‌స్వామి స్వీయపర్యవేక్షణలో వివిధ ప్రాంతాలకు చెందిన పండితులు భగద్రామానుజుల ఆధ్యాత్మిక, సామాజిక సేవాకార్యక్రమాలపై చర్చించారు. చినజీయర్‌స్వామివారికి టీటీడీ అధికారులు వేంకటేశ్వరస్వామి శేషవస్త్రాలను, ప్రసాదాన్ని అందజేశారు.

# ప్రజల మెప్పు పొందాలి

ఎమ్మెల్యే సైదిరెడ్డిని అభినందించిన మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ప్రజలు ఉపఎన్నికలో టీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పట్టారని, వారి నమ్మకానికి అనుగుణంగా పనిచేసి మెప్పు పొందాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు.. ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి సూచించారు. సోమవారం ప్రగతిభవన్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డితో వచ్చి తనను కలిసిన సైదిరెడ్డిని కేటీఆర్ అభినందించారు. అనంతరం సీఎం కేసీఆర్ ఇటీవల నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు, తదుపరి కార్యాచరణపై చర్చించారు. నవంబర్ 1న హుజూర్‌నగర్, నేరేడుచర్లలో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కేటీఆర్‌ను కలిసినవారిలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా కూడా మంత్రి కేటీఆర్‌తో సమావేశమయ్యారు. హుజూర్‌నగర్ ఎన్నికల సందర్భంగా పనిచేసినందుకు అభినందించారు.

**పలువురు మంత్రులతో భేటీ**

ఎమ్మెల్యే సైదిరెడ్డి సోమవారం అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసానిని కూడా కలిశారు. ఈ సందర్భంగా సైదిరెడ్డిని వారు అభినందించారు.



సోమవారం మంత్రి కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సోమవారం మంత్రి కేటీఆర్‌ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ ఎలక్షన్స్‌లో బాగా పనిచేశారని ఎమ్మెల్యేను అభినందించారు.



మంథనిలో వచ్చేనెల 3న పుట్టలింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీనివాస కల్యాణానికి హాజరుకావాలని మంత్రి కేటీఆర్‌కు పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఆహ్వానపత్రిక అందజేశారు. ఆయనవెంట ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఉన్నారు. -పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ





శంషాబాద్ విమానాశ్రయంలో పట్టుకున్న బంగారం పేస్ట్

## శంషాబాద్‌లో బంగారం పేస్ట్ పట్టివేత

**శంషాబాద్:** శంషాబాద్ విమానాశ్రయంలో సోమవారం కస్టమ్స్ అధికారులు బంగారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు ఎఫ్‌జెడ్ 435 విమానంలో వచ్చిన మహబూబ్ అలీఖాన్ తన జీన్ దుస్తుల్లోని ప్రత్యేక ప్యాకెట్‌లో బంగారం పేస్ట్ తీసుకొచ్చినట్టు కస్టమ్స్ అధికారులు తనిఖీలో గుర్తించారు. సుమారు రూ.19 లక్షల విలువచేసే 506 గ్రాముల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకుని, స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# అడవుల రక్షణకు చర్యలు

- ప్రజల భాగస్వామ్యంతో జంగిల్ బడావో-జంగిల్ బచావో
- మంత్రివర్గ ఉపసంఘం తొలిసమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో అడవుల రక్షణకు, పచ్చదనాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. 'జంగిల్ బడావో.. జంగిల్ బచావో' అన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంకల్పానికి అనుగుణంగా నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. అటవీ పోడుభూముల సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్ త్వరలో చర్యలు తీసుకుంటారని వెల్లడించింది. రాష్ట్రంలో అడవుల రక్షణ, పచ్చదనం పెంపు అంశంపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ తొలి సమావేశం సోమవారం బీఆర్కే భవన్‌లో జరిగింది. అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఐదేండ్లుగా పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని పెంచడానికి ప్రభుత్వం, అటవీశాఖపరంగా తీసుకుంటున్న చర్యలను అటవీ, పర్యావరణశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌తివారీ వివరించారు. ఐదు విడుతలుగా నిర్వహించిన హరితహారంలో భాగంగా అడవుల వెలుపల, బయటా 177 కోట్ల మొక్కలు నాటినట్టు వెల్లడించారు. నిరంతర పర్యవేక్షణ, రక్షణ చర్యలతో నాటిన మొక్కల్లో అధికశాతం ఏపుగా ఎదిగాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నాటిన మొక్కల వివరాలను కచ్చితంగా తెలుసుకోవాలని కనీసం 85 శాతం మొక్కలు బతికేలా చర్యలు తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం సూచించింది. రహదారులకిరువైపులా చేపట్టిన ఎవెన్యూప్లాంటేషన్ విజయవంతమయిందని అభినందించింది. తెలంగాణకు ఈ సారి పెరిగిన కంపా నిధుల వాటాను సద్వినియోగపరుచుకుని ప్రత్యామ్నాయ అడవుల సృష్టికి, అటవీ రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అటవీశాతం తక్కువగా ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. కరీంనగర్, గద్వాల, హైదరాబాద్, జనగామ, వరంగల్ అర్బన్, నారాయణపేట, సూర్యాపేట జిల్లాల్లో అడవుల విస్తీర్ణాన్ని పెంచడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అర్బన్‌పార్క్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నందున మిగిలినచోట్ల పార్క్‌ల పనులను కూడా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించింది. సమావేశంలో విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్‌మిశ్రా, పీసీసీఎఫ్ ఆర్ శోభ, వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ మునీంద్ర, అడిషనల్ పీసీసీఎఫ్‌లు ఆర్ ఎం డోబ్రియాల్, లోకేశ్‌జైస్వాల్, స్వర్గం శ్రీనివాస్, పర్గెయిన్, సింగరేణి, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.



అడవుల సంరక్షణ, పచ్చదనం పెంపుపై బీఆర్కేభవన్‌లో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి

# నిబద్ధతకు నిలువుటద్దం

రాఘవాచారి జీవితం నేటి తరానికి ఆదర్శం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిబద్ధత కలిగిన జర్నలిస్ట్‌గా, నడుస్తున్న విజ్ఞాన సర్వస్వంగా పేరొందిన రాఘవాచారి.. 1939 సెప్టెంబర్ 10న.. వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురంలో శ్రీమాన్ చక్రవర్తుల వెంకట వరదాచార్యులు, కనకవల్లి దంపతులకు ఐదో సంతానంగా జన్మించారు. వైష్ణవ సంప్రదాయ కుటుంబంలో జన్మించిన రాఘవాచారిని చిన్నప్పుడు అందరూ 'రాఘవన్' అని పిలిచేవారు. ఆయన తల్లిది కృష్ణా జిల్లా మానికొండ సమీపంలోని బోకినాల గ్రామం. గుంటూరు జిల్లాకు చెందిన కమ్యూనిస్టు నేత కనపర్తి నాగయ్య కూతురు జోత్స్నను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆయన బాల్యంలో ఇంటివద్దనే సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లిష్‌తోపాటు తల్లివద్ద తమిళం కూడా నేర్చుకున్నారు. రాఘవాచారి తాతగారికి గొప్ప ఆయుర్వేద వైద్యుడనే పేరుండేది. విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డికి ఆయన వైద్యుడు. అయినప్పటికీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న నల్ల నరసింహులు, సీ యాదగిరిరావులాంటి వారు వీరి ఇంట్లోనే ఆశ్రయం పొందేవారు. నిజాంకు వ్యతిరేకంగా చెలరేగిన అల్లకల్లోలం వల్ల రాఘవాచారి కుటుంబం శాతాపురం నుంచి మానికొండకు తరలిపోయింది. పోరాట విరమణానంతరం 1949లో వారి కుటుంబం సికింద్రాబాద్‌కు చేరింది.

**విద్యార్థి దశలోనే ఉద్యమాల వైపు..**

రాఘవాచారిపై విద్యార్థి దశలోనే ఉర్దూ కవి, మార్క్సిస్ట్ మేధావి మఖ్దూమ్ మొహియుద్దీన్, శ్రీశ్రీ ప్రభావం పడింది. కమ్యూనిస్టు భావజాలం అలవడింది. విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1963-64లో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఉస్మానియా లా కళాశాల విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా పనిచేశారు. 'మహాకవి శ్రీశ్రీ' అంటూ ఆయన తన కాలేజీ రోజుల్లోనే విశ్లేషణాత్మక వ్యాసంరాశారు. న్యాయశాస్త్రంలో హిందూ ధర్మశాస్త్రాన్ని ఆప్షనల్ సబ్జెక్టుగా తీసుకొని లోతుగా అధ్యయనం చేశారు. న్యాయశాస్త్రంలో విద్యనభ్యసించిన రాఘవాచారి.. పాత్రికేయరంగాన్ని ఎంచుకోవడం విశేషం. రాజకీయాలు, చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, సామాజికాంశాలపై విస్తృతంగా అధ్యయనంచేశారు. ఆయన కేవలం చదవడమే కాదు.. బాగా ఆకళింపు చేసుకొనేవారు. ఆయన జ్ఞాపకశక్తి కూడా అమోఘం. అందుకే ఆయనను తోటి పాత్రికేయులు, రచయితలు, పలువురు మేధావులు సైతం నడుస్తున్న విజ్ఞాన సర్వస్వం అని అంటుంటారు. సీనియర్ పాత్రికేయులు ఎం రాజేంద్ర, ఆర్ శ్రీనివాసన్ లాంటివారితోనూ ఆయనకు చక్కటి సంబంధాలు ఉండేవి.

**విశాలాంధ్రలో ప్రస్థానం**

1965 జూలైలో విశాలాంధ్ర పత్రిక రిపోర్టర్‌గా చేరిన రాఘవాచారి.. 1968-1971 మధ్య ఢిల్లీ నుంచి వెలువడే పేట్రియాట్ దినపత్రిక, లింక్ ఆంగ్లవార పత్రికలకు స్టాఫ్ కరస్పాండెంట్‌గా పనిచేశారు. 1972 నుంచి 2000 వరకు విశాలాంధ్ర సంపాదకుడిగా కొనసాగారు. ఎన్నెన్నో వినూత్నమైన సంపాదకీయాలు రాసి, ఆ పత్రికకు గొప్ప సొబగులు అద్దారు. సంపాదకుడిగా ఆయన బాధ్యతల నుంచి తప్పుకొని 15 ఏండ్లు గడిచినా.. ఇప్పటికీ ఆయన విశాలాంధ్ర రాఘవాచారిగానే జనం మదిలో నిలిచిపోయారు. 1970-71 ప్రాంతంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయన 1998లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డుతోపాటు మరెన్నో అవార్డులు, సత్కారాలు అందుకున్నారు. 'నేను మొదట కమ్యూనిస్టుని.. ఆ తర్వాతే జర్నలిస్టును అయ్యా ' అని రాఘవాచారి తరచూ చెప్పుండేవారు. 1965లో కమ్యూనిస్టు పార్టీ ఏపీ కౌన్సిల్‌కు ఆహ్వానితుడిగా, 1971లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, 1974లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, 1986-98 జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా, జాతీయ కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా కూడా సేవలందించారు.

**నిరంతర విద్యార్థి**

రాఘవాచారి నిరంతర విద్యార్థి. చరిత్ర లోతులను శోధించి, గంభీరంగా మాట్లాడే నేర్పు ఆయన సొంతం. సంస్కృతం, తెలుగు, ఆంగ్లం, ఉర్దూభాషల్లో ఆయన పండితుడు. ప్రాచీన సాహిత్యం, మార్క్సిస్ట్ గ్రంథాలపై ఎనలేని పట్టు ఉండేది. జర్నలిస్టుగా, సామాజిక కార్యకర్తగా ఆయన జీవితం ఆదర్శంగా నిలిచింది.



### రాఘవాచారి పొందిన అవార్డులు

- 1985లో శ్రీమతి విజయలక్ష్మి స్మారక పురస్కారం
- 1987లో జమీన్ రైతు వెంకట్రామానాయుడు పురస్కారం
- 1990లో తెలుగు వర్సిటీ నుంచి తాపీ ధర్మారావు ఉత్తమ సంపాదకత్వ అవార్డు
- 1993లో విజయవాడ సిద్దార్థ కళాపీఠం విశిష్టపురస్కారం
- 1996లో కాశీనాథుని నాగేశ్వరరావు స్మారక పురస్కారం
- 1997లో మద్రాసు తెలుగు అకాడమీ పురస్కారం
- 1999లో జాతీయ సమైక్యత అవార్డు
- 1998లో ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు
- 2003లో మాదల వీరభద్రరావు సాహితీ పురస్కారం

# విశాలాంధ్ర రాఘవాచారి కన్నుమూత

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన మార్క్సిస్ట్ మేధావి
- విజయవాడలోని పిన్నమనేని సిద్ధార్థ దవాఖానకు భౌతికకాయం అప్పగింత
- నిబద్ధత కలిగిన జర్నలిస్ట్: సంతాపం ప్రకటించిన సీఎం కేసీఆర్
- మఖ్దూమ్‌భవన్ వద్ద పలువురు ప్రముఖుల నివాళి



రాఘవాచారి భౌతికకాయం వద్ద జోహార్లు అర్పిస్తున్న సీపీఐ నేతలు నారాయణ, చాడ వెంకటరెడ్డి, అజీజ్‌పాషా, పశ్య పద్మ తదితరులు





రాఘవాచారి భౌతిక కాయాన్ని పిన్నమనేని సిదార్థ దవాఖానకు తరలిస్తున్న సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీనియర్ పాత్రికేయుడు, విశాలాంధ్ర మాజీ ఎడిటర్, మార్క్సిస్ట్ మేధావి చక్రవర్తుల రాఘవాచారి (80) కన్నుమూశారు.కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన.. నెలరోజులుగా హైదరాబాద్ శివారు కొంపల్లిలోని తన కూతురు డాక్టర్ అనుపమకు చెందిన సురక్ష వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు కూతురే స్వయంగా వైద్యసేవలు అందించారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు రాఘవాచారి తుదిశ్వాస విడిచినట్టు వైద్యులు ప్రకటించారు. ఆయన భౌతికకాయాన్ని పార్టీ శ్రేణులు, కార్యకర్తల సందర్శనార్థం తొలుత హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్‌భవన్‌కు తరలించారు. అక్కడ నాయకులు, కార్యకర్తలతోపాటు పలువురు సంపాదకులు, సహచర పాత్రికేయులు భౌతికకాయాన్ని సందర్శించి, నివాళి అర్పించారు. అనంతరం భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడలోని విశాలాంధ్ర కార్యాలయానికి తరలించారు. అక్కడ పలువురు నివాళి అర్పించిన అనంతరం ఆయన కుటుంబసభ్యులు రాత్రి 7 గంటలకు పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్‌కు అప్పగించారు. రాఘవాచారికి భార్య జ్యోత్స్న ఉన్నారు.

**మంత్రుల సంతాపం**

రాఘవాచారి మృతిపట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తదితరులు సంతాపం ప్రకటించారు. విలువలు కలిగిన జర్నలిస్ట్‌గా ఆయన సాగించిన జీవితం ఆదర్శప్రాయమన్నారు. రాఘవాచారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాఘవాచారి మరణవార్త తెలిసినవెంటనే మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దవాఖానకు చేరుకుని, పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంతాపం ప్రకటించినవారిలో రాజ్యసభ మాజీసభ్యుడు రాపోలు ఆనందభాస్కర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు, సాహితీవేత్తలు శంకరమంచి శ్యాంప్రసాద్, రాపోలు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

### సీఎం కేసీఆర్ సంతాపం

సీనియర్ సంపాదకుడు, సామాజిక ఉద్యమకారుడు రాఘవాచారి మృతిపట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నిబద్ధత కలిగిన జర్నలిస్ట్‌గా, విలువలు కలిగిన సామాజిక కార్యకర్తగా ఆయన సాగించిన జీవితం ఆదర్శప్రాయమన్నారు. ఆయన కుటుంబసభ్యులకు, సహచరులకు సీఎం కేసీఆర్ ప్రగాఢసానుభూతిని తెలియజేశారు.

**పలువురు ప్రముఖుల నివాళి**

రాఘవాచారి పార్థివదేహానికి ఉదయం మఖ్దూంభవన్ వద్ద సీపీఐ నేతలు నారాయణ, చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, అజీజ్ పాషా, విశాలాంధ్ర గౌరవ చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు నివాళి అర్పించి, సంతాపం తెలిపారు. సీనియర్ పాత్రికేయుడు కే శ్రీనివాస్‌రెడ్డి, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్, నవతెలంగాణ ఎడిటర్ వీరయ్య, ప్రజాశక్తి ఎడిటర్ పాతూరి రామయ్య, సీనియర్ పాత్రికేయులు కే రామచంద్రమూర్తి, వరదాచారి, దేవులపల్లి అమర్, నందిరాజు రాధాకృష్ణ తదితరులు రాఘవాచారి భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవాచారి సేవలను, కీర్తిని కొనియాడారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు. విజయవాడలో ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

**టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం**

**అంబర్‌పేట:** రాఘవాచారి మృతికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బీ బసవపున్నయ్య, ఉపాధ్యక్షుడు పులిపలుపుల ఆనందం మ తదితరులు మగ్దూంభవన్‌లో రాఘవాచారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కే పాండురంగారావు, ఏపీ ఫెడరేషన్ నాయకులు ఎ అమరయ్య, కొండయ్య, హెచ్‌యూజే కార్యదర్శి బీవీఎన్ పద్మరాజు నివాళులర్పించారు.

### గ్రూప్-2 పోస్టులకు ఎస్సీ స్టడీసర్కిల్ అభ్యర్థుల ఎంపిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో ఎస్సీ స్టడీసర్కిల్‌కు చెందిన పలువురు ఎంపికైనట్టు ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్ పీ కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. డీటీవో, ఏఎస్‌వో, డీటీ, ఏసీటీవో, టీఎస్‌ఎస్‌ఎస్‌సీ, ఎక్సైజ్‌శాఖ ఉద్యోగాలకు ఎంపికైనట్టు చెప్పారు. ఎంపికైనవారిలో ఎస్సీ క్యాటగిరీలో యాదయ్య, శోభ, అఖిల సాధన, విజయలక్ష్మి, ఎన్ అనిల్, ఎస్టీ క్యాటగిరీలో రఘు, ఐ రవికుమార్, బీసీ క్యాటగిరీలో పీ శ్రీనయ్య, పీ శ్రీనివాస్‌గౌడ్, సాయిరాం, బీ సింధుజ ఉన్నారు.

### షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

**మల్లాపూర్:** జగిత్యాల జిల్లా మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి పెరుమాండ్ల రాజేందర్‌గౌడ్‌కు చెందిన బేకరీ, కూల్‌డ్రింక్స్ దుకాణం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిబూడిదయింది. ఎప్పటి మాదిరిగానే ఆదివారం రాత్రి రాజేందర్‌గౌడ్ తన దుకాణాన్ని మూసేసి ఇంటికెళ్లాడు. ఆ తర్వాత కొద్ది గంటలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు రేగడంతో దుకాణంలోని ఫ్రిజ్‌లు, ఫర్నిచర్‌తోపాటు, సుమారు రూ.2 లక్షల విలువైన సామగ్రి కాలిపోయింది.

# ఓ కూతురు కిరాతకం!

- చెడు తిరుగుళ్ళు వద్దన్నందుకు తల్లినే చంపేసింది
- ఇంట్లోనే తల్లి మృతదేహంతో మూడురోజులు గడిపిన కూతురు
- తండ్రిపైనే ఆరోపణలు.. తల్లి అదృశ్యమైందని ఫిర్యాదు
- హైదరాబాద్ శివారులోని మునుగనూరులో ఘటన



రజిత (ఫైల్)



కీర్తి



శశి

**హైదరాబాద్ సిటీబ్యూరో/హయత్‌నగర్, నమస్తే తెలంగాణ:**

చెడు తిరుగుళ్ళు వద్దని మందలించినందుకు తల్లినే అతి కిరాతకంగా హతమార్చిందో కూతురు. నవమాసాలు మోసి కని పెంచిన తల్లిని కర్కశంగా చంపి అదే ఇంట్లో ఓ స్నేహితుడితో రహస్యంగా మూడురోజులపాటు గడిపింది. హత్యారోపణలు తండ్రిపై నెట్టేందుకు ప్రియుడి ఇంట్లో మరో మూడు రోజులు దాక్కుంది. ఈ ఘటన హైదరాబాద్ శివారు హయత్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హత్య జరిగిన వారంరోజుల తర్వాత అసలు మిస్టరీ బయటపడటంతో కలకలం రేగింది. మృతురాలి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లాకు చెందిన పల్లెర్ల శ్రీనివాస్‌రెడ్డి, రజిత దంపతులు. కూతురు కీర్తితో వలస వచ్చి హయత్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని మునుగనూరు గ్రామం ద్వారకానగర్‌లో నివాసం ఉంటున్నారు. లారీ డ్రైవర్ అయిన శ్రీనివాస్‌రెడ్డి పది, పదిహేను రోజులకోసారి ఇంటికి వస్తుంటాడు. కూతురు కీర్తి డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. చెడు తిరుగుళ్ళు తిరుగొద్దని కూతురును తల్లి ఈ నెల 19న మందలించింది. ఈ విషయంపై ఇద్దరు గొడవపడ్డారు. ఈ గొడవను మనసులో పెట్టుకున్న కీర్తి.. అదేరోజు రాత్రి ఇంటిపక్కనే ఉండే స్నేహితుడు శశిని పిలిచి తల్లి రజిత హత్యకు పథకం రచించింది. నిద్రపోతున్న తల్లి రజిత కాళ్లు, చేతులు పట్టుకోమని శశికి చెప్పిన కూతురు చీరతో తల్లికి ఉరి బిగించి చంపేసింది. ఇంటికి బయటి నుంచి తాళం వేసి తల్లి మృతదేహం ఉన్న ఇంట్లోనే శశితో మూడురోజులు రహస్యంగా గడిపింది. నాలుగోరోజున దుర్వాసన వస్తుండటంతో శశి సాయంతో కారులో తన సొంతూరైన నీర్నాముల తీసుకెళ్లి రైల్వే ట్రాక్‌పై పడేసింది. ఇంటికి తిరిగి వస్తూ హయత్‌నగర్‌లో నివసించే ప్రియుడు బాల్‌రెడ్డి తండ్రికి ఫోన్ చేసిన కీర్తి.. తల్లి రజితలాగా మాట్లాడి తాను, తన భర్త నల్లగొండ దవాఖానలో ఉన్నందున కూతురు ఇంట్లో ఒంటరిగా ఉన్నదని చెప్పింది. తాము ఇంటికి రావడానికి రెండు, మూడురోజులు పడుతున్నందున అప్పటివరకు మీ ఇంట్లో ఉండనీయండని బతిమాలింది. నిజమని నమ్మిన బాల్‌రెడ్డి తండ్రి సరేననడంతో.. కీర్తి నేరుగా బాల్‌రెడ్డి ఇంటికి వెళ్లిపోయి అక్కడ మరో మూడురోజులు గడిపింది.



రజిత మృతదేహాన్ని తరలించేందుకు ఉపయోగించిన వాహనం

### హత్య బయటపడింది ఇలా..

శ్రీనివాస్‌రెడ్డి డ్యూటీ ముగించుకొని ఈ నెల 24న ఇంటికి రాగా తాళం వేసి ఉంది. భార్య రజితకు ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో తిరిగి డ్యూటీకి వెళ్ళిపోయాడు. మరుసటిరోజు కూడా ఇంటికి తాళంవేసి ఉండటంతో కూతురుకు ఫోన్ చేయగా, స్నేహితులతో వైజాగ్‌లో ఉన్నట్టు చెప్పింది. అమ్మ కనిపించడం లేదు, వెంటనే వచ్చేయ్ అని తండ్రి చెప్పగా 26వ తేదీన బాల్‌రెడ్డి ఇంటి నుంచి నేరుగా తమ ఇంటికి వచ్చింది. తండ్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి హయత్‌నగర్ పోలీసుస్టేషన్‌కు వెళ్లిన కీర్తి.. తల్లి కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేసింది. తన తండ్రి తాగొచ్చి నిత్యం తల్లిని తిడుతాడని, పలుసార్లు చేయి కూడా చేసుకొన్నాడని పోలీసులకు చెప్పింది. ఇంటికి వెళ్ళిన తర్వాత వైజాగ్‌కు ఎవరితో వెళ్లావంటూ కూతురును శ్రీనివాస్‌రెడ్డి నిలదీశాడు. దానికి ఆమె పొంతనలేని సమాధానాలు చెప్తూ వచ్చింది. నల్లగొండ దవాఖానలో చికిత్స పొందుతున్నామని రజిత ఫోన్ చేసి చెప్పిందని, మూడురోజులుగా కీర్తి మా ఇంట్లోనే ఉన్నదని ఆమె ప్రియుడు బాల్‌రెడ్డి చెప్పడంతో శ్రీనివాస్‌రెడ్డి అనుమానం మరింతగా బలపడింది. ఈ విషయాలన్నింటినీ శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు చెప్పడంతో కీర్తి, శశిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్యపై కీర్తి నోరు విప్పడంతో అందరూ షాక్‌కు గురయ్యారు.

**అంత్యక్రియలు చేసిన రైల్వే పోలీసులు**

యాదాద్రి భువనగిరి జిల్లా నీర్నాముల సమీపంలోని రైల్వే ట్రాక్‌పై పడివున్న రజిత మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొన్నారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా తయారవడంతో రైల్వే అధికారులు అంత్యక్రియలను పూర్తిచేశారు. తల్లిని చంపి సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించి కూతురు కీర్తి బోల్తా పడింది.

**టెక్నాలజీ పట్టేసింది**

హత్య కేసును విచారించే సమయంలో పోలీసులు నిందితురాలు కీర్తి ఫోన్‌తోపాటు తల్లి రజిత, తండ్రి శ్రీనివాస్‌రెడ్డి, హత్యకు సహకరించిన స్నేహితుడు శశి, ప్రియుడు బాల్‌రెడ్డి ఫోన్ నంబర్ల లొకేషన్‌ను మ్యాపింగ్ చేశారు. ఈ సందర్భంగా మూడురోజులపాటు వైజాగ్ వెళ్ళినట్టు చెప్పిన కీర్తి ఫోన్ లొకేషన్ హయత్‌నగర్‌లో ఉన్నది. అబద్ధాలు చెప్తున్నావని పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించడంతో మొత్తం బండారాన్ని బయటపెట్టింది. కేసును తండ్రి మీదకు నెట్టేందుకు ప్రయత్నించిన కీర్తి.. సాంకేతిక సాక్ష్యాలను పోలీసులు ముందుకు తేవడంతో తల్లిని హత్య చేసినట్టు ఒప్పుకోక తప్పలేదు. కీర్తి, శశి, బాల్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్టు తెలిసింది. ఇద్దరు యువకులతో ప్రేమ వ్యవహారం తప్పని చెప్పినందుకు తల్లినే కడతేర్చాలని కూతురు కుట్ర పన్నినట్టుగా తెలుస్తున్నది. శశి, బాల్‌రెడ్డి ఇద్దరూ బీటెక్ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నారు. తల్లిని చంపడంలో సహకరిస్తే డబ్బుతోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తానని చెప్పి హత్యలో శశిని పాత్రధారుడిని చేసినట్టు విచారణలో పోలీసులకు కీర్తి చెప్పినట్టు తెలిసింది. నిందితులను మంగళవారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది.

### ముగిసిన కోడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉపఎన్నికల కోసం అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ ఈ నెల 25తో ముగిసిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ తెలిపారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 21 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అక్టోబర్ 24న ఉపఎన్నికల ఫలితాలు వెలువడటంతో.. 25వ తేదీతో కోడ్ ముగిసిందని కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్యకార్యదర్శి సుమిత్ ముఖర్జీ ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు సూర్యాటపేట జిల్లా ఎన్నికల అధికారితోపాటు సంబంధిత అధికారులకు ఎన్నికల కోడ్ ఎత్తివేసినట్టు తెలుపుతూ మెమో జారీచేసినట్టు రజత్‌కుమార్ తెలిపారు.

### నవంబర్ 3న ఎన్టీఎస్‌ఈ పరీక్ష

వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా నవంబర్ 3న నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్ష (ఎన్టీఎస్‌ఈ)కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామనిపరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ తెలిపారు. విద్యార్థులు http//bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తు సందర్భంగా విద్యార్థులు పొందిన ఐడీ, పాస్‌వర్డ్‌లనే హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు వినియోగించాలని సుధాకర్ సూచించారు.



ముఖ్యమంత్రి పదవిని చెరి సగం పంచుకోవటానికి బీజేపీ అంగీకరిస్తుందని నేననుకోవడం లేదు. శివసేనకు ఉప ముఖ్యమంత్రి పదవిని ఐదేండ్లకాలం ఇచ్చేందుకు ఒప్పుకోవచ్చు. ఆదిత్య ఠాక్రే ఉప ముఖ్యమంత్రిగా, దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి స్థానంలో పూర్తికాలం ఉండేందుకు శివసేన అంగీకరించాలి.

**రాందాస్ అతవాలే, కేంద్ర మంత్రి**

మేము బీజేపీ కోసం, కాంగ్రెస్ కోసం అని ప్రజల్ని ఓట్లు అడుగలేదు. రాష్ట్రంలో సుస్థిరమైన ప్రభుత్వాన్ని నెలకొల్పాలని బీజేపీ-జేజేపీ నాయకత్వాలు నిర్ణయించాయి. ఓటు ఒకరికి? మద్దతు మరొకరికి? మేము ప్రజల్ని ఓట్లు అడుగలేదు.



**దుష్యంత్ చౌతాలా, హర్యానా ఉప ముఖ్యమంత్రి**

**చరిత్రలో నేడు**



1864

కొత్త రాజ్యాంగాన్ని ఆమోదించిన గ్రీక్ పార్లమెంట్.

1924



బ్రిటిష్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిపాలైన లేబర్ పార్టీ.



1958

సాహిత్య నోబెల్ ప్రైజ్‌ను తిరస్కరించిన బోరిస్ పాస్టర్‌నక్.

యునెస్కో నివేదిక ప్రకారం బంగ్లాదేశ్ పాఠశాలల్లో 23 శాతం పిల్లలు తోటి వారిచేత వేధింపులకు గురవుతున్నారు. ఈ వేధింపుల వివరాలు బయటకు రావడం లేదు. ఈ వేధింపుల వల్ల పిల్లల మానసిక అభివృద్ధి దెబ్బ తింటుంది. పిల్లలు చదువుపై దృష్టి కేంద్రీకరించలేరు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల వేధింపులు కూడా సాగుతున్నాయి. ఇటీవల ఒక టీచర్ తమ తల్లిదండ్రులను తమ ముందే అవమానించడంతో ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. వేధింపులను అరికట్టడానికి చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షించదగింది.

**ది డైలీ స్టార్**

శ్రీలంక అధ్యక్ష ఎన్నికల సందర్భంగా రాజకీయపక్షాలు అనేక వాగ్దానాలు చేస్తున్నాయి. గోటబయ రాజపక్సా నాయకత్వంలోని ఎస్ఎల్‌పీపీ, సజిత్ ప్రేమదాస నేతృత్వంలోని న్యూ డెమొక్రాటిక్ ఫ్రంట్ వాగ్దానాలే కనుక అమలైతే శ్రీలంక భూగోళంపైనే అత్యంత నివాసయోగ్యమైనదిగా మారిపోతుంది. తాము గెలిస్తే ఎన్నికల వాగ్దానాలను తప్పనిసరిగా అమలు చేసేలా చట్టం చేస్తామని నేషనల్ పీపుల్స్ మువ్‌మెంట్ అధ్యక్ష అభ్యర్థి అనూర కుమార దిస్సనాయకే ప్రకటించారు. ఎన్నికల మానిఫెస్టోలు తప్పనిసరిగా అమలు చేసేలా చట్టం చేయడం మంచిదే.

**ది ఐలాండ్**



# సంకీర్ణ అధర్మం!

ఇటీవల రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత బీజేపీకి మహారాష్ట్రలో పెద్దగా సమస్య లేదనీ, హర్యానాలో ప్రభుత్వ ఏర్పాటే కష్టమని అనిపించింది. కానీ హర్యానాలో ప్రాంతీయ పార్టీతో పొత్తు పెట్టుకొని బయటపడిన బీజేపీకి శివసేన పీటముడిని విప్పడమే కష్టంగా మారింది. ఎన్నికల ముందే తమకు కుదిరిన అంగీకారం ప్రకారం- మంత్రివర్గంలో చెరి సగం సీట్లు పంచుకోవాలని శివసేన అంటున్నది. ముఖ్యమంత్రి పదవి కూడా చెరి సగం కాలం చేపట్టాలని కోరుతున్నది. ఈ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి 105, శివసేనకు 56, కాంగ్రెస్‌కు 44, ఎన్సీపీకి 54 సీట్లు లభించాయి. సీట్ల పంపకాల సమయంలోనే బీజేపీ ఎక్కువ స్థానాలకు పోటీ చేసింది. శివసేన చిన్న భాగస్వామిగా ఉండటానికి అంగీకరించక తప్పలేదు. ఇప్పుడు 105 సీట్లు తెచ్చుకున్న బీజేపీ శివసేనకు సమానస్థాయి ఇవ్వడానికి సిద్ధంగా లేదు. ముఖ్యమంత్రి పదవిని చెరికొంత కాలం చేపట్టాలనే డిమాండును అంగీకరించడానికి అసలే సిద్ధంగా లేదు. తమకు ఇతర ప్రత్యామ్నాయాలున్నాయనీ, అయినా బీజేపీతో హిందుత్వ బంధాన్ని వదులుకోదలుచుకోలేదని కూడా శివసేన పరోక్షంగా హెచ్చరించింది. ఇతర ప్రత్యామ్నాయాలు అంటే కాంగ్రెస్, ఎన్సీపీ మద్దతు తీసుకోవడమే! కాంగ్రెస్-ఎన్సీపీ కూటమి నుంచి కూడా కొందరు ఇందుకు అనుకూలంగా మాట్లాడా రు. లౌకిక కూటమి ఎంతవరకు సిద్ధంగా ఉందనేది వేరే విషయం. బీజేపీని శివసేన ఏ స్థాయిలో బెదిరిస్తున్నదనేది ఈ 'ప్రత్యామ్నాయ' వ్యాఖ్యను బట్టి తెలుస్తున్నది.

ఒకప్పుడు శివసేనను నడిపిన బాల్ ఠాక్రే ఎప్పుడూ ఎన్నికలలో పోటీ చేయలేదు. ఇప్పుడు ఉద్ధవ్ ఠాక్రే కూడా ఎన్నికలకు దూరమే. కానీ ఉద్ధవ్ కుమారుడు ఆదిత్య ఠాక్రే ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించారు. ఆదిత్యను దృష్టిలో పెట్టుకునే శివసేన సగకాలం ముఖ్యమంత్రి పదవి కూడా అడుగుతున్నది. కానీ శివసేన పట్టుబట్టడానికి కొన్ని పరిస్థితులు దోహదపడ్డాయి. 2014 ఎన్నికలలో 122 సీట్లు తెచ్చుకున్న బీజేపీ ఈ సారి 105 మాత్రమే సాధించగలిగింది. సొంతంగా మెజారిటీ సాధించాలన్న అంచనాలు మారాయి. శివసేన సీట్లు కూడా 63 నుంచి 56కు తగ్గాయి. కానీ బీజేపీ బలహీనపడ్డదని, మోదీ గాలి లేదని తెలువడంతో శివసేన ధైర్యం పెరిగింది. రెండు పార్టీల మధ్య ఉన్నది హిందుత్వ బంధమని శివసేన అన్నప్పటికీ అది పైకి చెప్పుకోవడానికే. వాస్తవికంగా రెండు పార్టీల మధ్య ఉన్నది ఒక జాతీయ పార్టీకి, ప్రాంతీయ పక్షానికి మధ్య గల ఘర్షణ. బీజేపీ ఏదైనా రాష్ట్రంలో అడుగు పెట్టే ముందు అక్కడి ప్రాంతీయ పార్టీని దువ్వడం మొదలుపెడుతుంది. మిత్రపక్షంగా అడుగుపెట్టి, అరబ్బు ఒంటె మాదిరిగా గుడారంలో కొంచెం తలదూరుస్తానని అడుగుతుంది. చివరికి ప్రాంతీయ పార్టీని గుడారం నుంచి గెంటేయాలని చూస్తుంది. హర్యానాలో బీజేపీ మిత్రపక్షంగా మారక ముందు ఐఎన్ఎల్‌డీ బలంగా ఉండేది. ఆ తరువాత కోర్టు కేసులు, ఇతర ఒత్తిడులు, ఎత్తుగడల మూలంగా ఐఎన్ఎల్‌డీ బలహీనపడ్డది, బీజేపీ బలపడుతూ పోయింది. ప్రాంతీయ పార్టీల ఆయువు పట్టును దెబ్బకొట్టడం జాతీయపక్షాలకు అలవాటే. బీజేపీ, శివసేన కూడా ఇదే ఘర్షణపూరిత పరిస్థితుల్లో మిత్రపక్షాలుగా సాగుతున్నాయి. బీజేపీ ముఖ్యమంత్రి పదవి, మంత్రి పదవులను పంచుకోవాలనే విషయమై రాతపూర్వక హామీ ఇవ్వాలని కోరుతున్నదీ అంటే అపనమ్మకాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. శివసేన అనేకసార్లు శరద్ పవార్ పట్ల అనుకూలత ప్రకటించడం ఈ ప్రాంతీయ సౌహార్ద్రతతోనే. ఒడిశాలో బీజేడీ మిత్రపక్షం గా అడుగుపెట్టి తాను బలపడుతున్నట్టు భావించి, ఆ పార్టీని దెబ్బకొట్టాలని చూసింది. కానీ నవీన్ పట్నాయక్ నిలదొక్కుకోవడంతో సరిపోయింది. బీహార్‌లో లాలు నాయకత్వంలోని ఆర్‌జేడీ బలంగా ఉంటేనే నితీశ్, పాశ్వాన్‌ల అవసరం ఉంటుంది. లేకపోతే బీజేపీ వీరిని జాడించడానికి ఒక్కరోజు పట్టదు.

> **1960 దశకంలో ప్రాంతీయపార్టీలను ఇందిరాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అణిచివేసింది. కానీ ప్రాంతీయశక్తులను ఎదుగకుండా నిరోధించడం సాధ్యం కాలేదు. ఇవాళ దేశమంతటా ప్రాంతీయ పార్టీలున్నాయి. 1996 నుంచి 2014 వరకు ప్రాంతీయ పార్టీలు లేకుండా జాతీయస్థాయిలో ప్రభుత్వ ఏర్పాటు అసాధ్యమైంది. కాంగ్రెస్ బలహీనపడేవరకు సంకీర్ణ ధర్మం గురించి మాట్లాడిన బీజేపీ ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ఆయువుపట్టును దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నది. ప్రాంతీయశక్తులను అణిచివేయడానికి బీజేపీ ఎంతకైనా దిగుతుందనడానికి పశ్చిమ బెంగాల్ పరిస్థితి ఉదాహరణ.**

1960 దశకంలో ప్రాంతీయపార్టీలను ఇందిరాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అణిచివేసింది. కానీ ప్రాంతీయశక్తులను ఎదుగకుండా నిరోధించడం సాధ్యం కాలేదు. ఇవాళ దేశమంతటా ప్రాంతీయ పార్టీలున్నాయి. 1996 నుంచి 2014 వరకు ప్రాంతీయ పార్టీలు లేకుండా జాతీయస్థాయిలో ప్రభుత్వ ఏర్పాటు అసాధ్యమైంది. కాంగ్రెస్ బలహీనపడేవరకు సంకీర్ణ ధర్మం గురించి మాట్లాడిన బీజేపీ ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ఆయువుపట్టును దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నది. ప్రాంతీయశక్తులను అణిచివేయడానికి బీజేపీ ఎంతకైనా దిగుతుందనడానికి పశ్చిమ బెంగాల్ పరిస్థితి ఉదాహరణ. ప్రాంతీయ శక్తులను తుడిచివేయడం సాధ్యం కాదని స్పష్టమవుతూనే ఉన్నది. ఐఎన్ఎల్‌డీని దెబ్బకొడితే మరోవైపు నుంచి జేజేపీ అవతరించింది. బీజేపీ- జేజేపీ పొత్తు పెట్టుకున్నప్పటికీ ఈ సంబంధం వైషమ్యపూరితంగానే ఉంటుంది. అందుకే అదను చూసుకొని శివసేన సవాలు చేస్తున్నది. భిన్నశక్తులు సర్దుబాటు చేసుకోవడమే ప్రజాస్వామ్య వ్యవస్థ లక్షణం. జాతీయ, ప్రాంతీయపక్షాల మధ్య ఘర్షణ ఉండటం సహజమే. కానీ రాజకీయ పక్షాలు కొన్ని విలువలను పాటించాలె. అపనమ్మకాలతో అధికారం పంచుకోవడం మంచిది కాదు.

**జనగళం**

## హర్షణీయం

మున్సిపాలిటీలలో 15 రోజుల ప్రణాళికను ప్రారంభించడం ఆహ్వానించదగిన పరిణామం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రారంభించిన 30 రోజుల ప్రణాళికతో గ్రామాల్లో మౌలిక వసతుల రూపకల్పన జరిగినట్లు మున్సిపాలిటీలలో కూడా జరుగుతాయని ప్రజలు భావిస్తున్నారు. ఈ 15 రోజుల ప్రణాళికలో ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ బాగుపడుతుందని పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సైతం మున్సిపాలిటీలలో మౌలిక వసతుల రూపకల్పనకు అధిక నిధులు కేటాయించవలసిన అవసరం ఉన్నది. ప్రతి మున్సిపాలిటీలో డంపింగ్‌యార్డులు ఏర్పాటుచేయాలి. మున్సిపాలిటీలు అభివృద్ధి చెందేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం హర్షించదగిన పరిణామం.

**- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్**

## రోడ్డు ప్రమాదాలను అరికట్టాలె

రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్ర పోలీసు యంత్రాంగం కఠినమైన నిబంధనలు తీసుకుంటున్నప్పటికీ రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గకపోవడం బాధాకరం. రోజూ ఎక్కడోచోట ప్రమాదాలు జరుగుతూ పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. కాబట్టి రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలె. ప్రమాదాల నివారణ కోసం అధికారులతో పాటు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది.

**- ఎస్.వెంకటాచారి, ఆదిలాబాద్**

## రైతులను ఆదుకోవాలె

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలన్నీ నేలపాలయినాయి. వరి, పత్తి వంటి పంటలు వానలో తడిసి రైతులకు తీవ్ర నష్టాలను మిగిల్చాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నేలమట్టం కావడంతో రైతులు బాధపడుతున్నారు. కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపక్షాన నిలువాలి. రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది.

**- బోడపట్ల కిషన్, కురిక్యాల, కరీంనగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

# జమిలి ఎన్నికల ఎత్తుగడ ఎందుకు?

ప్రాంతీయ సమస్యల పాత్ర, ప్రాంతీయ పార్టీల పాత్ర కొంతవరకు తగ్గించడానికే జమిలి ఎన్నికల ఎత్తుగడ అని భావించకతప్పదు. ఎన్నికలు జమిలిగా నిర్వహించకపోతే, ఫలితాలు వేరే విధంగా ఉండటం ఈ మధ్యకాలంలో గమనిస్తూనే ఉన్నాం.

విశ్లేషణ



**రావులపాటి సీతారాంరావు**

మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గ ఫలితమూ వచ్చింది. ఎగ్జిట్‌పోల్ హుజూర్‌నగర్ విషయంలోనే పూర్తిగా నిజమైంది. మిగతా రాష్ట్రాల ఫలితాల విషయంలో ఎగ్జిట్‌పోల్స్ తప్పులున్నట్లుగానే భావించాలి. ప్రజలు ఎన్నికల ఫలితాల కోసం ఎగ్జిట్‌పోల్స్‌ను నమ్ముకోవటం అనవసరమేమో! బీజేపీకి ఫలితాలు ఊహించినస్థాయిలో రాలేదు. మీడియా నిష్పక్షపాత ధోరణి మసకబారటం మన దేశంలో కొత్తేమీకాదు. ప్రజలపక్షం అంటూ ప్రజల అభిప్రాయాలను తారుమారు చేయాలనే తాపత్రయం ఈ మధ్య ఎక్కువగావడంతో మీడియాలోని కొందరు నిజం చెప్పరనే పేరు మూటగట్టుకోవాల్సి వచ్చింది. బీజేపీని మరింత పెద్దగా చూపించటం వల్ల ఫలితాలు మరీ ప్రతికూలంగా లేకపోయినా, ఆ పార్టీ డిఫెన్సు ధోరణిలో పడే స్థితి ఏర్పడింది. శివసేన పార్టీ మహారాష్ట్రలో ఒకప్పుడు బీజేపీకి సీనియర్ పార్టీ. తర్వాత జూనియర్‌గా మారింది. ప్రస్తుతం మనిద్దరిది ఫిఫ్టీ-ఫిఫ్టీ అనే స్థాయికి మళ్లీ వచ్చింది. ఏం జరుగుతుందో చూడాలి. అలయన్స్ తప్పక ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుంది. కానీ మంత్రుల చేరికలో పైచేయి ఎవరు సాధిస్తారనేది ఆసక్తికరంగా మారింది. శరద్‌పవార్ తన పవర్ చూపించటం విశేషం.

మహారాష్ట్రలో, హర్యానాలో మూల కూర్చున్న పార్టీగా అనుకున్న కాం గ్రెస్ కళ్లుతెరిచి చిన్నగా ఎగబాకింది. ఇతర పార్టీలు సర్దుకునేసరికి రేసులో కాంగ్రెస్ గణించాల్సిన పార్టీగానే కనపడింది. జాతీయ పార్టీలను, అం దుకే తీసేయలేం. విరుగుట, పెరుగుట కోసమేమో అని అనుకోక తప్ప దు ఒక్కొక్కప్పుడు. అయితే బీజేపీ, ప్రాంతీయపార్టీలను పూర్తిగా రాజకీయంగా కనుమరుగు చేయాలనే ఆలోచనను మానుకోవాలి. ప్రాంతీయపార్టీల ఎజెండా వేరుగా ఉంటుంది. ఎన్నికల సంరంభంలో ప్రాం తీయ పార్టీలు తాము ప్రజలకు ప్రత్యక్షంగా ఏం చేయగలరో ఏం చేద్దామనుకుంటారో చెప్పటంతో పాటు ఇంతవరకు ఏం చేశారో కూడా క్షేత్రస్థాయిలో నిర్దిష్టంగా చూపించగలవు. అందుచేత ప్రాంతీయపార్టీలను రాష్ట్రాల్లోని ప్రజలు నమ్మటానికి బాగా ఆస్కారం ఉన్నది. నిజానికి ఇం తకుపూర్వం జాతీయపార్టీలు బాగా వేళ్లు పాదుకొని వటవృక్షాల్లా దేశం మొత్తం ఎదిగి ఎన్నికలను శాసించినప్పుడు ప్రాంతీయపార్టీలు అరకొరస్థాయిలోనే ఉండేవి.

మహారాష్ట్రలో శివసేన లాంటి పార్టీలు అప్పుడప్పుడు ఒంటరిగానో, జతకట్టో కొన్ని ప్రాంతాల్లో, ఆ రాష్ట్రంలో తమ సత్తా కొంతవరకు చాటేవి. అయితే ఇప్పుడు ఈ ప్రాంతీయపార్టీలు, ప్రాంతీయపరంగానో, భాషపరంగానో, సంక్షేమ పరంగానో రాష్ట్రాల్లోని ప్రజలను బాగా ప్రభావితం చేస్తున్నప్పుడు, అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయపార్టీల పాత్ర మసకబారటం సహజం. ప్రత్యక్ష సంబంధాలు పార్టీల నాయకులకు పార్టీలకు (ప్రజలతో) ఉండటం వల్ల జాతీయపార్టీల ప్రభావం అంతంత మాత్రంగానే ఉంటుంది. భావోద్వేగ సమస్యలు వచ్చినప్పుడు, పెద్ద నాయకుడో, నాయకురాలో మరణించినప్పుడు దేశ భద్రతకు సంబంధించిన విషయంలో జాతీయపార్టీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు, విజయాలు సాధించినప్పుడు, రాష్ట్రాల పార్టీల అజెండాను ప్రజలు పట్టించుకోకపోవచ్చు. అది పూర్తిగా తాత్కాలిక ప్రభావంగా గమనించాలి. బీజేపీ జమిలి ఎన్నికలు కావాలని పట్టుబడుతున్నది ఆ కారణం వల్లనే.



ప్రాంతీయ సమస్యల పాత్ర, ప్రాంతీయ పార్టీల పాత్ర కొంతవరకు తగ్గించడానికే జమిలి ఎన్నికల ఎత్తుగడ అని భావించకతప్పదు. ఎన్నికలు జమిలిగా నిర్వహించకపోతే, ఫలితాలు వేరే విధంగా ఉండటం ఈ మధ్యకాలంలో గమనిస్తూనే ఉన్నాం. ఒక్క తెలంగాణలోనే ఎన్నికలు జరిగినప్పుడు టీఆర్ఎస్ సత్తా ఏమిటో అందరికీ తెలిసింది. నిన్నటి ఎన్నికల్లో కూడా రాష్ట్రాల్లో ఎన్నికలు, కేంద్ర ఎన్నికలతో ముడిపడకుండా (లోక్‌సభ ఎన్నికలతో) జరిగినప్పుడు, శివసేన, శరద్‌పవార్ పార్టీ (ఎన్సీపీ) హర్యానాలో జేజేపీ బీజేపీ ఫలితాలను దెబ్బతీసి న మాట వాస్తవం. హుజూర్‌నగర్‌లో జాతీయపార్టీల ప్రభావం లేదనే చెప్పాలి. ప్రాంతీయపార్టీల నాయకులు అందుకనే జమిలి ఎన్నికల ఎత్తుగడలో పడకుండా ఉండాలి. బీజేపీ జమిలి ఎన్నికలు సాధ్యం కాని పక్షం లో అంతర్జాతీయ సమస్యలను తమపార్టీకి అనుకూలంగా తిప్పుకొని ఎన్నికల్లో గెలువాలని చూస్తున్న మాట వాస్తవం.

సంప్రదాయ పద్ధతులకు, దౌత్యపర నియమాలకు తిలోదాకాలు ఇచ్చి పోరాట ధోరణిలో మన దేశమే పైచేయి సాధిస్తున్నదని చెప్పడం ఈ మధ్య సాగుతున్నది. గతంలో కేంద్ర ప్రభుత్వాలు సామరస్య ధోరణిని కొనసాగించటం కోసం పెద్దగా ప్రాముఖ్యాన్ని ఇవ్వని విషయాలను పైకి తేవడం కూడా జరుగుతున్నది. భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా ఎలాగైనా ఎన్నికల్లో గెలుపే లక్ష్యం అన్న ధోరణిలో ఈ మధ్యకాలంలో రాజకీయం చేయటం దురదృష్టకరం.

బీజేపీ లోక్‌సభ ఎన్నికల ముందు ఏ విధమైన సమస్యలను పైకి తెచ్చి లాభం పొందిందో ఇక్కడ ప్రస్తావించదలుచుకోలేదు. కానీ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో గణనీయ విజయాలను దక్కించుకోకపోవటంతో మళ్లీ ఆర్మీ చీఫ్‌తో పీవోకే సమస్యను ప్రజల ముందుకు తెచ్చి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనపర్చుకొనేదాకా ఊరుకొనేది లేదని దేశానికి చెప్పటం ద్వారా భావోద్వేగాలను రెచ్చగొట్టే పనులు ముందుచూపుతో చేస్తున్న విషయం విశ్లేషకులకు అర్థమవుతూనే ఉన్నది.

> బీజేపీ లోక్‌సభ ఎన్నికల ముందు ఏ విధమైన సమస్యలను పైకి తెచ్చి లాభం పొందిందో ఇక్కడ ప్రస్తావించదలుచుకోలేదు. కానీ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో గణనీయ విజయాలను దక్కించుకోకపోవటంతో మళ్లీ ఆర్మీ చీఫ్‌తో పీవోకే సమస్యను ప్రజల ముందుకు తెచ్చి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనపర్చుకొనేదాకా ఊరుకొనేది లేదని దేశానికి చెప్పటం ద్వారా భావోద్వేగాలను రెచ్చగొట్టే పనులు ముందుచూపుతో చేస్తున్న విషయం విశ్లేషకులకు అర్థమవుతూనే ఉన్నది.

అంతర్జాతీయ సమస్యల పట్ల దూకుడు విధానం అవలంబిస్తే ఎక్కువ దేశాల మద్దతును పొందటం కష్టం. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వంగానీ, న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్‌లో సభ్యత్వం కానీ సాధ్యం కాకపోవచ్చు. కష్ట సమయంలో ఎక్కువ సంఖ్యలో అంతర్జాతీయంగా మనకు సహాయ సహకారాలు అందలేకపోవచ్చు. అందుకే అంతర్జాతీయంగా దూకుడు విధానాలు సమర్థనీయం కావు. కేవలం ఎన్నికల కోసం, నిశ్శబ్ద ఆమోదం ఉన్న అంతర్జాతీయ అజెండాను తోసి రాజనటం సరికాదేమో!

**(వ్యాసకర్త: విశ్రాంత ఐపీఎస్ అధికారి)**

# ఏ ఎన్నికైనా ఎదురులేదు

విశ్లేషణ



**ఎ.రమణకుమార్**

ప్రజాస్వామ్య వ్యవస్థలో, ఎన్నికల ప్రక్రియలో గెలుపోటములు సహజం. ఎన్నికల్లో పోటీచేసే ప్రతీ నాయకుడు తామే గెలుస్తామనే నమ్మకంతో పోటీ చేస్తారు. కానీ ఆ నమ్మకాన్ని నిజం చేసుకోవాలంటే దానికి తగిన కృషి ఉండాలి. ఇటీవలి కాలంలో ఏ ఉప ఎన్నిక వచ్చినా అందులో టీఆర్ఎస్ మాత్రమే గెలుస్తూ వస్తున్నది. ఎందుకు? ఇది ఊరికే సాధ్యం కాలేదు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కేసీఆర్ కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి రాజీనామా చేసినప్పుడు, 2006 డిసెంబర్‌లో ఉప ఎన్నిక వచ్చింది. అప్పుడు రాష్ట్రంలో బలమైన కాంగ్రెస్ పార్టీ నాయకునిగా, ముఖ్యమంత్రిగా వైఎస్సార్ ఉన్నారు. బలమైన పార్టీగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. అలాంటి బలమైన నాయకున్ని, అధికారంలో ఉన్న పార్టీని 'ఢీ'కొని విజయం సాధించిన ఘనత కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీకి దక్కింది. ఆ తర్వాత పలుమార్లు టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాజీనామాలు చేసినప్పుడు ఉప ఎన్నికలు వచ్చాయి. ఆ అన్ని ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ నాయకులే గెలుపొందారు. ఒకటి, రెండు సందర్భాల్లో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, మొక్కవోని దీక్షతో రాష్ట్ర సాధనే లక్ష్యంగా టీఆర్ఎస్ పార్టీ ముందుకుసాగింది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో, ముఖ్యంగా ఉప ఎన్నికల ప్రస్థానంలో టీఆర్ఎస్ పార్టీ నాయకత్వం ఎన్నికల్లో విజయం సాధించడం ఎలా? అనే సూత్రాన్ని పట్టుకోగలిగింది. అందుకే రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ 63 ఎమ్మెల్యే, 11 ఎంపీ స్థానాలను గెలుచుకున్నది. టీఆర్ఎస్ ఉప ఎన్నికల ఛాంపియన్ మాత్రమే అన్న విమర్శను తోసిరాజని జనరల్ ఎలక్షన్స్‌లో కూడా టీఆర్ఎస్ చాంపియనేనని రుజువు చేసింది.

కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో సుస్థిరపాలన, రాజకీయ ఏకీకరణ కోసం కేసీఆర్ అనుసరించిన వ్యూహాలు ఫలించాయి. కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలను అర్థం చేసుకోలేని కొందరు మొదట్లో విమర్శించినా, తర్వాతి కాలంలో ఆయన దీర్ఘకాలిక లక్ష్యసాధన పద్ధతులు సత్ఫలితాలు ఇచ్చాయి. 2018 డిసెంబర్‌లో రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ముందస్తు సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఒంటరిగానే పోటీచేసి 88 స్థానాలు గెలుచుకుంటే, మహాకూటమి పేరుతో జతకట్టిన కాంగ్రెస్, టీడీపీ, టీజేఎస్, సీపీఐలు ఎక్కడ ఉన్నాయో ఆ ఎన్నికల ఫలితాలే రుజువుచేశాయి.

2014-2018 మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్రంలో మూడుసార్లు ఉపఎన్నికలు వచ్చాయి. ఒకటి నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక అయితే, మరొకటి సిద్దిపేట పార్లమెంట్ నియోజకవర్గానికి, ఖమ్మం జిల్లా పాలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నికలు వచ్చాయి. సిద్దిపేట్ పార్లమెంట్ ఉపఎన్నికను కాస్త పక్కనపెడుదాం. ఎందుకంటే స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ రాజీనామా చేయడం వల్ల ఏర్పడిన ఖాళీలో జరిగిన ఉప ఎన్నిక కాబట్టి, సహజంగా ఆ పార్టీ చెందిన వ్యక్తే గెలుపొందడం సహజం. కానీ నారాయణఖేడ్, పాలేరు రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేక పరిస్థితుల్లో ఉప ఎన్నికలు వచ్చాయి. అక్కడి సిట్టింగ్ అభ్యర్థులు అనారోగ్య కారణంగా మరణించడంతో ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉపఎన్నికలు జరిగాయి. ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఉప ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజల సానుభూతి సిట్టింగ్ అభ్యర్థుల కుటుంబసభ్యులపై ఉండాలి. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు ఎంతటివారైనా వారిని ప్రజలు తిరస్కరించి మరణించిన కుటుంబసభ్యులకు ఓటువేసి గెలిపించాలి. కానీ ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అందుకు భిన్నంగా ప్రజలు తీర్పు ఇచ్చారు.

2016లో ఉమ్మడి మెదక్ జిల్లా నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి అక్కడి సిట్టింగ్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పి.కిష్టారెడ్డి మరణం వల్ల ఉప ఎన్నిక వచ్చింది. అంతకుముందు 2014లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ గాలిని తట్టుకొని పి.కిష్టారెడ్డి నారాయణఖేడ్‌లో 14,746 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కానీ ఆయన మరణం తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన కుటుంబసభ్యుడు సంజీవరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి భూపాల్‌రెడ్డిపై ఓడిపోయారు. భూపాల్‌రెడ్డి అంతకు మూడింతలు 53,106 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్ తన సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోకపోయింది. టీఆర్ఎస్ అంత మెజార్టీ ఊరికే వచ్చింది కాదు. దీనివెనక టీఆర్ఎస్ పార్టీ నేతల కృషి ఉన్నది. ఆ తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లా పాలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి కూడా అక్కడి కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాంరెడ్డి వెంకట్‌రెడ్డి అనారోగ్య కారణంగా మరణిస్తే ఉప ఎన్నిక వచ్చింది. ఇక్కడ కూడా అదే సీన్ రిపీటైంది. రాంరెడ్డి వెంకట్‌రెడ్డి సతీమణి సుచరితారెడ్డిపై టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వర్‌రావు 45,676 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

> **ఎన్నికల కమిషన్ మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి కూడా ఉపఎన్నిక నిర్వహించింది. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి పద్మావతి పోటీ చేశారు. టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా 2018 సాధారణ ఎన్నికల్లో ఉత్తమ్‌కుమార్ రెడ్డిపై పోటీచేసిన అభ్యర్థి సైదిరెడ్డినే మళ్లీ ఈ ఉప ఎన్నికలో పోటీచేశారు. జోరుగా ఎన్నికల ప్రచారం జరిగింది. హుజూర్‌నగర్ ప్రజలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వైపే ఉంటారనుకున్నారు. కానీ ప్రజల తీర్పు సైదిరెడ్డి వైపు వచ్చింది. 2018లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 7,466 ఓట్ల మెజార్టీతో గెలిస్తే, మొన్న జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి 43,358 ఓట్లు సుమారు ఐదు రెట్లకు పై మెజార్టీతో గెలుపొందారు.**

ఇక తాజాగా హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికను చూస్తే.. ఇందులో కూడా అదే పరిస్థితి. 2018 సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర పీసీసీ అధ్యక్షునిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 7,466 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత 2019 ఏప్రిల్‌లో పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో ఆయన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎంపీగా గెలుపొందడంతో హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా వల్ల ఏర్పడిన ఖాళీతో ఎన్నికల కమిషన్ మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి కూడా ఉపఎన్నిక నిర్వహించింది. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి సతీమణి పద్మావతి పోటీ చేశారు. టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా 2018 సాధారణ ఎన్నికల్లో ఉత్తమ్‌కుమార్ రెడ్డి పై పోటీచేసిన అభ్యర్థి సైదిరెడ్డినే మళ్లీ ఈ ఉప ఎన్నికలో పోటీచేశారు. జోరుగా ఎన్నికల ప్రచారం జరిగింది. హుజూర్‌నగర్ ప్రజలు ఉత్తమ్ కుమార్‌రెడ్డి వైపే ఉంటారనుకున్నారు. కానీ ప్రజల తీర్పు సైదిరెడ్డి వైపు వచ్చింది. 2018లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 7,466 ఓట్ల మెజార్టీతో గెలిస్తే, మొన్న జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి 43,358 ఓట్లు సుమారు ఐదు రెట్లకు పై మెజార్టీతో గెలుపొందారు. మరి ఈ అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పాటు, ఇతర పార్టీలు కూడా పోటీ చేస్తున్నాయి కదా, మరి ఆ పార్టీ అభ్యర్థులు ఎందుకు గెలువడం లేదు? అంటే ఏ ఎన్నిక వచ్చినా దానిని ఒక యజ్ఞంలా టీఆర్ఎస్ పార్టీ తీసుకుంటే, మిగతా రాజకీయపార్టీలు ఎన్నికల పరుగులో నీరసించిపోతున్నాయి. అందుకే యజ్ఞంలా పనిచేసిన వారికి విజయం వరిస్తున్నది. ప్రతీ ఉప ఎన్నికల్లో టీఆర్ ఎస్ పార్టీ మాత్రమే ఎందుకు గెలుస్తుందంటే, ఎన్నికల్లో గెలుపొందడానికి కావాల్సిన ప్రణాళికతో ముందుకుపోవడం, గెలుపు సూత్రాన్ని పట్టుకోవడమే టీఆర్ఎస్ విజయ రహస్యం. ఇక్కడ ఒక అంశాన్ని ఉదహరించాలి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పద్నాలుగేండ్ల పాటు ఉద్యమం సాగుతున్న సమయంలో టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా కేసీఆర్ ఒకమాట చెబుతుండేవారు. అది...

**'ఆరంభింపరు నీచ మానవులు విఘ్నా యాస సంత్రస్తులై**
**యారంభించి పరిత్యజింతురు విఘ్నా యత్తులై మధ్యముల్**
**ధీరుల్ విఘ్న నిహన్య మానులగుచున్ ధృత్యున్న తోత్సాహులై**
**ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్.'**

ఏదైనా పని మొదలుపెట్టినపుడు ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెరవక తుదికంటా లక్ష్యం కోసం శ్రమించడమే కార్యసాధకుడి నైజం. అలాంటి వారు ఉత్తములు, ఏదో చేయాలన్నతపనతో మొదలుపెట్టినప్పటికీ, మధ్యలో ఆటంకాలు ఎదురవగానే వదిలేసేవారు మధ్యములు, ఎప్పుడో ఎదురయ్యే అడ్డంకులను తలచుకుని ఏ పని చేపట్టని వారు అధములు. అని ఈ పద్యభావం.

**(వ్యాసకర్త: టీజేఎఫ్ వ్యవస్థాపక సభ్యులు, టీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షులు)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# భార్యే ఉప్పందించింది!

- బగ్దాదీ భార్యల్లో ఒకరి నుంచి అధికారులకు సమాచారం
- కూరగాయల బస్సుల్లో బగ్దాదీ ప్రయాణించేవాడని చెప్పిన అతని సన్నిహితుడు
- ఇరాక్, కుర్దిష్ నిఘా సంస్థలతో కలిసి సీఐఏ పక్కా ప్రణాళిక

**వాషింగ్టన్/డమాస్కస్:** ఐసిస్ అధిపతి అబు బకర్ అల్ బగ్దాదీ అంతానికి అతని భార్యల్లో ఒకరు అందించిన సమాచారమే కీలకంగా మారింది. దీంతో పాటు బగ్దాదీ సన్నిహితుడిగా ఉన్న ఓ వ్యక్తి అందించిన వివరాలు అతని కదలికల్ని అమెరికా నిఘా వర్గాలు ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి సాయపడ్డాయి. 2018లో బగ్దాదీని పట్టుకోవడానికి చర్యలను ఉధృతం చేశాయి. అతడికి అత్యంత సన్నిహితుల్లో ఒకరైన ఇస్మాయిల్ అల్-ఎతావిని టర్కీ బలగాలు అరెస్టు చేసి ఇరాకీ సైన్యానికి అప్పగించాయి. ఈ క్రమంలో బగ్దాదీకి సంబంధించిన కీలక సమాచారాన్ని ఎతావి సైన్యానికి తెలిపాడు. ఈ మేరకు నిఘా వర్గాలు, ఇరాకీ సైన్యం చెప్పిన వివరాల్ని ఓ ప్రముఖ వార్త సంస్థ ఓ కథనం ద్వారా ప్రచురించింది. ఆ కథనం ప్రకారం.. ప్రత్యర్థుల నుంచి తప్పించుకునేందుకు కూరగాయలు రవాణా చేసే మినీ బస్సుల్లో బగ్దాదీ ప్రయాణించేవాడని అధికారులు చెప్పారు. కదులుతున్న బస్సుల్లోనే ఎవరికీ అనుమానం కలుగకుండా కమాండర్లతో వ్యూహాత్మక సమావేశాలు అతడు జరిపేవాడని పేర్కొన్నారు. బగ్దాదీ తన అనుచరులను కలిసే సిరియాలోని కొన్ని ప్రాంతాల గురించి కూడా ఎతావినే తమకు చెప్పాడని నిఘా అధికారులు తెలిపారు. మరోవైపు, కొన్ని నెలల క్రితమే అమెరికా నిఘా సంస్థ సీఐఏ బగ్దాదీ భార్యల్లో ఒకరిని, అతనికి సమాచారాన్ని అందించే మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించినట్టు న్యూయార్క్ టైమ్స్ మరో కథనంలో పేర్కొంది. బగ్దాదీ ఎక్కువగా సంచరించే ప్రాంతాల సమాచారాన్ని విచారణలో అతని భార్య అధికారులతో పంచుకున్నట్టు తెలిపింది. దీంతో ఇరాక్, కుర్దిష్ నిఘా సంస్థలతో కలిసి సీఐఏ నిఘాను మరింత పెంచింది. బగ్దాదీ కదలికల్ని ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి గూఢచారుల్ని నియమించింది. బగ్దాదీని పట్టుకోవాలని చేపట్టిన రెండు ఆపరేషన్‌లను అమెరికా సైన్యం ఆఖరి నిమిషంలో నిలిపివేసింది. అయితే, సిరియాలో ఉన్న బగ్దాదీ వేరే చోటుకి వెళ్తున్నాడన్న సమాచారంతో సైన్యం మూడు రోజుల క్రితం తమ ఆపరేషన్‌ను ప్రారంభించి.. చివరికి అతన్ని మట్టుబెట్టింది.



బగ్దాదీ భార్యల్లో ఒకరిగా భావిస్తున్న సజా దులైమి





బగ్దాదీని అంతమొందించేందుకు సిరియాలో బారిషా గ్రామం వద్ద అమెరికా దళాలు చేపట్టిన దాడుల్లో ధ్వంసమైన ఇండ్లు

# ఉగ్రభూతం హతం

## ఐఎస్ చీఫ్ అల్ బగ్దాదీని మట్టుబెట్టిన అమెరికా

- సిరియాలో సీక్రెట్ ఆపరేషన్ చేపట్టిన అమెరికన్ దళాలు
- ఏ దారీ లేక తనను తాను పేల్చుకున్న ఉగ్ర దళపతి
- ఆపరేషన్ మొత్తాన్ని వైట్‌హౌస్ నుంచి ప్రత్యక్షంగా వీక్షించిన అమెరికా అధ్యక్షుడు
- పిరికిపందలా కుక్క చావు చచ్చాడు: ట్రంప్ వ్యాఖ్య



అబూ బకర్ అల్-బగ్దాదీ



ఆపరేషన్‌ను వైట్‌హౌస్ నుంచి పర్యవేక్షిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, తదితరులు

**వాషింగ్టన్, అక్టోబర్ 27:**

ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) సంస్థ వ్యవస్థాపకుడు, ప్రపంచంలోనే మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అబూ బకర్ అల్-బగ్దాదీని అమెరికా ప్రత్యేక దళాలు జరిపిన దాడిలో హతమయ్యాడు. ఈ ఆపరేషన్‌లో బగ్దాదీ ముగ్గురు పిల్లలతోపాటు పలువురు అనుచరులు కూడా మరణించారు. 'అత్యంత క్రూరమైన ఐఎస్ సంస్థ నాయకుడు, ప్రపంచ నంబర్ వన్ ఉగ్రవాది పిరికిపందలా కుక్క చావు చచ్చాడు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. శ్వేతసౌధంలో ఆదివారం ఉదయం ట్రంప్ టెలివిజన్ ద్వారా దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, 'సిరియాలో అమెరికాకు చెందిన కే9 జాగిలాలు ఐఎస్ అధిపతిని ఓ సొరంగంలో చివరి వరకూ తరుముకుంటూ వెళ్లాయి. సొరంగం చివరిలో ఇక వెళ్లడానికి ఏ దారీ లేకపోవడంతో బగ్దాదీ తనను తాను పేల్చుకున్నాడు. అతడు తనతో పాటు తన ముగ్గురు పిల్లలను కూడా చంపుకున్నాడు'అని వెల్లడించారు. 'గత (శనివారం) రాత్రి ప్రపంచంలోనే నంబర్ వన్ ఉగ్రవాదుల నాయకుడిని అమెరికా హతమార్చింది. అబూ బకర్ అల్-బగ్దాదీ హతమయ్యాడు' అని ట్రంప్ తెలిపారు. 'గత రాత్రి అమెరికాతోపాటు ప్రపంచమంతటికీ ఎంతో గొప్ప రాత్రి. ఓ క్రూరుడైన హంతకుడు.. ఎంతోమందిని హింసకు గురిచేసి, ఎందరి మరణానికో కారణమైనవాడు.. అత్యంత హింసాత్మకంగా అంతమయ్యాడు. అతడు ఇకపై ఏ అమాయకుడికీ హాని తలపెట్టలేడు. అతడు కుక్క చావు చచ్చాడు. ప్రపంచం ఇప్పుడు సురక్షితంగా మారింది' అని వ్యాఖ్యానించారు. రాత్రివేళ అత్యంత సాహసోపేతంగా అమెరికన్ దళాలు తమదైన శైలిలో ఆపరేషన్‌ను ముగించాయి అని చెప్పారు. తనతోపాటు దేశ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, సైన్యాధికారులు ఈ ఆపరేషన్ మొత్తాన్ని వైట్‌హౌస్ నుంచే ప్రత్యక్షంగా వీక్షించామని, ఆ దృశ్యాలు సినిమా కన్నా బాగున్నాయని తెలిపారు. 'బగ్దాదీ ఎంతో దుర్మార్గుడు, క్రూరుడు. పరుగెత్తుతూ, ఏడుస్తూ అత్యంత క్రూరంగా హతమయ్యాడు. అతని కోసం ఎన్నో ఏండ్లుగా గాలింపు జరుపుతున్నాం. అతడు ఐఎస్ వ్యవస్థాపకుడు, దాని నాయకుడు. ప్రపంచవ్యాప్తంగా ఐఎస్ అత్యంత క్రూరమైన, కిరాతకమైన ఉగ్రవాద సంస్థగా పేరొందింది. దీంతో దాని నాయకుడు బగ్దాదీని అమెరికా ఎన్నో ఏండ్లుగా వెతకుతున్నది. అతడిని పట్టుకోవడం లేక హతమార్చడం అన్నది మా ప్రభుత్వ జాతీయ భద్రత విధానంలో అత్యంత ప్రాధాన్యంగా మారింది' అని ట్రంప్ వివరించారు. 'అమెరికా ప్రత్యేక దళాలు బగ్దాదీ వెంటపడగా, అతడు ప్రాణభయంతో ఏడుస్తూ, అరుస్తూ సొరంగం చివరి వరకూ పరుగెత్తాడు. తన జీవితమంతా ఇతరులను భయపెట్టడానికి ప్రయత్నించిన ఆ దోపిడీదొంగ తన చివరి క్షణాలను ఎంతో భయంతో గడిపాడు' అని చెప్పారు. ఉగ్రవాద నాయకులను అమెరికా కనికరం లేకుండా వెంబడిస్తుందని, ఐఎస్‌తోపాటు ఇతర ఉగ్రవాద సంస్థలను ఓడించడమే తమ ధ్యేయమని ట్రంప్ స్పష్టం చేశారు. గత నెలలోనే తాము అల్ ఖాయిదా నాయకుడు ఒసామా బిన్‌లాడెన్ కుమారుడు హంజాబిన్ లాడెన్‌ను అంతమొందించామని గుర్తు చేశారు. సిరియాలో బగ్దాదీని అంతమొందించేందుకు జరిపిన ఆపరేషన్‌లో తమ సైనిక సిబ్బందిలో ఎవరూ మరణించలేదని ట్రంప్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో తమ దళాలు కొందరు ఐఎస్ అనుచరులను మట్టుబెట్టాయని, మరికొందరిని పట్టుకున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా అత్యంత కీలకమైన సమాచారం తమ చేతికందిందని అన్నారు. మృతుడు బగ్దాదీయేనని డీఎన్ఏ పరీక్షల ద్వారా ధ్రువీకరించుకున్నామని చెప్పారు.



టర్కీ-సిరియా సరిహద్దుల్లో ఆపరేషన్ చేపట్టిన ప్రాంతం ఇదే..

## ప్రత్యర్థి ఇంట్లో దాక్కున్న ఐఎస్ అధిపతి



దాడుల్లో ధ్వంసమైన వాహనం

**బగ్దాదీ** తన ప్రత్యర్థి గ్రూపు నియంత్రణలో ఉన్న ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో తలదాచుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఐఎస్ పాలనలో ఉన్న ప్రాంతానికి దూరంగా ఓ గ్రామంలో బగ్దాదీ ఉండటంతో ఇంటెలిజెన్స్ విభాగాలు తొలుత అతడి ఆచూకీని పసిగట్టలేకపోయాయి. హుర్రాస్ అల్ దెయిన్ అనే స్థానిక మిలిటెంట్ గ్రూప్‌కు అబు మహమ్మద్ హలాబీ నాయకుడు. అతడు బారిషా గ్రామంలో సొరంగంపై నిర్మించిన ఇంటిని కొనుగోలు చేశాడు. హుర్రాస్ సంస్థ ఇటీవల కొందరు ఐఎస్ సానుభూతిపరులను చంపింది కూడా. దీంతో బగ్దాదీ అతని ఇంట్లోనే ఉన్నా.. ఎవరూ అనుమానించలేదు. అయితే రెండు వారాల క్రితం బగ్దాదీ కదలికలపై అందిన సమాచారంతో అమెరికన్ దళాలు అతడిపై నిఘా వేశాయి. తొలుత బగ్దాదీ ఉన్న ప్రాంతాన్ని గుర్తించిన అమెరికా గూఢచార సంస్థ సీఐఏ, ఆ విషయాన్ని తమ రక్షణ శాఖకు చేరవేసింది. అక్కడ ఉంటున్నది బగ్దాదీయేనని నిర్ధారించుకున్న తరువాత, ట్రంప్ అనుమతితో ప్రత్యేక దళాలు ఆపరేషన్‌ను ప్రారంభించాయి. వాస్తవానికి ఇడ్లిబ్ గగనతలం రష్యా నియంత్రణలో ఉంది. రష్యా, కుర్దులు టర్కీకి అందించిన సమాచారం అమెరికాకు చేరడంతో ఆపరేషన్ మొదలైంది.

# కలుగులో చిక్కిన కిల్లర్

- దాడిలో పాల్గొన్న ఎనిమిది హెలికాప్టర్లు, నిష్ణాతులైన కమాండోలు
- ముగ్గురు పిల్లలతో సొరంగంలోకి పారిపోయిన బగ్దాదీ
- రష్యా, ఇరాక్ సహకారంతో ఆపరేషన్ పూర్తిచేసిన అమెరికా

**వాషింగ్టన్, అక్టోబర్ 28:** నిఘా వర్గాలు అందించిన అత్యంత పక్కా సమాచారంతో బగ్దాదీని అంతమొందించే ఆపరేషన్‌ను అమెరికా ప్రత్యేక దళాలు అత్యంత రహస్యంగా చేపట్టాయి. సిరియాలోని టర్కీ సరిహద్దుకు సమీపంలో ఉన్న బారిషా గ్రామం వద్ద శనివారం సాయంత్రం (స్థానిక కాలమానం) ఐదు గంటలకు అమెరికన్ దళాలు ఈ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఎనిమిది హెలికాప్టర్లు, రహస్య ఆపరేషన్లలో నిష్ణాత దళాలు బగ్దాదీ ఉంటున్న ఇంటిని చుట్టుముట్టాయి. దాదాపు 70 నిమిషాల పాటు హెలికాప్టర్లు అత్యంత తక్కువ ఎత్తులో ఎగురుతూ వెళ్లాయి. బగ్దాదీ తలదాచుకున్న ఇంటివద్దకు ప్రత్యేక దళాలు చేరగానే ఇంటిలోపలి నుంచి కాల్పులు మొదలయ్యాయి. దీంతో దళాలు వాటిని తిప్పికొట్టాయి. ఒక పెద్ద గోడను పేల్చివేశాయి. ఈ ఘటనలో బగ్దాదీ కాకుండా తొమ్మిదిమంది హతమయ్యారు. వీరంతా బగ్దాదీ బంధువులేనని భావిస్తున్నారు. ఆ తరువాత పదుల సంఖ్యలో ఉగ్రవాదులను దళాలు అదుపులోకి తీసుకున్నాయి. బగ్దాదీ తన ముగ్గురు పిల్లలను తీసుకొని ఇంటి అడుగున ఉన్న సొరంగంలోకి వెళ్లిపోయాడు. అయితే అమెరికన్ దళాలకు అప్పటికే ఆ సొరంగం విషయం తెలిసి ఉండటంతో అందులోకి జాగిలాలను విడిచిపెట్టాయి. కుక్కలు వెంబడించడంతో బగ్దాదీ సొరంగం చివరి వరకూ పరుగెత్తాడు. అక్కడి నుంచి తప్పించుకోవడానికి మార్గం లేకపోవడంతో తన ఒంటిపై అమర్చుకున్న బాంబులను పేల్చుకున్నాడు. ఈ ధాటికి అతడి శరీరం ముక్కలవడంతోపాటు ముగ్గురు పిల్లలుకూడా మరణించారు. అమెరికా జాగిలాలలో ఒకటి తీవ్రంగా గాయపడింది. దాడి ముగిసిన 15 నిమిషాల్లోనే బగ్దాదీ శరీర భాగాలను సేకరించిన దళాలు వెంటనే డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి మృతుడు బగ్దాదీయేనని నిర్ధారించారు. అనంతరం అమెరికా దళాలు అక్కడి నుంచి వెనుకకు తిరిగి వచ్చాయి. ప్రత్యర్థి దళాల ఆధీనంలోని పలు ప్రమాదకరమైన ప్రాంతాల గుండా తమ దళాలు ప్రయాణించాయని ట్రంప్ వెల్లడించారు. అయితే రష్యా, ఇరాక్ తమకు ఎంతగానో సహకరించాయని చెప్పారు. రష్యా తన ఆధీనంలోని ప్రాంతాల నుంచి తమ హెలికాప్టర్లు వెళ్లేందుకు అనుమతించిందని ట్రంప్ తెలిపారు. అయితే తాము ఏం చేయబోతున్నామో ఇరాక్, రష్యా దళాలకు తెలియదని ట్రంప్ చెప్పుకొచ్చారు.

# కర్కోటకుడు

- మతం పేరుతో మారణహోమం సృష్టించిన అల్-బగ్దాదీ

అబుబకర్ అల్-బగ్దాదీ.. కరుడుగట్టిన ఉగ్రవాది మాత్రమే కాదు.. అతడొక మతోన్మాది. ఉన్నత విద్యావంతుడైన బగ్దాదీ 2014లో ఏకంగా ఒక ఖలీఫేట్ (మత రాజ్యాన్ని) స్థాపించి ప్రపంచ దేశాలను గడగడలాడించాడు. మతం చాటున అతడు నాటిన విష బీజాలు ఎన్నో దేశాలలో యువతను ఉగ్రవాదులుగా మార్చి మారణహోమానికి పాల్పడేలా చేశాయి. అతడు స్థాపించిన ఐఎస్ ఉగ్రవాద సంస్థ సృష్టించిన విధ్వంసంలో లక్షల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచంలోనే అత్యంత ఉత్తమమైన నిఘా సంస్థలకు కూడా ఇంతకాలం బగ్దాదీ ఆచూకీ దొరకలేదు. అమెరికా అతడి ఆచూకీ తెలిపిన వారికి 2.5 కోట్ల డాలర్లను బహుమతిగా ప్రకటించింది.



### ఉన్నత విద్యావంతుడు

బగ్దాదీ అసలుపేరు ఇబ్రహీం అవ్వద్ ఇబ్రహీం అల్-బద్రీ. ఇరాక్‌లోని సమర్రా నగరంలో 1971లో జన్మించాడు. ఇస్లామిక్ స్టడీస్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన బగ్దాదీ, ఆ తరువాత బాగ్దాద్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాడు. ఇరాక్‌పై 2003లో అమెరికా జరిపిన దురాక్రమణ అనంతరం బగ్దాదీ 'జమాత్ జయేష్ అహల్-అల్-సున్నాహ్ వా-ఐ-జమాహ్' అనే తీవ్రవాద సంస్థను స్థాపించాడు.అమెరికన్ దళాలు 2004లో బగ్దాదీని ఓ దొంగగా భావించి అరెస్టు చేసి, ఫలూజా నగరంలోని బుక్కా క్యాంప్‌కు తరలించాయి. బగ్దాదీ ఇక్కడి ఖైదీలతో నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసుకున్నాడు. బగ్దాదీ వారిని ప్రార్థనలలో నడిపిస్తూ, మతపరమైన బోధనలు చేసేవాడు. కొన్నిసార్లు క్యాంప్‌కు ఇన్‌చార్జిగా ఉన్న అమెరికా ప్రతినిధికి, ఖైదీలకు మధ్య వివాదాలు తలెత్తినప్పుడు మధ్యవర్తిగా వ్యవహరించి సమస్యను పరిష్కరించేవాడు. దీంతో బగ్దాదీ వల్ల పెద్ద ముప్పేమీ లేదని భావించిన అమెరికా 10 నెలల నిర్బంధం అనంతరం అతడిని విడుదల చేసింది.

### అల్‌ఖాయిదాతోనే తొలి అడుగులు

క్యాంప్ నుంచి బయటకొచ్చిన బగ్దాదీ ఇరాక్‌లో కొత్తగా ఏర్పడిన 'ఇరాక్ అల్‌ఖాయిదా (ఏక్యూఐ)'తో సంబంధాలు పెట్టుకున్నాడు. అబు ముసబ్ అల్ జర్ఖవీ నేతృత్వంలో ఏక్యూఐ క్రూరమైన ఉగ్రవాద సంస్థగా ఎదిగింది. 2006లో అమెరికా దాడిలో జర్ఖవీ హతమయ్యాడు. దీంతో ఏక్యూఐ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ (ఐఎస్ఐ)గా పేరు మార్చుకుంది. ఐఎస్ఐ షరియా కమిటీలకు బగ్దాదీ సూపర్‌వైజర్‌గా ఉండేవాడు. 2010లో ఐఎస్ఐ అధిపతిగా బగ్దాదీ నియమితుడయ్యాడు. బగ్దాదీ నేతృత్వంలో మళ్లీ పుంజుకున్న ఐఎస్ఐ 2013లో ఇరాక్‌లో భారీ ఎత్తున దాడులు ప్రారంభించింది. సిరియాలోని తిరుగుబాటు దళాలతో చేతులు కలిపింది. అదే ఏడాది ఏప్రిల్‌లో సిరియా, ఇరాక్‌లోని తన దళాలను విలీనం చేస్తూ 'ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్)'ను బగ్దాదీ స్థాపించాడు. అనంతరం ఐఎస్ఐఎస్ తీవ్రంగా బలపడింది.

### ఖలీఫా ఇబ్రహీం

డజన్ల కొద్దీ ఇరాకీ నగరాలను, పట్టణాలను గెలుచుకొన్న ఐఎస్ఐఎస్ వాటన్నింటినీ కలుపుతూ ఖలీఫేట్ (ఇస్లామిక్ రాజ్యాన్ని) ఏర్పాటు చేసింది. ఇరాక్, సిరియాలోని 88వేల చ.కి.మీ. ప్రాంతం (80 లక్షల జనాభా) ఈ సంస్థ అధీనంలోకి వచ్చింది. దానికి బగ్దాదీని ఖలీఫా ఇబ్రహీం (మత అధిపతి)గా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలందరూ అతనికి విధేయులై ఉండాలని డిమాండ్ చేసింది. ఆ తరువాత మొసుల్ నగరంలోని చారిత్రాత్మక అల్ నూరీ మసీదులో మొదటిసారి ప్రసంగించిన బగ్దాదీ.. ముస్లింలందరూ ఐఎస్ రాజ్యానికి వచ్చి తమ మతం కోసం ఇతర మతాలపై యుద్ధం చేయాలని పిలుపునిచ్చాడు. బగ్దాదీ అనుచరులు తమ క్రూర చర్యలను వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టేవారు.

## ట్రంప్‌కు ట్రంప్ కార్డు!

### 2020 అధ్యక్ష ఎన్నికల ప్రచారాస్త్రంగా బగ్దాదీ అంశం



**న్యూయార్క్, అక్టోబర్ 28:** ఇస్లామిక్ స్టేట్ అధిపతి బగ్దాదీని అంతమొందించటం.. వచ్చే ఏడాది జరుగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికలపై ప్రభావం చూపనున్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఉగ్రవాది బగ్దాదీని మట్టుబెట్టి అమెరికా పౌరుల భద్రతకు తాను ఎంత ప్రాధాన్యం ఇస్తున్నానో తెలిసేలా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఉదంతంతో సరైన సంకేతాలు పంపారని వాళ్లు పేర్కొంటున్నారు. ఈ ఘటన రానున్న అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీకి మరింత బలాన్ని ఇస్తుందని, ఎన్నికల ప్రచారంలో ఇదే ప్రధాన ప్రచారాస్త్రంగా కూడా మారొచ్చని చెబుతున్నారు. విదేశీ విధానం సాకుతో మధ్యప్రాచ్య ప్రాంతంపై ట్రంప్ విధించిన ఆంక్షలపై సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు ఎదురవుతున్న ఈ సమయంలో.. బాగ్దాదీని అంతం చేయడం ట్రంప్‌కి అతిపెద్ద విజయమని అంటున్నారు.

## 'ఉగ్ర' పోషకులపై చర్యలు అవసరం

- ఈయూ ఎంపీల బృందంతో ప్రధాని మోదీ
- నేడు జమ్ముకశ్మీర్‌లో పర్యటించనున్న ఎంపీలు



ఢిల్లీలో ఈయూ పార్లమెంట్ సభ్యులతో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** ఉగ్రవాదానికి మద్దతునిస్తున్న, పోషిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని ప్రధాని నరేంద్రమోదీ యూరోపియన్ యూనియన్ (ఈయూ) పార్లమెంట్ సభ్యుల బృందంతో పేర్కొన్నారు. 30 మందితో కూడిన ఈయూ ఎంపీల బృందం సోమవారం ప్రధాని మోదీ, జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్‌తో భేటీ అయ్యింది. ఆర్టికల్ 370ని రద్దు చేసి 80 రోజులు దాటినప్పటికీ కశ్మీర్‌లోయలో ఇంకా సాధారణ పరిస్థితులు ఏర్పడని నేపథ్యంలో ఈయూ ఎంపీలు మంగళవారం జమ్ముకశ్మీర్‌లో పర్యటించనున్నారు. ఇది వారి అనధికారిక పర్యటన అని అధికారులు వెల్లడించారు. జమ్ముకశ్మీర్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించనున్న ఈయూ బృందం పర్యటన ఫలప్రదం కావాలని ప్రధాని ఆకాంక్షించారు. జమ్ము, కశ్మీర్, లడఖ్‌లోని సాంస్కృతిక, మతపరమైన వైవిధ్యాన్ని అర్థం చేసుకునేందుకు ఎంపీలకు ఈ పర్యటన దోహదం చేస్తుందని ప్రధాని పేర్కొన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతునిస్తున్నవారిపై, ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా వినియోగిస్తున్న వారిపై తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని స్పష్టంచేశారు. సులభతర వాణిజ్యంలో భారత ర్యాంకు 142 (2014లో) నుంచి తాజాగా 63కు చేరుకోవడాన్ని ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. అపార విస్తీర్ణం, జనాభా, వైవిధ్యం కలిగిన దేశానికి ఇది గొప్ప విజయం అని చెప్పారు.

**భారత పార్లమెంట్‌ను అవమానించడమే: జైరాం రమేశ్**

జమ్ముకశ్మీర్‌కు వెళ్లేందుకు మనదేశ రాజకీయ నాయకులను అనుమతించని మోదీ సర్కారు ఈయూ ఎంపీలను మాత్రం ఎందుకు అనుమతించిందని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. ఇది పార్లమెంట్‌ను, ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని ధ్వజమెత్తింది. 'ఛాతీ చరుచుకునే జాతీయవాద ఛాంపియన్' (ప్రధానిని ఉద్దేశించి) ఈయూ నేతలను కశ్మీర్‌లో అనుమతించడానికి గల కారణమేమిటని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు.

## మరింత క్రూరంగా చావాల్సింది!

### భారత్‌కు చెందిన బాధితురాళ్ల ఆగ్రహం

**క్రిష్ణనగర్(పశ్చిమ బెంగాల్), అక్టోబర్ 28:** ఐఎస్ అధిపతి అబు బకర్ అల్ బగ్దాదీ అంతంపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు వితంతు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఇంతకుముందే అతను చనిపోతే బాగుండేదన్నారు. రాష్ట్రంలోని నదియా జిల్లాకి చెందిన ఈ ఇదరు మహిళల భర్తలను జూన్ 2014లో బగ్దాదీ నేతృత్వంలోని ఉగ్రవాద బృందం ఒకటి అపహరించింది. వీరితో పాటు కిడ్నాపైన మరో 37 మందిని కూడా ఉగ్రవాదులు ఇరాక్‌లో అత్యంత కిరాతకంగా హతమార్చారు. ఈ విషయం 2018 తర్వాతే వెలుగులోకి వచ్చింది. భర్తలను కోల్పోయిన సదరు మహిళలు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. కాగా, తాజాగా బగ్దాదీ హతమయ్యాడన్న మరణవార్త విన్న ఆ మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. వీరిలో ఒక మహిళ మాట్లాడుతూ.. అతను ఇంతకంటే ముందే మరింత క్రూరంగా చనిపోతే బాగుండేదని అన్నారు.

## హర్యానాలో కొలువుదీరిన సంకీర్ణం



సీఎంగా ప్రమాణం చేస్తున్న బీజేపీ నేత మనోహర్‌లాల్ ఖట్టర్

- రెండోసారి సీఎంగా మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రమాణం
- డిప్యూటీ సీఎంగా జేజేపీ నేత దుష్యంత్ చౌతాలా

**చండీగఢ్, అక్టోబర్ 28:** హర్యానాలో బీజేపీ-జేజేపీ సంకీర్ణ ప్రభుత్వం కొలువు దీరింది. సీఎంగా రెండోసారి బీజేపీ నేత మనోహర్ లాల్ ఖట్టర్ ప్రమాణం చేశారు. జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ) వ్యవస్థాపకుడు దుష్యంత్ చౌతాలా డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేశారు. ఆదివారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్య వారితో ప్రమాణం చేయించారు. త్వరలో ఖట్టర్ క్యాబినెట్‌లో నూతన మంత్రుల చేరిక జరుగుతుందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, 'నిజాయితీతో కూడిన సుస్థిర' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకే బీజేపీకి మద్దతునిచ్చానని దుష్యంత్ చౌతాలా తెలిపారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేస్తుందని అన్నారు. 'మేం బీజేపీ కోసమో, కాంగ్రెస్ పార్టీ కోసమో ఓట్లడుగలేదు. జేజేపీకి 18.60 లక్షల మంది ప్రజలు ఓట్లేశారు. మేం 10 స్థానాల్లో గెలుపొందాం' అని తెలిపారు.



గవర్నర్ కోశ్యారీని కలుసుకున్న సీఎం ఫడ్నవీస్

## వీడని 'మహా' ఉత్కంఠ!

- గవర్నర్‌తో విడివిడిగా భేటీ అయిన సీఎం ఫడ్నవీస్, శివసేన నేత దివాకర్
- బీజేపీ, శివసేన మధ్య కుదరని సయోధ్య

**ముంబై, అక్టోబర్ 28:** మహారాష్ట్ర రాజకీయాలు రోజురోజుకూ మరింత రసవత్తరంగా మారుతున్నాయి. తదుపరి ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ కొనసాగుతున్నది. అధికారం పంచుకునే విషయంలో మిత్రపక్షాలు బీజేపీ, శివసేన మధ్య సయోధ్య కుదరడం లేదు. ముఖ్యమంత్రి పదవీకాలాన్ని చెరి సగం పంచుకోవాల్సిందేనని శివసేన పట్టుబడుతున్నది. అధికారంలో సమాన వాటా కల్పించాల్సిందేనని ఆ పార్టీ సోమవారం మరోసారి బీజేపీకి స్పష్టం చేసింది. బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే మధ్య కుదిరిన '50-50 ఫార్ములా'పై వాస్తవాలు వెల్లడించాలని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ బీజేపీని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏర్పాటుపై తాము మరో ప్రత్యామ్నాయాన్ని చూసుకునేలా బీజేపీ తమని ఒత్తిడికి గురిచేయకూడదని హెచ్చరించారు. రాజకీయాల్లో ఎవరూ పుణ్యాత్ములు ఉండరని వ్యాఖ్యానించారు. తమకు తక్కువ సీట్లు వచ్చినప్పటికీ అధికారానికి సంబంధించి రిమోట్ కంట్రోల్ తమ వద్దే ఉన్నదని శివసేన నాయకుడు సంజయ్‌రౌత్ స్పష్టం చేశారు. మరోవైపు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, శివసేన నేత దివాకర్ రౌత్ సోమవారం ఆ రాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారీతో విడివిడిగా సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మహారాష్ట్రలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు తాజాగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ 105, శివసేన 56 స్థానాల్లో గెలుపొందిన విషయం తెలిసిందే. మరోవైపు ఎన్సీపీ 54, కాంగ్రెస్ 44 స్థానాలు సాధించాయి. అయితే సీఎం పీఠం విషయంలో బీజేపీ, శివసేన మధ్య విభేదాలు నెలకొన్నాయి. ముఖ్యమంత్రి పదవిని చెరో సగం కాలం పంచుకోవడంపై రాతపూర్వక హామీ ఇవ్వాలని శివసేన డిమాండ్ చేస్తున్నది.

**బీజేపీ విధానాలతోనే ఆర్థిక మందగమనం**

దేశంలో ఆర్థిక మాంద్యానికి బీజేపీ విధానాలే కారణమని శివసేన అధికార పత్రిక 'సామ్నా' ఆరోపించింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలే దేశంలో ప్రస్తుత పరిస్థితికి కారణమని విమర్శించింది.

## చిదంబరానికి కడుపునొప్పి.. ఎయిమ్స్‌కు తరలింపు.. డిశ్చార్జి



**న్యూఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం సోమవారం అస్వస్థతకు గురయ్యారు. కపుడునొప్పితో ఆయన బాధపడటంతో తొలుత ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా దవాఖానకు తరలించారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో సాయంత్రం 5.40కి ఎయిమ్స్‌కు ఆయనను తరలించగా డాక్టర్ల బృందం పరీక్షలు నిర్వహించింది. చికిత్స అనంతరం ఆయనను ఎయిమ్స్ నుంచి డిశ్చార్జి చేశారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ప్రస్తుతం చిదంబరాన్ని ఈడీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇదే కేసులో సీబీఐ దాఖలు చేసిన ఆరోపణలకు సంబంధించి ఆయనకు బెయిల్ లభించిన విషయం తెలిసిందే.


తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్యాలయం, నిర్మల్ జిల్లా.
సవరణ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన 19 to 50/DPRE/NIRMAL/2019-20, తేది: 16-10-2019కి సవరణ సంఖ్య.1 (NIT: 27 to 50), తేది: 26-10-2019. ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన 19 to 50/DPRE/NIRMAL/ 2019-20, తేది: 16-10-2019 యొక్క NIT: 27 to 50 కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు టెండర్ డాక్యుమెంట్ల లభ్యత తేదీలు మార్పు చెయ్యబడినవి మరియు లభ్యత గల తేదీలు: 31-10-2019 నుండి 08-11-2019 మధ్య. టెండర్ యొక్క చెల్లుబాటు టెండర్ ప్రచురణ తేదీ నుండి (07) రోజుల వరకు ఉంటుంది. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి పొందవచ్చును.
DIPR R.O.No. 1493-DP/CL/ Advt/1/2019-20, Dt: 28/10/2019
సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్, నిర్మల్ జిల్లా.

# ఇంటిముందు మొక్కలు నాటిన కేశవరావు

- మరో నలుగురికి గ్రీన్‌చాలెంజ్ విసిరిన టీఆర్ఎస్ పార్లమెంటరీ నేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హరితహారానికి గ్రీన్‌చాలెంజ్ తోడైతే ఫలితాలు తొందరగా వస్తాయని టీఆర్ఎస్ పార్లమెంటరీ నేత కే కేశవరావు అన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మొక్కలు పెంచాల్సిన అవశ్యకతపై చైతన్యపర్చడం తనకు స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ గ్రీన్‌చాలెంజ్ అనే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విసిరిన గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా సోమవారం కే కేశవరావు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసం ఎదుట మొక్కలు నాటారు. కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్, కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్, బీజేడీ రాజ్యసభపక్షనేత ప్రసన్నాచార్య, టీడీపీ ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు కేకే గ్రీన్‌చాలెంజ్ విసిరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, గ్రీన్‌చాలెంజ్ బృందం సభ్యుడు రాఘవ, టీఆర్ఎస్వీ నాయకులు కే కిశోర్‌గౌడ్, దూదిమెట్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### కేకేకు ధన్యవాదాలు: సంతోష్‌కుమార్

గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటిన టీఆర్ఎస్ పార్లమెంటరీ నేత కే కేశవరావుకు ఎంపీ సంతోష్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను వ్యాపింపజేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కేశవరావు లాంటి అనుభవమున్న నాయకులు పాల్గొని ప్రశంసించడం సంతోషాన్నిచ్చిందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



బంజారాహిల్స్‌లోని తన నివాసం ఎదుట మొక్కనాటి నీళ్లు పోస్తున్న ఎంపీ కే కేశవరావు

## పడవ మృతుల కుటుంబాలకు నేడు చెక్కుల పంపిణీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కచ్చులూరు సమీపంలో గోదావరి నదిలో జరిగిన పడవ ప్రమాదంలో మృతిచెందినవారి కుటుంబాలకు మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ చౌరస్తాలోని అంజయ్యభవన్‌లో పరిహారం చెక్కులను పంపిణీ చేయనున్నట్టు కార్మిక, ఉపాధిశాఖల మంత్రి చామకూర మల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌తోపాటు అసెంబ్లీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొంటారని తెలిపారు.





నీరా పాలసీ విడుదల అనంతరం మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, విద్యామౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్‌గౌడ్, సీఎస్ ఎస్కే జోషి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉన్నారు.

# గౌడలకే నీరా స్టాళ్లు

మొదటిపేజీ తరువాయి...

ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో భాగంగా నీరా పాలసీని ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు, పాలసీ విడుదలకు కృషిచేసిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గీత వృత్తిని కాపాడేందుకు సీఎం కేసీఆర్ హరితహారంలో తాటి వనాల పెంపునకు ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. త్వరలో ప్రభుత్వం తరపున హైదరాబాద్‌లో నీరా స్టాళ్లను ఏర్పాటుచేస్తామని.. దశలవారీగా అన్ని జిల్లాల్లో నీరా ఉత్పత్తి, సరఫరాను చేపడుతామని తెలిపారు. నీరాలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయని, మధుమేహం తగ్గుతుందని అనేక పరిశోధనల్లో వెల్లడయిందన్నారు. హైదరాబాద్ ఔటర్ చుట్టూ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. నీరా లైసెన్స్‌లను గౌడ కులస్థులకు మాత్రమే ఇస్తామని.. గౌడలు మాత్రమే దీనిని తీయగలరని సీఎం కేసీఆర్ చెప్పారని శ్రీనివాస్‌గౌడ్ గుర్తుచేశారు. నీరా ఉత్పత్తి, సరఫరా కంబోడియా, ఆఫ్రికా, ఇండోనేషియా, మలేషియా, శ్రీలంకలో ఎక్కువగా ఉన్నదని, అమెరికాలో ఈ మధ్యలో మొదలు పెట్టారన్నారు. దేశంలో కేరళ, మహారాష్ట్రలో నీరా ఉన్నదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ వీజీగౌడ్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, విద్యామౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్‌గౌడ్, సీఎస్ ఎస్కే జోషి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

# వైభవంగా మేడారం జాతర

**సంక్రాంతిలోపు జాతర పనులు పూర్తికావాలి**

- సీఎం కేసీఆర్ రూ.75 కోట్లు మంజూరుచేశారు
- జాతీయ పండుగా గుర్తించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తాం
- సమీక్షలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి, దయాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీవరకు నిర్వహించే మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లుచేయాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మేడారం జాతర ఏర్పాట్లపై సోమవారం సంక్షేమభవన్‌లో నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మేడారం జాతరకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, జాతరపట్ల సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపి వసతులు కల్పిస్తుండటంతో ఏటా భక్తుల సంఖ్య పెరుగుతున్నదని చెప్పారు. గతంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు ఎటువంటి లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మేడారం జాతర నిర్వహణలో అనుభవజ్ఞులైన అధికారులు, సిబ్బంది ఎక్కడున్నా.. డిప్యుటేషన్‌పై తీసుకొని వారి సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. గతంలో కొన్ని ఇబ్బందులు వచ్చి కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, ఈసారి ఆ విధంగా జరుగకుండా చూడాలని సూచించారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు సమావేశమై 90 రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. మేడారం జాతరకు సీఎం కేసీఆర్ రూ.75 కోట్లు విడుదలచేశారని, శాశ్వత ప్రాతిపదికన పనులు చేసేందుకు, భూసేకరణకు, ఇతర ఏర్పాట్లకు ఈ నిధులు వినియోగించాలని తెలిపారు. 21 శాఖలు పనులను ప్రారంభించాలని, సంక్రాంతి పండుగలోపు పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. మేడారం జాతర ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర అని, కోటిన్నరకుపైగా భక్తులు సందర్శించే ఈ జాతరను జాతీయంగా, అంతర్జాతీయంగా బ్రాండింగ్ చేయాలని, జాతర చరిత్ర, విశిష్టతలు తెలిసేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రత్యేక షోలు వేయాలని సూచించారు. దేశంలోని ప్రముఖులు, గిరిజన ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతరలో వీలైనంతవరకు ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూడాలని, తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని చెప్పారు. త్వరలోనే పూజారుల కమిటీని నియమిస్తామని, స్థానికులు, ఆదివాసీల అభిప్రాయం మేరకు దీన్ని ఏర్పాటుచేస్తామన్నారు. వీఐపీలు వచ్చినప్పుడు సాధారణ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. మేడారం గిరిజన జాతరను జాతీయ పండుగగా కేంద్రం గుర్తించేలా కృషి చేస్తామన్నారు. ఈ సమీక్షలో ఎంపీలు మాలోతు కవిత, పసునూరి దయాకర్, భూపాలపల్లి జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బింధు, శాసనమండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఏ నర్సిరెడ్డి, ఎం శ్రీనివాస్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, సీతక్క, చల్లా ధర్మారెడ్డి, ములుగు కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సోమవారం సంక్షేమభవన్‌లో మేడారం జాతర ఏర్పాట్లపై సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎంపీలు మాలోతు కవిత, పసునూరి దయాకర్, మండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి కూడా ఉన్నారు.

## టీడీపీ ఎమ్మెల్యే వల్లభనేని రాజీనామా



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం శాసనసభ్యుడు వల్లభనేని వంశీ తన ఎమ్మెల్యే పదవికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు తన రాజీనామా లేఖను పంపారు. వంశీ వైఎస్సార్ కాంగ్రెస్ లేదా బీజేపీ తీర్థం పుచ్చుకుంటున్నారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ.. తాను ఏ పార్టీలో చేరబోనని చెప్తుండటంతో సందిగ్ధత వీడలేదు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ఎన్నికల్లో గెలిచానని, తర్వాత అనేక సమస్యలు తనను చుట్టుముట్టాయని చంద్రబాబుకు పంపిన లేఖలో పేర్కొన్నారు. రాజకీయంగా తనను వేధింపులకు గురిచేస్తుండటంతో రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. వంశీ రాజీనామాను బాబు అంగీకరించనట్టు తెలిసింది.

## ఏపీ రాజధానిపై సూచనలివ్వండి

- నిపుణుల కమిటీ సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ రాజధాని, ఇతర నిర్మాణ ప్రాజెక్టులపై ప్రజలు తమ సూచనలు, అభిప్రాయాలను నవంబర్ 12వ తేదీలోపు పంపాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీఎన్ రావు నేతృత్వంలోని నిపుణుల కమిటీ కోరింది. ప్రజలు తమ అభిప్రాయాలను expertcomittee2019@gmail.comకు ఈ మెయిల్ చేయాలని, లేదా విజవాడ పడమటలో ఉన్న తమ కార్యాలయానికి లేఖల రూపంలో పంపాలని సూచించింది. రాజధాని కోసం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని సెప్టెంబర్ 13 ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆరువారాల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలు, సూచనలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది.

## విహారంలో విషాదం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విహార యాత్రకు వెళ్లిన ఓ కుటుంబాన్ని మృత్యువు వెంటాడింది. దంతెవాడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించారు. వీరిని ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం విమ్స్ దవాఖానలో పని చేస్తున్న డాక్టర్ సునీత కుటుంబానికి చెందినవారిగా గుర్తించారు. డాక్టర్ సునీత కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న స్కార్పియో వాహనం దంతెవాడ సమీపంలో చెట్టును ఢీకొట్టింది. వాహనంలో ఐదుగురు ప్రయాణిస్తుండగా.. ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. వీరిలో ఇద్దరు మహిళలున్నారు.

## అఫిలియేషన్ విధానం బలోపేతం

- ఇంటర్‌బోర్డు చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రైవేటు జూనియర్ కాలేజీల అఫిలియేషన్ విధానాన్ని మరింత బలోపేతంచేసే దిశగా ఇంటర్మీడియట్ బోర్డు చర్యలు చేపట్టింది. గతంలో మాదిరిగా కాకుండా తొలుత కాలేజీలకు అఫిలియేషన్లు ఇచ్చి ఆ తర్వాత అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించాలని యోచిస్తున్నది. ఇప్పటివరకు ఒకవైపు కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియ, మరోవైపు విద్యార్థుల ప్రవేశాలు కొనసాగుతుండేవి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సులకు ఏ విధానంలో ప్రవేశాలకు ముందే అఫిలియేషన్లు ఇస్తున్నారో.. అదే తరహాలో ప్రైవేటు జూనియర్ కాలేజీలకు ఇవ్వాలని చూస్తున్నట్టు అధికారులు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి అఫిలియేషన్ ప్రక్రియ మార్చి నెలాఖరువరకు పూర్తిచేసేలా షెడ్యూల్‌తోపాటు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు.

## 9 నాటికి బీఆర్కేభవన్‌కు ఐటీ నెట్‌వర్క్

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** ఇంటర్నెట్ సేవలన్నింటినీ సజావుగా నిర్వహించే ఐటీ నెట్‌వర్క్‌ను నవంబర్ 9వ తేదీలోగా సచివాలయం నుంచి బీఆర్కేభవన్‌కు తరలించే చర్యలను అధికారులు వేగవంతంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నెట్ కనెక్టివిటీ, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే నెట్‌వర్క్ తరలింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సచివాలయం నుంచి సర్వర్లను తరలించినా.. ముఖ్యమైన కంట్రోల్ యూనిట్ మాత్రం డీ బ్లాక్‌లోనే ఉన్నది. దీంతో బీఆర్కే భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లు ఓఎఫ్‌సీ ద్వారా నిర్వహిస్తున్నప్పటికీ పాత సచివాలయం నుంచే పర్యవేక్షణ కొనసాగుతున్నది. ఇదే సమయంలో బీఆర్కే భవన్‌లో మంత్రులు, సీఎస్, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల అంతర్జాలసేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బాండ్ ద్వారా కనెక్టివిటీ ఇచ్చారు. డీ బ్లాక్ నుంచి ఐటీ నెట్‌వర్క్ కంట్రోల్ యూనిట్ల తరలింపు ప్రక్రియ పూర్తయితే అధికారులు, ఉద్యోగులందరికీ హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ అందుతుంది. అయితే అధికారులు ముందస్తుగా ప్లాన్‌చేసిన సరికొత్త డాటా సెంటర్ ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాకపోవడంతో పాత వాటితోనే డాటాసెంటర్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రస్తుత డాటాసెంటర్ పరికరాలు పదేండ్ల కిందటివి కావడంతో కొత్త సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఏర్పాటుచేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు అంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చేలోగా ప్రస్తుతం రెండేండ్ల అవసరానికి సరిపడా అతి తక్కువ వ్యయంతో బీఆర్కే భవన్‌లో డాటా సెంటర్‌ను ఏర్పాటుచేస్తున్నారు.

# విత్తనోత్పత్తిని భారీగా పెంచాలి

- 33 జిల్లాల్లో విత్తనాభివృద్ధి సంస్థ విక్రయ కేంద్రాల ఏర్పాటు
- వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో విత్తనోత్పత్తిని భారీగా పెంచాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాసంగి విత్తనోత్పత్తితోపాటు, వచ్చే ఏడాది విత్తనాల సరఫరాపై విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో సోమవారం హాకాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంకా రెండు పంటలకు సరిపడా సాగునీరు అందుబాటులో ఉన్నదని.. ఇందుకనుగుణంగా ఉత్పాదకత, నాణ్యత కలిగిన కొత్త వరి వంగడాలు ఉత్పత్తి చేయాలని సూచించారు. కేఎన్ఎం 118, ఎంటీయూ 1010, ఆర్ఎన్ఆర్ 15084 వంటి కొత్త వరి వంగడాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఉద్యాన పంటలైన టమాట, మిరప, బెండ తదితర కూరగాయల విత్తనోత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. గతం కన్నా 5 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి పెంచుతూ.. 2019-20 సంవత్సరానికి 8.07 లక్షల క్వింటాళ్లు విత్తన ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించినట్టు మంత్రి వెల్లడించారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ అమ్మకం కేంద్రాలు ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ ఏడాది యాసంగి సీజన్‌కు 40,253 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు సరఫరాచేసినట్టు తెలిపారు. వచ్చే నవంబర్ మొదటివారం వరకు విత్తన సరఫరా జరుగుతుందని వెల్లడించారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నుంచి ఇతర రాష్ట్రాలకు కూడా విత్తన సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు, సంస్థ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులు తదితరులు పాల్గొన్నారు.



సోమవారం హాకాభవన్‌లో వ్యవసాయశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి తదితరులు ఉన్నారు.

## జర్మనీ, నెదర్లాండ్‌కు నిరంజన్‌రెడ్డి బృందం

వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక ప్రతినిధి బృందం సోమవారం రాత్రి జర్మనీ, నెదర్లాండ్ పర్యటనకు బయలుదేరివెళ్లింది. మంగళవారం నుంచి ఎనిమిదిరోజులపాటు రెండుదేశాల్లో పర్యటించనున్నది. ఇండో-జర్మన్ విత్తన రంగ సహకార ప్రాజెక్టులో భాగంగా జర్మనీ ఆహార-వ్యవసాయశాఖ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ బృందం వెళ్తున్నది. నిరంజన్‌రెడ్డితోపాటు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులుతో కూడిన ప్రతినిధి బృందం జర్మనీ, నెదర్లాండ్స్‌లో విత్తనాభివృద్ధి, వ్యవసాయరంగంలో సహకార వ్యవస్థపై అధ్యయనం చేయనున్నది. బెర్లిన్‌లో అక్కడి మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశమవుతుంది. విత్తనరంగ అంశాలు, పాలసీలు, జర్మనీ వ్యవసాయ రంగం, పంటల సాగు విధానం, పథకాలపై చర్చిస్తుంది. రెండుదేశాల్లో వ్యవసాయరంగంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం, సహకార సంఘాల వ్యవస్థ, పనితీరు, ఆర్థిక అంశాలపై అధ్యయనం చేయనున్నది.

## కూనంనేని దీక్ష భగ్నం

- నిమ్స్‌కు తరలింపు
- దవాఖానలో దీక్ష కొనసాగిస్తున్న సీపీఐ నేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు గత మూడ్రోజుల నుంచి చేస్తున్న నిరాహారదీక్షను ఆదివారం అర్ధరాత్రి పోలీసులు భగ్నంచేశారు. చికిత్స నిమిత్తం ఆయనను నిమ్స్ దవాఖానకు తరలించారు. దీంతో ఆయన దవాఖానలో దీక్షను కొనసాగిస్తున్నారు. కూనంనేని సాంబశివరావు దీక్షను బలవంతంగా భగ్నంచేశారని సీపీఐ నేతలు డాక్టర్ కే నారాయణ, చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, అజీజ్‌పాషా తదితరులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసుల తీరును వారు తీవ్రంగా ఖండించారు. నిమ్స్ దవాఖానలో దీక్ష కొనసాగిస్తున్న సాంబశివరావును పరామర్శించి ఆయనకు మద్దతు తెలిపారు.

## పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి టీ సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 26 వరకు 1.20 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు వ్యవసాయశాఖ నిర్ధారించిందని, 80,447 ఎకరాల విస్తీర్ణంలో వరిపంట దెబ్బతిని దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పత్తి 35,610 ఎకరాల్లో, మొక్కజొన్న 4,022 ఎకరాల్లో నష్టపోయినట్టు తెలిపారు. కోత కోసి ఆరబెట్టిన మొక్కజొన్న తడిసి ముద్దయిందని ఆందోళన వ్యక్తంచేశారు.

# డిగ్రీలో కామర్సే టాప్

- సైన్స్ కోర్సులకు ఆదరణ అంతంతే
- రాష్ట్రంలో నాలుగేండ్లుగా ఇదే పరిస్థితి
- డిగ్రీ ప్రవేశాలపై దోస్త్-2019 నివేదిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో డిగ్రీ విద్యార్థులు కామర్స్ చదివేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. బీఏ, బీఎస్సీ కోర్సులతో పోలిస్తే.. బీకామ్‌లో అధికశాతం మంది ప్రవేశాలు పొందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మిగతా కోర్సుల విద్యార్థులకంటే కామర్స్ పూర్తిచేసినవారికి వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తుండటంతో ఆ కోర్సుల్లో చేరుతున్నారు. అందుకే కామర్స్ డిగ్రీలో టాప్‌లో నిలిచింది. బీఎస్సీ కోర్సులకు ఆదరణ నామమాత్రంగా ఉన్నది. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు చదివిన విద్యార్థులకు కూడా డిగ్రీలో బీకామ్ కంప్యూటర్, బీకామ్ జనరల్ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారు. రాష్ట్రంలో నాలుగేండ్ల నుంచి ఇదే పరిస్థితి ఉన్నట్టు దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. డిగ్రీ ప్రవేశాలపై దోస్త్-2019 నివేదికను విడుదలచేశారు. 2016-17లో 2,15,263 మంది, 2017-18లో 2,00,805 మంది, 2018-19లో 2,01,867 మంది, 2019-20లో 2,22,707 మంది డిగ్రీలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. ఈ ఏడాదిలో కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో డిమాండ్‌లేని కోర్సులతోపాటు తెలుగు మీడియం కోర్సులు కూడా మూతపడ్డాయి. దీంతో ఈ ఏడాది బీకామ్‌లో ప్రవేశాలు తక్కువగా కనిపిస్తున్నా.. డిమాండ్ మాత్రం తగ్గలేదు.

**నాలుగేండ్లుగా బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశ వివరాలు**

| సంవత్సరం | బీఏ | బీకామ్ | బీఎస్సీ |
|---|---|---|---|
| 2016-17 | 29,887 | 90,068 | 91,975 |
| 2017-18 | 25,537 | 80,776 | 92,030 |
| 2018-19 | 28,292 | 78,843 | 90,786 |
| 2019-20 | 32,772 | 88,871 | 90,746 |



## కిషన్‌రెడ్డి కార్యాలయంలో ఒక్కరికే అవకాశం

- ఆమ్రపాలి, అంబర్ కిషోర్‌జాకు ఇతర బాధ్యతలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ కిషన్‌రెడ్డి కార్యాలయంలో రాష్ట్రం నుంచి ఇద్దరు ఆలిండియా సర్వీసెస్ అధికారులుసహా ముగ్గురిని కేంద్రం నియమించినప్పటికీ ఇంటెలిజెన్స్ నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో ఒక్కరినే నియమించారు. మిగిలిన ఒక ఐఏఎస్, మరో ఐపీఎస్ అధికారికి ఇతర బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కిషన్‌రెడ్డి ఓఎస్డీగా జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్న ఆమ్రపాలి (ఐఏఎస్)ని, కార్యదర్శిగా సౌత్‌జోన్ డీసీపీగా పనిచేస్తున్న అంబర్ కిషోర్‌జా(ఐపీఎస్)ను, ప్రైవేట్ కార్యదర్శిగా జీహెచ్ఎంసీ క్రీడా విభాగం డైరెక్టర్ శశికిరణాచారిని కేంద్రం నియమించిన విషయం తెలిసిందే. అయితే శశికిరణాచారి ఒక్కరే ఇప్పటివరకు బాధ్యతలు స్వీకరించారు. తాజాగా ఆమ్రపాలిని కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్‌లో డిప్యూటీ సెక్రటరీగా నియమించారు. అంతేకాకుండా ఇంతకాలం తెలంగాణ క్యాడర్ ఐఏఎస్ అధికారిగా పనిచేస్తున్న ఆమెను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడంతో ఆమెను రిలీవ్ చేయాలని కోరుతూ ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కేంద్రం ఆదేశించింది. ఆమ్రపాలి నాలుగేండ్లపాటు కేంద్ర విధుల్లో కొనసాగనున్నారు. మరో అధికారి అంబర్ కిషోర్‌జాను బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్ అండ్ డీ)లో సహాయ సంచాలకుడిగా కేంద్రం నియమించింది. ఈయన కూడా కేంద్ర సర్వీసుల్లో నాలుగేండ్లపాటు కొనసాగనున్నారు.

## భార్యపై హత్యాయత్నం

- ప్రాణాలతో బయటపడిన బాధితురాలు.. కేసు నమోదు

**సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని లచ్చక్కపేటకు చెందిన దారు తిరుపతి ఆదివారం రాత్రి భార్య రమను ఇంటి సమీపంలోని బావిలో నెట్టేశాడు. అదృష్టవశాత్తు ఆమె ప్రాణాలతో బయటపడింది. ఎస్సై శీలం రాజయ్య కథనం ప్రకారం.. మూడేండ్ల క్రితం బుగ్గారం గ్రామానికి చెందిన రమను వివాహం చేసుకున్న తిరుపతి, ఆయన కుటుంబసభ్యులు కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. ఆదివారం రాత్రి రమను బయటకు తీసుకెళ్లిన తిరుపతి.. ఆమెను బావిలోకి నెట్టేసి పరారయ్యాడు. బావిలోని చెట్లపొదలపై పడిన రమ ప్రాణాలతో బయటపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుపతి, ఆయన కుటుంబసభ్యులపై హత్యాయత్నం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజయ్య తెలిపారు.

### సమాధుల వద్ద దీపావళి





కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బీట్‌రోడ్‌తోపాటు పలుప్రాంతాల్లోని సమాధుల వద్ద పూర్వీకుల కుటుంబ సభ్యులు దీపావళి జరుపుకొన్నారు. సమాధులకు రంగులువేసి పూలతో అలంకరించారు. దీపాలు, కొవ్వొత్తులు వెలిగించారు. సాయంత్రం కుటుంబసభ్యులతో అక్కడికి చేరుకొని, ఇంటినుంచి తీసుకొచ్చిన ఆహార పదార్థాలను నైవేద్యాలుగా సమర్పించారు. అనంతరం గతించినవారిని స్మరిస్తూ పటాకులు కాల్చారు. -సుభాష్‌నగర్

## రోడ్డు ప్రమాదంలో మిషన్ భగీరథ ఏఈ మృతి

**సిరిసిల్ల రూరల్:** రోడ్డు ప్రమాదంలో మిషన్ భగీరథ ఏఈ మృతిచెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో ఆదివారం రాత్రి జరిగింది. జిల్లెల్లకి చెందిన పొన్నాల దేవదాస్ (24) రెండేండ్ల క్రితం పంచాయతీరాజ్ శాఖలో ఏఈ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. డిప్యుటేషన్‌లో భాగంగా ఆదిలాబాద్‌లోని ఊట్నూర్‌లో మిషన్‌భగరథలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీపావళిని పురస్కరించుకొని స్వగ్రామానికి చేరుకున్నారు. ఆదివారం స్నేహితులు వెంకటసాయి, వెంకటేశ్‌తో కలిసి సిద్దిపేటకు వెళ్లారు. తిరిగి వస్తుండగా జిల్లెల్ల శివారులోని మలుపు వద్ద కారు అదుపు తప్పి చెట్లల్లోకి దూసుకెళ్లగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు సిరిసిల్ల జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడినుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా దేవదాస్ మృతిచెందారు. మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నారు.



దండారి వేడుకల్లో భాగంగా గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

# వైభవంగా దండారి వేడుకలు

## అధికారికంగా సంబురాలు.. రూ.కోటి నిధులు అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం

**ఆదిలాబాద్, నమస్తేతెలంగాణ ప్రతినిధి:** గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. ఇందులో భాగంగా వారు జరుపుకొనే పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్నది. ఆదిలాబాద్ జిల్లాలో దీపావళి పండుగ సందర్భంగా ఆదివాసీలు ఎంతో ఉత్సాహంగా జరుపుకొనే దండారి వేడుకలకు ప్రభుత్వం కోటిరూపాయలు మంజూరుచేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ గూడేల్లో దండారి వేడుకలకు సీఎం కేసీఆర్ రూ. కోటి మంజూరు చేశారు. ప్రతి గూడేనికి రూ.10 వేల చొప్పున మంజూరుకాగా ఇందుకు సంబంధించిన డబ్బులను ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామ పటేళ్లు, దండారి బృందాలకు అందజేశారు. దీంతో ఆదివాసీ గిరిజనులు దండారి వేడుకలను వైభవంగా జరుపుకొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలకు రాష్ట్రప్రభుత్వం ఇతోధిక ప్రాధాన్యమిస్తున్నది. ఆదివాసీ గూడేల్లోని ఆలయాల నిర్మాణాలకు సైతం సర్కారు ఆర్థిక సాయం అందజేస్తున్నది.



తెలంగాణలోనే వినూత్న రీతిలో నిర్వహించే నేతకాని కులస్థుల 'దీపావళి-బతుకమ్మ' ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల వేడుకల్లో భాగంగా మొదటి రోజైన ఆదివారం కుటుంబ సభ్యులు కలిసి కేదారీశ్వరస్వామి వ్రతకల్పం నిర్వహించారు. దీపావళి రోజున నేతకాని కులస్థులంతా కలిసి గ్రామ శివారులోని కుంటకు వెళ్లి కుంటలోని రేగడి మట్టిని తీసుకొచ్చి జోడెద్దుల విగ్రహప్రతిమలను తయారు చేశారు. రెండో రోజైన సోమవారం కేవలం మగవారు మాత్రమే రకరకాల పిండి వంటలతో నగలను తయారు చేసి జోడెద్దుల ప్రతిమలను అందంగా తీర్చిదిద్దారు. అనంతరం కేదారీశ్వరస్వామికి మొక్కులు చెల్లించుకొని జోడెద్దుల ప్రతిమలను పెద్ద కుంటలో నిమజ్జనం చేశారు.

- హసన్‌పర్తి (వరంగల్ అర్బన్)





కోటినాయక్‌తండాలో మహిళలతో కలిసి కోలాటం ఆడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

## సూర్యాపేటకు గోదావరి జలాలు

- సీఎం కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనం: మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట, నమస్తేతెలంగాణ:** సూర్యాపేట జిల్లాకు గోదావరి జలాలు రావడం సీఎం కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనమని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. దీపావళి పండుగ రోజు జిల్లాకు వచ్చిన కాళేశ్వరం జలాలవెంట రైతులతో కలిసి పటాకులు కాల్చి పండుగ జరుపుకొన్నారు. సూర్యాపేట నియోజకవర్గం పరిధిలోని ఆత్మకూర్ ఎస్ మండలం కోటినాయక్ తండా వద్ద ఎస్సారెస్పీ 71, 36వ డీబీఎం కాల్వ కట్టలు, పెన్‌పహాడ్ మండలం ధర్మాపురం చెరువు అలుగు వద్ద వందలాది మంది రైతులు, టీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆదివారం రాత్రి దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ సభకు వెళ్తూ గోదావరి జలాలను చూసిన సీఎం కేసీఆర్ కండ్లలో నిజమైన ఆనందం కనిపించిందని చెప్పారు. గత దీపావళి రోజున ఇచ్చిన మాట ప్రకారం ఈ దీపావళికి గోదావరి జలాలు వచ్చాయన్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న 139 మందికి మెరుగైన వైద్యం కోసం రూ.36.29 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం కరీంనగర్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పంపిణీ చేశారు.

- కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ

# పండుగవేళ పల్లెపల్లెకు బస్సులు

- ముమ్మరంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- రోడ్డెక్కిన 6,209 బస్సులు
- ప్రయాణికులతో కిటకిటలాడిన సర్వీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ:** దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఆర్టీసీ అధికారులు పల్లెపల్లెకూ బస్సులు నడిపారు. ప్రజ లు తిరుగు ప్రయాణమవుతుండటంతో అందు కు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులతోపాటు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. అన్నిప్రధాన రహదారుల్లో బస్సులు యథాతథంగా నడపడానికి సంస్థ యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగే అంశాలపై చర్యలు చేపట్టాలని ఇప్పటికే రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 4309 ఆర్టీసీ, 1900 అద్దె బస్సులు మొత్తంగా 6209 బస్సులు తిరిగాయని తెలిపారు. 4309 ప్రైవేటు డ్రైవర్లు, 6209 మంది ప్రైవేట్ కండక్టర్లు విధులు నిర్వహించారని, 5033 బస్సుల్లో టిమ్స్ ద్వారా, 692 బస్సుల్లో నేరుగా టికెట్లు జారీ జేసినట్టు అధికారులు తెలిపారు. సమ్మె నేపథ్యంలో పోలీసులు డిపోలవద్ద భారీబందోబస్తు ఏర్పాటుచేశారు.



వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోల పరిధిలో 80 బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచారు. ఆదిలాబాద్‌డిపో పరిధిలో 33 ఆర్టీసీ, 20 అద్దె బస్సులు, ఉట్నూర్ డిపో పరిధిలో 22 ఆర్టీసీ, 5 అద్దె బస్సుల ద్వారా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేసేలా చర్యలు తీసుకున్నారు. సూర్యాపేట జిల్లాలో యధావిధిగా బస్సులు తిరిగాయి. ప్రభుత్వం, అధికారుల ప్రత్యామ్నాయ చర్యలతో ప్రయాణికుల రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. సూర్యాపేట, కోదాడ డిపోల పరిధిలో 95 శాతానికిపైగా బస్సులు రోడ్డెక్కాయి. సూర్యాపేట డిపో పరిధిలో 99 బస్సులను, కోదాడ డిపో పరిధిలో 79 బస్సులు ప్రయాణికులకు సేవలందించాయి. ఆదివారం దీపావళి రోజు సైతం కోదాడ డిపో పరిధిలో 40 ఆర్టీసీ, 25 అద్దెబస్సులు, సూర్యాపేట డిపో పరిధిలో 55 ఆర్టీసీ, 44 అద్దెబస్సులు నడిపించారు. నల్లగొండ జిల్లాలో ఆది, సోమవారాల్లో ఆర్టీసీ బస్సులు యధావిధిగా నడిచాయి. బస్సుల్లో టిమ్స్ ద్వారా టికెట్లు జారీచేశారు. ఖమ్మం జిల్లాలో ఆర్టీసీ బస్సులు పరుగులు తీశాయి. సోమవారం ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోల్లో బస్సులు యథావిధిగా నడిచాయి. డిపోల్లో తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల ద్వారా ఆర్టీసీ బస్సులను విజయవంతంగా నడిపారు. జిల్లాలో ఆర్టీసీ, అద్దె బస్సులు, ప్రైవేట్ బస్సులు, మ్యాక్సీక్యాబ్‌లు కలిపి 373 నడిచాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజారవాణా పూర్తిగా గాడిలో పడింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల నుంచి సోమవారం 203 బస్సులు నడిపి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. కొత్తగూడెం డిపోనుంచి 48 ఆర్టీసీ, 20 హైర్ బస్సులు, భద్రాచలం డిపో పరిధిలో 50 ఆర్టీసీ, 23 హైర్ బస్సులు, మణుగూరు డిపో పరిధిలో 41 ఆర్టీసీ, 21 హైర్ బస్సు సర్వీసులు నడిచాయి. దీంతో 90శాతానికి పైగా బస్సులు నడిచినట్లయిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల నుంచి సోమవారం 190 బస్సులు వివిధ ప్రదేశాలకు ప్రయాణికులను చేరవేశాయి. వికారాబాద్ డిపోలో 82 బస్సులు ఉండగా 59 బస్సులు, తాండూరు డిపోలో 93 బస్సులుండగా 66 బస్సులు, పరిగి డిపోలో 87 బస్సులుండగా 65 బస్సులు వివిధ ప్రాంతాలకు నడిచాయి. వరంగల్ రీజియన్‌లో ఆర్టీసీ ప్రత్యామ్నాయ సేవలు సాఫీగా సాగుతున్నాయి. సోమవారం రీజియన్ పరిధిలో 647 బస్సులను నడిపినట్టు అధికారులు తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా రద్దీ ఉన్న రూట్లు హైదరాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ఏటూరునాగారం, ఖమ్మం, బెంగళూర్‌కు అదనపు సర్వీస్‌లను ఏర్పాటు చేశారు.

కరీంనగర్ రీజియన్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో సోమవారం 97.71% బస్సులు నడిచాయి. 656 బస్సులు నడపాల్సి ఉండగా 450 ఆర్టీసీ, 191 అద్దె బస్సుల చొప్పున మొత్తం 641 బస్సులు నడిపారు. జిల్లాల వారీగా చూస్తే సిరిసిల్ల, జగిత్యాలలో 100% బస్సులు నడిపారు. కరీంనగర్‌లో 97.09, పెద్దపల్లిలో 89.26% బస్సులు నడిపారు.

### ఎప్పుడు పిలిచినా చర్చలకు వస్తాం

**ఆర్టీసీ జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చర్చలకు ఎప్పుడు పిలిచినా వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైకోర్టులో వాదనల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చర్చల నుంచి తాము వెళ్లిపోయామనడం వాస్తవం కాదని చెప్పారు. కార్మికులెవరూ ఆత్మబలిదానాలు చేసుకోవద్దని పిలుపునిచ్చారు.

నిజామాబాద్ రీజియన్ పరిధిలో 422 బస్సులు నడిచాయి. నిజామాబాద్ డివిజన్ పరిధిలో మొత్తం 267 బస్సులు ఉండగా, ఇందులో ఆర్మూర్ డిపో నుంచి 70, బోధన్ డిపో నుంచి 66, నిజామాబాద్-1 డిపో నుంచి 68, నిజామాబాద్-2 డిపో నుంచి 63 బస్సులను నడిపారు. కామారెడ్డి డివిజన్ పరిధిలోని బాన్సువాడ డిపో పరిధిలో 57 బస్సులు, కామారెడ్డి డిపో పరిధిలో 98 కలిపి మొత్తం 155 బస్సులను నడిపించినట్టు నిజామాబాద్ ఆర్‌ఎం సోలోమాన్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం 44 ఆర్టీసీ, 36 అద్దెబస్సులు, సోమవారం 64 ఆర్టీసీ, 37 అద్దె బస్సులు నడిపినట్టు అధికారులు తెలిపారు. రెండ్రోజుల్లో దాదాపు 21వేల మందికిపైగా ప్రయాణికులను ఆయా ప్రాంతాలకు చేరవేసినట్టు అధికారులు తెలిపారు. నారాయణపేట జిల్లాలో సోమవారం 47 ఆర్టీసీ, 31 ప్రైవేటు బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాయి.

### ఖమ్మంలో మహిళా కండక్టర్ ఆత్మహత్య



నీరజ (ఫైల్)

**ఖమ్మం క్రైం:** ఓ మహిళా కండెక్టర్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన సోమవారం ఖమ్మంలో చోటుచేసుకున్నది. సత్తుపల్లి డిపోకు చెందిన కండక్టర్ నీరజ(30) ఖమ్మం కవిరాజ్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఆమె తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమె భర్త రాజశేఖర్ స్థానిక గ్రానేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. నీరజ మరణవార్త తెలుసుకున్న బంధువులు ఆమె మృతదేహాన్ని కవిరాజ్‌నగర్ నుంచి కలెక్టరేట్ వద్దకు తీసుకొచ్చి ఆందోళన చేపట్టారు. ట్రైనీ కలెక్టర్ ఆదర్శ్ సురభి ఘటనాస్థలికి చేరుకొని రూ. 7.50లక్షల నష్ట పరిహారం, మూడెకరాలభూమి ఇప్పించేందుకు కృషిచేస్తానని హామీఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఘటనాస్థలిలో సూసైడ్ నోట్ లభించలేదు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

**ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం**

**పరిగి, నమస్తే తెలంగాణ:** ఓ ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగిలో సోమవారం చోటుచేసుకున్నది. పరిగికి చెందిన గొల్ల వెంకటయ్య పరిగి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వెంకటయ్య కూతురు సుమలత పరిగిలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటిఏడాది చదువుతున్నది. ఫీజు చెల్లించలేదంటూ కళాశాల యాజమాన్యం తన కూతురును బయటకు నెట్టివేసిందని వెంకటయ్య సోమవారం కొడంగల్ క్రాస్‌రోడ్డులో షాద్‌నగర్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సుకు అడ్డుగావెళ్లి ఆత్మహత్యకు యత్నించాడు. డ్రైవర్ బ్రేక్ వేయడంతో ప్రమాదం తప్పింది. అనంతరం తలను రోడ్డుకు బాదుకున్నాడు. అతడికి స్వల్పగాయాలు కావడంతో తోటికార్మికులు దవాఖానకు తరలించారు.

**గుండెపోటుతో మహిళాకండక్టర్ మృతి**



లతామహేశ్వరి (ఫైల్)

**హుస్నాబాద్, నమస్తే తెలంగాణ:** హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న లతామహేశ్వరి అనే మహిళా కండక్టర్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. వరంగల్‌అర్బన్ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో టీవీచూస్తూ ఆకస్మాత్తుగా చనిపోయినట్టు సమాచారం. సమ్మెకు ముందు నుంచే ఆమె సిక్‌లీవ్‌లో ఉన్నారని.. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారని డీఎం రజనీకృష్ణ తెలిపారు. సమ్మె ఇంకెన్ని రోజుల కొనసాగుతుందోనని ఆందోళనచెంది గుండెపోటుతో మరణించినట్టు ఆర్టీసీ కార్మికులు తెలిపారు.

# కన్నతల్లి కర్కశత్వం

## ఇద్దరు పిల్లల గొంతు కోసి చంపి.. ఆపై తానూ ఆత్మహత్యాయత్నం

### జనగామ జిల్లాలో దారుణం

**జనగామ, నమస్తే తెలంగాణ:** ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను కత్తితో కిరాతకంగా గొంతుకోసి చంపింది. ఆపై తానూ అదే కత్తితో గొంతుకోసుకొని దవాఖానలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నది. ఈ ఘటన సోమవారం సాయంత్రం జనగామ జిల్లా నర్మెట మండలం మల్కాపేట శివారు శివభూక్యాతండాలో చోటుచేసుకున్నది. శివభూక్యాతండాకు చెందిన బానోత్ గోపాల్, రమ దంపతులకు భానుశ్రీ(4), వరుణ్(3) సంతానం. ఆదివారం కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందంగా దీపావళి పండుగను జరుపుకొన్నారు. సోమవారం మధ్యాహ్నం గోపాల్ పత్తి బస్తాల కోసం నర్మెట వెళ్లాడు. అప్పటిదాకా ఇంటి ఆవరణలో ఆడుకున్న ఇద్దరు చిన్నారులు రక్తపు మడుగులో విగత జీవులుగా పడి ఉన్నారు. ఇంటి ఆవరణలో కొన ఊపిరితో తల్లి కొట్టుకుంటూ కనిపించడంతో గమనించిన గ్రామస్థులు చికిత్స కోసం జనగామ ఏరియా దవాఖానకు తరలించారు. ఈ ఘటనలో భానుశ్రీ, వరుణ్ అక్కడికక్కడే మృతి చెందగా, తల్లి రమ చావుబతుకుల మధ్య చికిత్స పొందుతున్నది. అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తనువు చాలించాలనుకున్న తల్లి.. తాను లేకుంటే పిల్లలు ఒంటరి అవుతారని భావించి ఇంతటి కిరాతకానికి ఒడిగట్టి ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. విషయం తెలియగానే తిరిగివచ్చిన గోపాల్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఘటనాస్థలాన్ని జనగామ అర్బన్ సీఐ మల్లేశ్ యాదవ్ సందర్శించి వివరాలను తెలుసుకొన్నారు. నర్మెట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నిండుకుండలా శ్రీరాంసాగర్

- ఎస్సారెస్పీకి 40,430 క్యూసెక్కుల వరద
- ఎల్లంపల్లికి భారీగా ఇన్‌ఫ్లో

**పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ/కాళేశ్వరం/మహదేవపూర్/జోగులాంబ గద్వాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ/నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ/నందికొండ:** మహారాష్ట్రలో కురుస్తున్న భారీవర్షాలతో శ్రీరాంసాగర్ నిండుకుండలా మారింది. ప్రాజెక్టులో 90.313 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, ప్రాజెక్టు పూర్తిగా నిండింది. ఎస్సారెస్పీకి ఎగువనుంచి 40,430 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో 8 గేట్లను ఎత్తి 33,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతోపాటు పలు కాల్వల ద్వారా వస్తున్న వరదతో పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లిలోకి 1,11,412 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. 20 గేట్లను ఎత్తి 1,03,690 టీఎంసీల నీటిని దిగువకు వదులుతున్నారు. ఎల్లంపల్లి బరాజ్ నుంచి భారీగా నీటిని కిందికి వదులుతుండడంతో దిగువన ఉన్న మంథని మండలం సిరిపురంలో 8.83 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన పార్వతి బరాజ్ నిండుకుండలా మారుతున్నది. 1,04,000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో 58 గేట్లను ఎత్తి అదేస్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సరస్వతి (అన్నారం) బరాజ్‌కు 95,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంటంతో 10 గేట్లు ఎత్తి 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మహదేవపూర్ మండలంలోని లక్ష్మీబరాజ్‌లో రెండు లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో అదేస్థాయిలో నీటిని బయటకు వదులుతున్నారు. భద్రాచలం పట్టణం వద్ద గోదావరి ప్రవాహం క్రమేపీ పెరుగుతున్నది. సోమవారం సాయంత్రం 6 గంటలకు 24.7 అడుగులు దాటి ప్రవహిస్తున్నది. అక్టోబర్‌లో ఇంత భారీగా వరద రావడం గత 24 ఏండ్లల్లో ఇదే ప్రథమం.



ఎస్సారెస్పీ గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు (ఫైల్)

**జూరాలకు 1.14 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

జూరాలకు 1,14,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,12,717 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. శ్రీశైలం జలాశయానికి 1,77,794 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 68 వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. నాగార్జునసాగర్‌కు 1,09,218 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. సాగర్ డ్యాం 4 క్రస్టుగేట్లను ద్వారా 59,656 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీకి 1500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 152 క్యూసెక్కుల నీటిని కుడి, ఎడమ కాల్వల ద్వారా బయటకు వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు 1,05,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 1,19,513 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

## నేడు బాబ్లీగేట్ల మూసివేత!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/కమ్మర్‌పల్లి, నమస్తేతెలంగాణ:** ఎస్సారెస్పీ ఎగువన ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మంగళవారం మూసివేయనున్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఏటా బాబ్లీగేట్ల ఎత్తివేత, మూసివేత ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం బాబ్లీ గేట్లను మూసివేయాల్సి ఉన్నది. అయితే సోమవారం సాయంత్రం విష్ణుపురి రెండు గేట్లను మళ్లీ ఎత్తడంతో బాబ్లీకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. బాబ్లీకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో, దిగువకు గోదావరిలోకి మిగులు జలాల విడుదల కొనసాగుతుండటంతో గేట్ల మూసివేత ఇప్పుడే ఉంటుందా? లేదా? అనే పరిస్థితి కనిపించింది. ఒకవేళ మంగళవారం నాటికి బాబ్లీకి ఇన్‌ఫ్లో పెరిగితే రెండు రాష్ట్రాల అధికారులు మంగళవారం ఉదయం పరిశీలించిన తరువాత గేట్ల మూసివేతపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఇప్పుడు గేట్లను మూసివేసి తిరిగి వచ్చే ఏడాది జూన్ 30న తెరుస్తారు.

## భవనం పైనుంచి దూకి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**నిజామాబాద్ క్రైం:** ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థిని హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ ప్రాంతంలో సోమవారం చోటుచేసుకున్నది. తోటి విద్యార్థినులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా చిట్యాల మండలానికి చెందిన బగుళ వర్ష(17) నిజామాబాద్‌లోని శ్రీమేధావి జూనియర్ కళాశాలలో బైపీసీ రెండోసంవత్సరం చదువుతూ అదే కళాశాల హాస్టల్‌లో ఉంటున్నది. సోమవారం మధ్యాహ్నం సమయంలో హాస్టల్ భవనం మూడో అంతస్తు పైనుంచి దూకింది. ఒక్కసారిగా శబ్దం రావడంతో గమనించిన సిబ్బంది సదరు విద్యార్థినిని చికిత్స కోసం స్థానికంగా గల ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకొన్న విద్యార్థిని తల్లిదండ్రులు, వారి బంధువులు హుటాహుటిన వైద్యశాలకు చేరుకొని బోరున విలపించారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

## పాఠాలు చెబుతూనే హెచ్‌ఎం కన్నుమూత



కుర్చీలోనే కుప్పకూలిన హెచ్‌ఎం విజయ్‌సింగ్

**తొర్రూరు, నమస్తేతెలంగాణ:** పాఠాలు చెబుతూనే ఓ ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్ట గ్రామ ఎస్సీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం చోటుసుకున్నది. తొర్రూరు ఎంఈవో మహంకాళి బుచ్చయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లికట్ట ప్రాథమికపాఠశాల హెచ్‌ఎం విజయ్‌సింగ్(56) సోమవారం మధ్యాహ్నం 12.15 గంటల ప్రాంతంలో పాఠశాలలోని తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతూనే తాను కూర్చున్న కుర్చీలో ఒరిగాడు. మరో ఉపాధ్యాయుడు గమనించి వెంటనే దవాఖానకు తరలించగా గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు తెలిపారు. విజయ్‌సింగ్ స్వగ్రామం వరంగల్‌రూరల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడెం.

## ఎరువుల బస్తాలు స్వాధీనం

**బెల్లంపల్లి, నమస్తేతెలంగాణ:** బెల్లంపల్లిలో కేరిచ్‌ను యూరియాలో కలిపి పంటలకు వాడొచ్చని నమ్మబలికి రైతులను మోసం చేస్తున్న ఎరువుల దుకాణంపై సోమవారం వ్యవసాయ అధికారులు దాడులు చేశారు. బెల్లంపల్లి మండలం చాకపల్లికి చెందిన ఓ రైతు పట్టణంలోని హన్మాన్ ఆగ్రోస్ ఎరువుల దుకాణంలో కేరిచ్ కొనుగోలుచేసి ఎరువులో కలుపడంతో యూరియా ముద్దగా మారింది. ఈ విషయాన్ని బెల్లంపల్లి వ్యవసాయ కార్యాలయంలో ఆ రైతు ఫిర్యాదు చేశాడు. దీంతో వ్యవసాయ సహాయ సంచాలకులు సురేఖ హన్మాన్ ఆగ్రోస్ దుకాణాన్ని తనిఖీ చేశారు. అందులో 26 కేరిచ్ బస్తాలు స్వాధీనం చేసుకున్నారు.

## గురుకులం నుంచి అదృశ్యమైన నలుగురు విద్యార్థినులు

### 30 గంటల్లో ఆచూకీ గుర్తించిన పోలీసులు

**కల్వకుర్తి, నమస్తే తెలంగాణ:** గురుకులానికి చెందిన నలుగురు విద్యార్థినులు అదృశ్యం కాగా దాదాపు 30 గంటల్లో ఆచూకీ కనిపెట్టారు. అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన నలుగురు విద్యార్థినులు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్నారు. వీరు శనివారం రాత్రి నుంచి కన్పించకుండా పోయారు. ఆదివారం ఉదయం మెస్‌కు, తరగతులకు గైర్హాజరు కావడంతో ఉపాధ్యాయులు గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడగా ఇంటికి రాలేదని తెలియడంతో సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు విద్యార్థినులు తుఫాన్ వాహనం ఎక్కినట్టు కల్వకుర్తి బస్టాండ్ పరిసరాల్లో సీసీ కెమెరాల సహాయంతో గుర్తించారు. సదరు వాహన డ్రైవర్‌ను విచారించగా, వారిని హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో వదిలిపెట్టినట్టు తెలిపాడు. అక్కడి నుంచి వారు వరంగల్ వెళ్లినట్టు గుర్తించిన కల్వకుర్తి సీఐ సైదులు, ఎస్సై నర్సింహ్మ రెండు పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈలోగా నలుగురు విద్యార్థినుల్లోని ఓ అమ్మాయి అన్న హైదరాబాద్‌లో ఉండటంతో విషయం తెలిసిన అతను వరంగల్ వెళ్లిన అమ్మాయిల ఆచూకీ కనుగొని వారిని అమ్రాబాద్ తీసుకొచ్చాడు. పోలీసులు సదరు అమ్మాయిలను అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించి వారిని తల్లిదండ్రుల వెంట ఇంటికి పంపించారు.

## నారాయణఖేడ్‌లో నలుగురిపై ట్రిపుల్ తలాక్ కేసు

**నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పీఎస్‌లో సోమవారం ట్రిపుల్ తలాక్ చెప్పిన భర్తతోపాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నారాయణఖేడ్‌కు చెందిన యువతికి 2011లో హైదరాబాద్‌లోని చింతల్ గణేశ్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఫసియుద్దీన్‌తో వివాహమైంది. భర్త, అత్తమామలు వేధిస్తుండటంతో సదరు యువతి ప్రస్తుతం పుట్టింట్లో ఉంటున్నది. జూలై 19న భర్త తరపు బంధువులు ముగ్గురు ఆ యువతి ఇంటికి వచ్చి బెదిరించారు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్న భర్త ఫసియుద్దీన్ ఫోన్‌లో తలాక్ చెప్పారు. దీంతో యువతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భర్త ఫసియుద్దీన్ సహా అతనికి సహకరించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐఈఎస్‌లో మెరిసిన తెలంగాణ 'భాను'డు

### తొలి ప్రయత్నంలోనే ఆల్ ఇండియా స్థాయిలో 11వ ర్యాంక్

**రాయికల్:** ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్)లో ఆల్ ఇండియా స్థాయిలో 11వ ర్యాంక్ సాధించి భానుప్రకాశ్ తెలంగాణ సత్తా చాటారు. జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన ఎల్‌ఐసీ ఉద్యోగి మామిడాల సత్యనారాయణ, విజయకు ముగ్గురు కుమారుల్లో భాను రెండోవారు. టెన్త్ వరకు రాయికల్‌లోని వివేకవర్ధిని హైస్కూల్‌లోనే చదివి 9.8 జీపీఏ సాధించారు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్‌లో 977 మార్కులు సాధించారు. ఇంజినీరింగ్‌పై ఉన్న మక్కువతో జేఈఈలో ర్యాంకు సాధించి నాగ్‌పూర్‌లోని ఎన్‌ఐటీ నుంచి మెకానికల్ బ్రాంచ్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. ఐఈఎస్ సాధించేందుకు ఢిల్లీలో శిక్షణ పొంది, 2019 జనవరిలో ఐఈఎస్ ప్రిలిమినరీ పరీక్ష రాసి మెయిన్స్‌కు అర్హత సాధించారు. జూన్ 30న మెయిన్స్ పరీక్షను సైతం విజయవంతంగా ముగించి ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 20న ఇంటర్వ్యూను దాటి ఫలితాల్లో భానుప్రకాశ్ ఆల్ ఇండియా 11వ ర్యాంకు సాధించారు.

### చిన్ననాటి కల నెరవేరింది



**ఐఈఎస్** సాధించాలనే చిన్ననాటి కల నెరవేరింది. పట్టుదలతో అడుగులు వేసి తొలి ప్రయత్నంలోనే ఐఈఎస్‌లో 11వ ర్యాంక్ సాధించి కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉన్నతస్థాయి ఉద్యోగం సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. అనుకున్న లక్ష్యాన్ని సాధించడంతో జీవితంలో అనిర్వచనీయ అనుభూతి కలిగింది. అమ్మానాన్నల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. మా ఇంట్లో దీపావళి పండుగ ఒకరోజు ముందే వచ్చినట్టయింది.

–భానుప్రకాశ్



## ఓవరాల్ చాంప్ కరీంనగర్

**నిర్మల్ అర్బన్, నమస్తే తెలంగాణ:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 (35 కేజీలు), అండర్-17 (48 కేజీలు) రెజ్లింగ్ పోటీల్లో కరీంనగర్ రెజ్లర్లు ఓవరాల్ చాంపియన్‌లుగా నిలిచి సత్తాచాటారు. అండర్-19 (55 కేజీలు) విభాగంలో హైదారాబాద్ అగ్రస్థానం దక్కించుకుంది. జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలను ఎస్పీ శశిధర్ రాజు ప్రారంభించారు. విజేతలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

# కచ్చితంగా కుట్ర జరిగింది

### బీసీబీ అధ్యక్షుడు నజ్ముల్

**ఢాకా:** భారత పర్యటనకు వెళ్లకుండా బంగ్లాదేశ్‌ను అడ్డుకునేందుకు కొందరు కుట్రలు చేశారని, ఆటగాళ్ల సమ్మె కూడా అందులో భాగమేనని బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) అధ్యక్షుడు నజ్ముల్ హసన్ ఆరోపించాడు. తమ డిమాండ్లను నెరవేరుస్తామని బోర్డు హామీ ఇవ్వడంతో బంగ్లా ఆటగాళ్లు ఇటీవలే సమ్మె విరమించిన సంగతి తెలిసిందే. అయితే ఈ అంశంపై బీసీబీ మాత్రం సీరియస్‌గానే ఉంది. మూడు టీ20లు, రెండు టెస్టులు ఆడేందుకు బంగ్లా వచ్చే నెలలో భారత్ రానుంది.

**షకీబ్‌పై చట్టబద్ధ చర్యల్లేవ్**

జట్టు అధికారిక స్పాన్సర్‌గా ఉన్న టెలికం సంస్థ రోబీకి ప్రత్యక్ష పోటీదారుగా ఉన్న గ్రామీన్‌ఫోన్ కంపెనీతో ప్రచారకర్తగా ఒప్పందం కుదుర్చుకున్న బంగ్లా కెప్టెన్ షకీబల్ హసన్‌పై లీగల్ చర్యలు కాకుండా నోటీసులు జారీ చేసి వివరణ అడగాలని భావిస్తున్నట్టు బీసీబీ సీఈవో నిజాముద్దీన్ సోమవారం వెల్లడించాడు.

# విజేత మహబూబ్‌నగర్

### ఎస్జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ టోర్నీ



మహబూబ్‌నగర్ జట్టుతో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ :** రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ బాలికల జట్టు విజేతగా నిలిచింది. సోమవారం స్థానిక స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టును మట్టికరపించిన మహబూబ్‌నగర్ బాలికల జట్టు చాంపియన్‌గా అవతరించింది. బాలుర విభాగంలో హైదరాబాద్ జట్టు 74-58తో రంగారెడ్డిని ఓడించి విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో హైదరాబాద్ జట్టు మూడో స్థానంలో నిలువగా.. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది. పోటీల అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో సత్యవాణి, ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి పాపిరెడ్డి, రాష్ట్ర పరిశీలకులు గోవర్ధన్ రెడ్డి, పీడీ సురేశ్, కోచ్‌లు పాల్గొన్నారు.

# రజతమే బంగారమాయే..

### ఫైనల్లో ఇండోనేషియా జంట చేతిలో ఓడిన సాత్విక్-చిరాగ్ జోడీ

### ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో దిగ్గజాలు వెనుదిరిగిన చోట.. ఆశలు లేని స్థితిలో భారత పురుషుల డబుల్స్ జోడీ అదరగొట్టింది. బీడబ్ల్యూఎఫ్ సూపర్-750 టోర్నీలో రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం రజత పతకం చేజిక్కించుకుంది. పురుషుల డబుల్స్ తుదిపోరులో సాత్విక్-చిరాగ్ జంట 18-21, 16-21తో టాప్ సీడ్ మార్కస్ ఫెర్నాల్డి-కెవిన్ సంజయ (ఇండోనేషియా) జోడీ చేతిలో ఓటమి పాలైంది. అసాధారణ ఆటతీరుతో వరుస విజయాలు సాధించుకుంటూ ఫైనల్ చేరిన భారత ద్వయం తుదిమెట్టుపై తడబడింది. ఇటీవల థాయ్‌లాండ్ ఓపెన్ ద్వారా తొలి సూపర్-500 టైటిల్ నెగ్గిన భారత ద్వయం ఇక్కడ మాత్రం ఆ పట్టుదల కనబర్చలేకపోయింది. పార్థో గంగూలీ-విక్రమ్ సింగ్ (1983) జంట తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ చేరిన సాత్విక్ ద్వయం టైటిల్‌ను ఒడిసి పట్టలేకపోయింది. 36 ఏండ్ల క్రితం గంగూలీ-విక్రమ్ జోడీ డబుల్స్ విభాగంలో టైటిల్ నెగ్గగా.. అప్పటి నుంచి మరే భారత జంట ఆ ఘనత సాధించలేకపోయింది. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్ (2017) ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలువగా.. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ (2012) ఫైనల్ చేరింది.

**పోరాడినా..**

35 నిమిషాల్లో ముగిసిన ఫైనల్లో సాత్విక్ జోడీ తడబాటుకు గురైంది. ప్రపంచ నంబర్ వన్ ద్వయం ముందు మనవాళ్లు నిలువలేకపోయారు. తొలి గేమ్ ఆరంభంలోనే ప్రత్యర్థికి భారీ ఆధిక్యం సమర్పించుకున్నారు. భారత జంట ఖాతా తెరువకముందే ఇండోనేషియా జోడీ 6 పాయింట్లు సాధించడంతో పాయింట్ల అంతరం తగ్గించడం కష్టమైపోయింది. అయినా వెనక్కి తగ్గని భారత జోడీ ఒక దశలో ప్రత్యర్థికి గట్టి పోటీనిచ్చుకుంటూ 17-17తో స్కోరు సమం చేసింది. ఈ దశలో ఇండోనేషియన్లు మూడు గేమ్ పాయింట్లు సాధించగా.. మనవాళ్లు ఒకటి నెగ్గి మరోటి కోల్పోవడంతో తొలి గేమ్ ప్రత్యర్థి వశమైంది. రెండో గేమ్ ఆరంభం నుంచి సాత్విక్ జోడీ దూకుడుగా ఆడింది. దీంతో 6-6, 10-10, 12-12తో పలుమార్లు స్కోర్లు సమమయ్యాయి. ఈ దశలో చెలరేగి ఆడిన ఇండోనేషియా జోడీ వరుసగా 6 పాయింట్లు సాధించగా.. సాత్విక్ జంట కేవలం ఒక్క పాయింట్ మాత్రమే ఖాతాలో వేసుకుంది. అదే జోరులో ఇండోనేషియా జోడీ గేమ్‌తో పాటు మ్యాచ్‌ను ముగించింది. ఇప్పటి వరకు మార్కస్ ఫెర్నాల్డి-కెవిన్ సంజయ ద్వయంతో సాత్విక్-చిరాగ్ జంట ఏడుసార్లు తలపడగా.. ఏడింట ఓటమే ఎదురైంది. ఫైనల్లో ఓడినప్పటికీ ఈ టోర్నీలో సాత్విక్ జోడీ అపూర్వ విజయాలు సాధించింది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 11వ స్థానంలో ఉన్న సాయిరాజ్ జంట తుదిపోరులో నంబర్‌వన్ జోడీని భయపెట్టడమే కాక.. ఫైనల్ చేరే క్రమంలో ప్రపంచ చాంపియన్స్ మహమ్మద్ అనస్-హెంద్రా సతివాన్, ప్రపంచ 8వ ర్యాంక్ కిమ్ స్టప్-అండ్రెస్ స్కార్పు, ప్రపంచ 6వ ర్యాంక్ హిరోయుకి ఎండో-యుటా వటనబేను ఓడించి ఆకట్టుకుంది.





'ఇరువురి ఆట దాదాపు సమానంగానే సాగింది. కానీ మేం ఎక్కువ తప్పులు చేశాం. తొలి గేమ్ మేము గెలిచి ఉంటే పరిస్థితులు వేరేలా ఉండేవి. తుదిపోరులో రెండు గేమ్‌లను కూడా మేము నెమ్మదిగా ప్రారంభించాం. ఆరంభంలో వాళ్లు వరుసగా పాయింట్లు సాధించినా ఎలాంటి తడబాటు లేకుండా 17-17తో స్కోరు సమం చేశాం. షాట్ సెలక్షన్ ఇంకాస్త మెరుగ్గా ఉంటే గెలిచేవాళ్లం. ఈ వారం మా ఆటతీరు పట్ల సంతోషంగా ఉన్నాం. ఇది మా కెరీర్‌లో రెండో ఉత్తమ ప్రదర్శన'

**-చిరాగ్ శెట్టి**

**మారిన్‌కు షాక్**

మూడుసార్లు ప్రపంచ చాంపియన్ కరోలినా మారిన్‌కు ఊహించని ఓటమి ఎదురైంది. మహిళల సింగిల్స్ ఫైనల్లో మారిన్ 17 ఏండ్ల కొరియా అమ్మాయి చేతిలో పరాజయం పాలైంది. తుదిపోరులో ఆన్ సె యంగ్ 16-21, 21-18, 21-5తో మారిన్ (స్పెయిన్)ను చిత్తు చేసి విజేతగా నిలిచింది. పురుషుల సింగిల్స్ విభాగంలో చెన్ లాంగ్ (చైనా) 21-19, 21-12తో జొనాథన్ క్రిస్టి (ఇండోనేషియా)పై నెగ్గి టైటిల్ సాధించాడు.



దీపావళి పర్వదినం సందర్భంగా ఆదివారం టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ సతీమణి అనుష్క శర్మతో కలిసి ఫొటోలకు ఫోజిచ్చాడిలా..

## ద్రవిడ్‌తో భేటీ కానున్న దాదా

### భారత క్రికెట్ రోడ్‌మ్యాప్‌పై చర్చలు





**న్యూఢిల్లీ:** ఆటగాళ్లుగా అపూర్వ భాగస్వామ్యాలతో టీమ్‌ఇండియాకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన సహచరులు, మిత్రులైన బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) చీఫ్ రాహుల్ ద్రవిడ్ సమావేశం కానున్నారు. భారత క్రికెట్ భవిష్యత్తు కోసం రోడ్‌మ్యాప్‌ను రూపొందించే ప్రక్రియలో భాగంగా దాదా బుధవారం బెంగళూరులో ద్రవిడ్‌తో చర్చించనున్నాడు. ఈ ఏడాది జూలైలో ఎన్‌సీఏ బాధ్యతలను చేపట్టిన ది వాల్.. ఓ ప్రణాళిక ప్రకారం ముందుకెళుతున్నాడు. రోడ్‌మ్యాప్ కోసం ఈ సమావేశంలో ద్రవిడ్ చెప్పే సూచనలు, సలహాలను దాదా స్వీకరించనున్నట్లు సమాచారం. ఈ నెల 23న బాధ్యతలు చేపట్టిన బీసీసీఐ ఆఫీస్ బేరర్లతో పాటు ఎన్‌సీఏ సీఈవో తుఫన్ ఘోష్ కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నాడు. టీమ్ ఇండియాకు ప్రతిభావంతులను అందించాల్సిన ఎన్‌సీఏ.. కొన్నేండ్లుగా గాయపడిన ఆటగాళ్లకు పునరావాస కేంద్రంగా మారింది. ఈ పరిస్థితిని మార్చేందుకు ద్రవిడ్ ఇప్పటికే శ్రమిస్తుండగా.. దాదా సైతం ఎన్‌సీఏపై ప్రత్యేక దృష్టి సారించనున్నాడు. ఎన్‌సీఏ అభివృద్ధి దిశగా కొత్త ప్రాజెక్టును చేపట్టే అంశం కూడా మాజీ కెప్టెన్ల భేటీలో రానుందని బీసీసీఐకి చెందిన ఓ సీనియర్ అధికారి చెప్పారు.

## డే అండ్ నైట్ టెస్టు నిర్వహిద్దాం

### బీసీబీకి దాదా విజ్ఞప్తి

**న్యూఢిల్లీ/ఢాకా:** భారత్-బంగ్లాదేశ్ మధ్య వచ్చే నెల 22-26వ తేదీ మధ్య కోల్‌కతాలో జరగాల్సిన రెండో టెస్టును డే అండ్ నైట్‌గా నిర్వహిద్దామని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు విజ్ఞప్తి చేశాడు. ఇదే జరిగితే ఇరు దేశాలకు ఇదే తొలి పింక్ బాల్ మ్యాచ్ అవుతుంది. తన విన్నపాన్ని బీసీబీ అంగీకరిస్తుందని గంగూలీ ఆశాభావం వ్యక్తం చేశాడు.



దీనిపై సీనియర్ ఆటగాళ్లతో చర్చించాక.. బీసీబీ నిర్ణయం తీసుకోనుంది. డై అండ్ నైట్ టెస్టు నిర్వహించాలన్న ఆలోచన మంచిదే కానీ, గులాబీ బంతితో ఆటగాళ్లకు సరైన సన్నాహాలు లేకపోవడం, ప్రాక్టీస్‌కు సమయం తక్కువ ఉండడం వంటి కొన్ని సమస్యలు ఉన్నాయని బీసీబీ క్రికెట్ ఆపరేషన్స్ హెడ్ అక్రమ్ ఖాన్ చెప్పాడు. బీసీబీ నిర్ణయం తీసుకున్న వెంటనే డే అండ్ నైట్ టెస్టు నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేసేందుకు బీసీసీఐ సంసిద్ధంగా ఉంది.

## కాలుష్య ప్రభావం ఉండదు

### టీ20 మ్యాచ్‌పై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** భారత్-బంగ్లాదేశ్ మధ్య ఢిల్లీ వేదికగా నవంబర్ 3న జరిగే తొలి టీ20 మ్యాచ్‌పై వాయు కాలుష్య ప్రభావం ఉండకపోవచ్చని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. నగరంలో వాయు నాణ్యతను మెరుగుపరిచేందుకు తమ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నదని సెక్రటేరియట్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన చెప్పారు. 'క్రికెట్‌కు కాలుష్యం ఇబ్బంది కాబోదనే ఆశిస్తున్నా.ఈ సీజన్‌లో ఆడిన ముందటి మ్యాచ్‌లన్నీ బాగా జరిగాయి. తర్వాతి మ్యాచ్ కూడా సజావుగా సాగుతుంది. మ్యాచ్‌కు ఇంకా వారం రోజుల సమయం ఉంది. అప్పటికల్లా సాధారణ స్థితి ఏర్పడుతుంది' అని అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. 2017 డిసెంబర్‌లో ఇక్కడే టీమ్ ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక ఆటగాళ్లు ఎక్కువ మంది వాయు కాలుష్యం వల్ల మాస్కులు ధరించి ఆడారు.

## ప్రిక్వార్టర్స్‌లో జోష్న

**కైరో:** భారత స్టార్ స్క్వాష్ ప్లేయర్ జోష్నా చినప్ప మహిళల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ప్రిక్వార్టర్స్‌కు చేరింది. సీఐబీ పీఎస్‌ఏ టోర్నీలో ప్రపంచ 12వ ర్యాంకర్ జోష్న రెండో రౌండ్‌లో 11-5, 11-4తో ఆధిక్యంలో ఉన్న సమయంలో ప్రత్యర్థి జీ లోక్ గాయం కారణంగా పోటీ నుంచి తప్పుకోవడంతో చినప్పను విజేతగా ప్రకటించారు. ప్రిక్వార్టర్స్‌లో జోష్నా రెండో సీడ్, ఈజిప్టుకు చెందిన నూర్ షెర్బినితో తలపడనుంది.





## మెక్సికో విజేత హామిల్టన్

**మెక్సికో సిటీ:** బ్రిటీష్ స్టార్ రేసర్ లూయిస్ హామిల్టన్ మెక్సికన్ గ్రాండ్‌ప్రిలో మరోసారి సత్తాచాటాడు. ఆదివారం ఇక్కడ జరిగిన రేస్ ఆసాంతం ఎలాంటి అవాంతరాలు లేకుండా దూసుకెళ్లి అగ్రస్థానంలో నిలిచి.. మెర్సెడెస్ జట్టుకు ఈ సీజన్‌లో పదో విజయాన్ని అందించాడు. ఫెరారీ రేసర్ సెబాస్టియన్ వెటెల్ రెండో స్థానంతో రేస్‌ను ముగించగా... హామిల్టన్ జట్టుకు చెందిన వాల్తెరి బొటాస్ మూడో స్థానంలో నిలిచాడు. రేస్ మొదలైన కాసేపటికే పిట్‌స్టాప్‌కు గురైన ఫెరారీకే చెందిన మరో డ్రైవర్ చార్లెస్ లెక్లెర్క్ నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు. హామిల్టన్‌కు ఇది మెక్సికోలో రెండో గెలుపు కాగా ఓవరాల్‌గా కెరీర్‌లో 83వది. వచ్చే వారం టెక్సాస్‌లో జరిగే యూఎస్ గ్రాండ్‌ప్రి ద్వారా ఆరోసారి డ్రైవర్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను హామిల్టన్ దక్కించుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మెక్సికో విజయంతో తన ఖాతాలో మరో 25 పాయింట్లు వేసుకున్న లూయిస్... ఈ ఏడాది ఇప్పటి వరకు మొత్తంగా 363 పాయింట్లు సాధించి టాప్‌లో కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న బొటాస్ (289) 74 పాయింట్లు వెనుకంజలో ఉన్నాడు.

# వార్నర్ 100.. లంక 99

**అడిలైడ్:** ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన యాషెస్ సిరీస్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన ఆస్ట్రేలియా విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ (56 బంతుల్లో 100 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్సర్లు) తన పుట్టిన రోజు నాడు.. శ్రీలంకపై అజేయ సెంచరీతో విరుచుకుపడ్డాడు. తద్వారా టెస్టు, వన్డే, టీ20ల్లో మూడంకెల స్కోరు చేసిన మూడో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. గతంలో వాట్సన్, మ్యాక్స్‌వెల్ ఈ ఫీట్ సాధించారు. వార్నర్ మెరుపులతో ఆదివారం లంకతో జరిగిన తొలి టీ20లో ఆసీస్ 134 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. పొట్టి ఫార్మాట్‌లో కంగారూలకు పరుగుల పరంగా ఇదే అతి పెద్ద విజయం కాగా.. లంకేయులకు ఇదే భారీ ఓటమి. సిరీస్‌కు ముందు జరిగిన ప్రెసిడెంట్స్ ఎలెవన్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆ దేశ ప్రధాని స్కాట్ మారిసన్ వాటర్ బాయ్ అవతారమెత్తి తమ ఆటగాళ్లలో స్ఫూర్తి నింపగా.. దాన్ని పునికిపుచుకున్న ఆస్ట్రేలియన్లు చెలరేగిపోయారు. వార్నర్‌తో పాటు కెప్టెన్ ఫించ్ (64; 8 ఫోర్లు, 3 సిక్సర్లు), మ్యాక్స్‌వెల్ (62; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకాలతో మెరువడంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో జంపా (3/14), స్టార్క్ (2/18), కమిన్స్ (2/27) ధాటికి లంక నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 99 పరుగులకే పరిమితమైంది.

**స్టార్క్ దూరం..**

తొలి మ్యాచ్‌లో రెండు వికెట్లు పడగొట్టిన ఆసీస్ స్పీడ్‌స్టర్ మిషెల్ స్టార్క్ లంకతో జరుగనున్న తదుపరి మ్యాచ్‌కు దూరం కానున్నాడు. సోదరుడి వివాహానికి హాజరయ్యేందుకు అతడు టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి అనుమతి పొందినట్లు సమాచారం.



వార్నర్ (100*)

## బెంగళూరు - గోవా మ్యాచ్ డ్రా

**మార్గావ్ (గోవా):** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఆరో సీజన్‌లో ఎదురుపడిన తొలి మ్యాచ్‌ను బెంగళూరు ఎఫ్‌సీ-గోవా జట్లు 'డ్రా'గా ముగించాయి. సోమవారం ఇక్కడి జవహర్ లాల్ నెహ్రూ మైదానంలో ఇరు జట్ల మధ్య తుదివరకు నాటకీయంగా సాగిన మ్యాచ్ చివరికి 1-1తో సమమైంది. తొలి నుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడడంతో గోల్ నమోదు కాలేదు. తొలి అర్ధభాగం 0-0గా ముగియగా.. రెండో అర్ధభాగం 62వ నిమిషంలో మానుయేల్ అందించిన బంతిని ఉదాంత సింగ్ గోల్‌గా మలచడంతో బెంగళూరు 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత పూర్తి సమయం ముగిసినా గోల్ చేయలేకపోయిన గోవాకు ఇంజూరీ టైమ్ రూపంలో అదృష్టం కలిసొచ్చింది. గోవా ప్లేయర్ కొరో మినాస్ అద్భుత షాట్‌తో గోల్ చేయడంతో చివరకు మ్యాచ్ డ్రాగా ముగిసింది.

# ఫెదరర్‌కు పదో బాసెల్ టైటిల్



**బాసెల్ (స్విట్జర్లాండ్):** టెన్నిస్ దిగ్గజం, ప్రపంచ మూడో ర్యాంకర్ రోజర్ ఫెదరర్ సొంత గడ్డపై మరోసారి అదరగొట్టాడు. ఆదివారం ఇక్కడ జరిగిన స్విస్ ఇండోర్ బాసెల్ ఫైనల్లో 6-2, 6-2తో అలెక్స్ డిమినౌర్ (ఆస్ట్రేలియా)ను మట్టికరిపించి, కెరీర్‌లో పదోసారి బాసెల్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. పురుషుల సింగిల్స్‌లో రోజర్‌కు ఇది 103వ ఏటీపీ టైటిల్ కాగా.. ఆల్‌టైం అత్యధిక ఏటీపీ టైటిళ్లు సాధించిన అమెరికా ప్లేయర్ జిమ్మీ కానర్స్ (109)కు ఆరు అడుగుల దూరంలో నిలిచాడు. తన సొంతఊరైన బాసెల్‌లో ఫెదరర్ దాదాపు 20 ఏండ్ల కిందట బాల్‌బాయ్‌గా సేవలందించాడు. పాత జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్న రోజర్.. టైటిల్ అందుకున్నాక భావోద్వేగంగా ప్రసంగించాడు. 'నేను ఈ టైటిల్‌ను ఒక్కసారైనా గెలుస్తానని అప్పట్లో ఊహించలేదు. 10 టైటిళ్లు సాధించానంటే నమ్మలేకపోతున్నా. నాకు ఇది ఓ అద్భుతమైన వారం' అని ఫెదరర్ చెప్పాడు. పురుషుల సింగిల్స్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (20) సాధించిన రికార్డు కూడా ఫెదరర్ పేరిటే ఉంది.

**పారిస్ మాస్టర్స్‌కు దూరం**

పారిస్ మాస్టర్స్ ఏటీపీ టోర్నీ నుంచి రోజర్ ఫెదరర్ తప్పుకున్నాడు. ఎడతెరిపి లేకుండా టోర్నీలు ఆడుతున్న అతడు... విశ్రాంతి కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించాడు. తన ఫిట్‌నెస్ బాగానే ఉందని, టోర్నీకి దూరమైనందుకు ఫ్రెంచ్‌లో ఉన్న తన అభిమానులకు రోజర్ ముందస్తుగా క్షమాపణలు తెలిపాడు.

## టాప్‌లోనే జొకోవిచ్

### టాప్-10లోకి బ్రెటినీ



బ్రెటినీ

**పారిస్ :** సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ (9,545) ఏటీపీ ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని నెలబెట్టుకున్నాడు. సోమవారం తాజా ర్యాంకింగ్స్ వెలువడగా.. జొకో తర్వాతి స్థానాల్లో స్పెయిన్ స్టార్ రఫేల్ నాదల్ (9,225), స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ (6,950) ఉన్నారు. ఇటలీ యువ ఆటగాడు మాటియో బ్రెటినీ (2,575) తొలిసారి టాప్-10లోకి ప్రవేశించాడు. ఈ ఏడాదికి ముందు 53వ ర్యాంకులో ఉన్న బ్రెటినీ.. బుడాపెస్ట్, స్టట్‌గార్ట్ ఏటీపీ టైటిళ్లను గెలువడంతో పాటు యూఎస్ ఓపెన్ సెమీఫైనల్‌కు చేరుకోవడం ద్వారా టాప్-10లోకి దూసుకొచ్చి 9వ స్థానంలో స్థిరపడ్డాడు. అయితే యూఎస్ ఓపెన్‌లో గాయం కారణంగా మోచేతికి శస్త్ర చికిత్స చేయించుకున్న కీ నిషికోరీ (జపాన్) 8 నుంచి 11వ ర్యాంకుకు పడిపోయాడు. 52వారాలకోసారి పాయింట్స్ రోలింగ్ సిస్టమ్ ఉన్న కారణంగా వచ్చే వారం జొకో రెండో స్థానానికి పడిపోయి.. నాదల్ టాప్ ర్యాంకుకు చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతేడాది జరిగిన ఏటీపీ ఫైనల్స్‌లో పొందిన పాయింట్లు జొకో ఖాతా నుంచి వచ్చే వారం కనుమరుగవుతాయి. దీంతో స్పెయిన్ బుల్ రఫా టాప్‌కు చేరే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

## పొట్టి ప్రపంచకప్‌లో కొత్త జట్టు

### తొలిసారి ఐసీసీ ఈవెంట్‌లో పాల్గొననున్న పపువా న్యూ గినియా



**దుబాయ్:** దశాబ్ద కాలంగా ఆటలో కొనసాగుతున్నా ఇప్పటివరకు ఒక్క ఐసీసీ టోర్నీకి కూడా అర్హత సాధించలేకపోయిన పపువా న్యూ గినియా (పీఎన్‌జీ) ఎట్టకేలకు టీ20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది. పొట్టి ప్రపంచకప్‌నకు ముందు నిర్వహించిన క్వాలిఫయింగ్ టోర్నీలో చక్కటి ప్రదర్శన కనబర్చడం ద్వారా వచ్చే ఏడాది ఆస్ట్రేలియా వేదికగా జరిగే మెగాటోర్నీలో అడుగుపెట్టింది. పీఎన్‌జీతో పాటు ఐర్లాండ్ కూడా వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ టోర్నీ గ్రూప్-ఏలో భాగంగా ఆరు మ్యాచ్‌లాడి ఐదింట నెగ్గిన పపువా న్యూ గినియా ఆదివారం కెన్యాతో జరిగిన చివరి మ్యాచ్‌లో 19.3 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో కెన్యా 73 రన్స్‌కే ఆలౌటవడంతో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. అయినప్పటికీ ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 12.3 ఓవర్లలో నెదర్లాండ్స్ లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉండగా.. అది సాధ్యపడకపోవడంతో పపువా న్యూ గినియా నేరుగా ప్రపంచకప్‌లో అడుగుపెట్టింది.

## అమెజాన్ నష్టం రూ.5,685 కోట్లు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** ఆన్‌లైన్ మార్కెట్లో అగ్రస్థాయిలో దూసుకుపోతున్న అమెజాన్‌కు నష్టాల బెడద తప్పడం లేదు. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీ రూ. 5,685 కోట్ల నష్టం వచ్చినట్లు ప్రకటించింది. అంత క్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.6,287.90 కోట్లతో పోలిస్తే 9.5 శాతం తక్కువ ఇది. బిజినెస్ ఇంటె లిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. లాభాల్లో ఎదురుదెబ్బ తగిలిన సంస్థకు ఆదాయంలో మాత్రం కాస్త ఊరట లభించింది. 2018-19 ఏడాదికిగాను సంస్థ ఆదాయం 55 శాతం ఎగిసి రూ.7,778 కోట్లుగా నమోదైంది. ఇతర సంస్థలను కలుపుకుంటే గతేడాది సంస్థ రూ.7 వేల కోట్ల నష్టాన్ని ప్రకటించింది. అమెరికాకు చెందిన ఈ-కామర్స్ దిగ్గజం బీ2బీ సేవలు అందిస్తున్న అమెజాన్ హోల్‌సేల్ ఇండియా ఆదాయం మాత్రం ఏడాది ప్రాతిపదికన 8 శాతం పెరిగి రూ.11,250 కోట్లుగా నమోదైంది. అమెజాన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసుల విభాగ ఆదాయం 31 శాతం అధికమై రూ.2,079 కోట్లుగా ఉన్నది. మరోవైపు ఈ ఆర్థిక ఫలితాలపై కంపెనీ వర్గాలు వెల్లడించడానికి నిరాకరించాయి.



# పసిడి @ 42,000!

### డిసెంబర్ నాటికి చేరుకోనుందంటున్న విశ్లేషకులు

**ముంబై, అక్టోబర్ 28:** బంగారం ధరలు కొండెక్కనున్నాయా! ఇప్పటికే రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న అతి విలువైన లోహాల ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పతనమవడం, స్టాక్ మార్కెట్లు అంతంత స్థాయిలో రిటర్నులు పంచడంతో పెట్టుబడిదారులు సురక్షితమైన బంగారంపై భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టడంతో ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. వీటికి తోడు పలు దేశాల్లో రాజకీయ అనిశ్చిత పరిస్థితి నెలకొనడం, సెంట్రల్ బ్యాంకులు అత్యధికంగా కొనుగోళ్లు జరుపడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మరింత బలహీనపడటంతో బంగారం మరింత మిలమిలమెరువబోతున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ప్రస్తుతం రూ.40 వేల స్థాయిలో కదలాడుతున్న పసిడి ధరలు మరో రెండు నెలలు అంటే ఈ ఏడాది చివరినాటికి రూ.42 వేల మార్క్‌కు చేరుకోనున్నాయంటున్నారు. మధ్యతూర్పు దేశాల్లో రాజకీయ అనిశ్చితి కొనసాగుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,650 డాలర్లకు, అలాగే ఎంసీఎక్స్‌లో రూ.42 వేలకు చేరుకోనున్నదని కామ్‌ట్రెండ్స్ రీసర్చ్ కో-ఫౌండర్, సీఈవో త్యాగరాజన్ తెలిపారు. ఈ ఏడాది చివరినాటికి ధరల జోరు కొనసాగనున్నదన్న ఆయన ..సెంట్రల్ బ్యాంక్ భారీ స్థాయిలో పసిడిని కొనుగోలు చేయడం, తీవ్ర ఒత్తిడిలో కొనసాగుతున్న ఈక్విటీ మార్కెట్లతో మదుపరులు సురక్షితమైన బంగారం వైపు మళ్ళడం కూడా ధరలు మరింత పుంజుకోవడానికి ప్రధాన కారణమని ఆయన విశ్లేశించారు. ప్రస్తుతం ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.38,302 కాగా, కామెక్స్‌లో 1,506 డాలర్లుగా ఉన్నది. ఈ ఏడాది పసిడి గరిష్ఠ స్థాయిలో రిటర్నులు పంచిందని, ముఖ్యంగా ఇప్పటి వరకు ధరలు 15 శాతం వరకు పెరిగాయని, రూపాయి విలువ 1.4 శాతం పతనమవడం ధరలు పెరుగడానికి ప్రధాన కారణమని మోతిలాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ నవ్‌నీత్ దామాని తెలిపారు.

**సామాన్యుడికి అందనంత ఎత్తులో..**

గరిష్ఠ స్థాయికి చేరుకున్న ధరలతో సామాన్యుడికి అందనంత దూరంలోకి పసిడి చేరుకున్నది. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.39,840 స్థాయిలో కదలాడుతున్నది. ఈక్విటీ మార్కెట్ల కంటే బంగారం, భూములపై పెట్టుబడులు పెట్టిన వారికి రిటర్నులు అధికంగా లభిస్తుండటంతో గతేడాదికాలంగా వీటివైపు మొగ్గుచూపేవారి సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ధరలు పెరుగడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఆశావాదంగా కదలాడుతున్న ధరలు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉన్నదని, అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు ఇప్పట్లో కొలిక్కి వచ్చే అవకాశాలు లేకపోవడం, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాలకు ఆర్థిక మాంద్యం దెబ్బ తగులబోతున్నదన్న సంకేతాలతో పలు సెంట్రల్ బ్యాంకులు ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా కొనుగోళ్లు జరుపడంతో రికార్డు స్థాయికి ఎగబాకే అవకాశాలు మెండుగావున్నాయన్నారు. కొటక్ సెక్యూరిటీ హెడ్ రవీంద్ర రావు మాత్రం గ్లోబల్ మార్కెట్లో గోల్డ్ ధర 1,460.1,530 డాలర్ల మధ్యలో ఉండనుండగా, రూపాయిల్లో మాత్రం రూ. 36,800 నుంచి రూ.39,400 మధ్యలో కొనసాగనున్నదన్నారు. స్పాట్ గోల్డ్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్‌కు 1,458 డాలర్ల వద్ద మద్దతు లభించవచ్చునని అంచనా.



### పండుగ అమ్మకాల్లేవ్..

**దీపావళి** పండుగ వ్యాపారుల్లో వెలుగులను నింపలేకపోయింది. ఈసారి అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని సోమవారం విడుదలైన వరల్డ్‌లైన్ నివేదిక ఒకటి చెబుతున్నది. పండుగ అంటేనే.. ఆభరణాలు, దుస్తులు. అయితే ఈ రెండింటి విక్రయాలు ఈ సీజన్‌లో చాలా తక్కువగా జరిగాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల కొనుగోళ్ల సామర్థ్యం పెరుగాలని చేస్తున్న ప్రయత్నాలు అంతగా ప్రభావం చూపట్లేదని తేలిపోయింది. ధనత్రయోదశి, దీపావళి సగటు అమ్మకాల పరిమాణంతో పోల్చితే 66 శాతం దిగజారి నగల విభాగంలో రూ. 3,625గా నమోదైందని వరల్డ్‌లైన్ స్పష్టం చేసింది. దుస్తుల అమ్మకాల్లో 28 శాతం పడిపోయి రూ.1,746గా ఉన్నది. కాగా, సరుకులు, రెస్టారెంట్ల విభాగాల్లో వరుసగా 11 శాతం, 32 శాతం వృద్ధి కనిపించింది.

### బీపీసీఎల్ డీల్‌లో

# గోల్‌మాల్?

- మొజాంబిక్ గ్యాస్ బ్లాక్ వాటా కొనుగోలుపై అనుమానాలు
- తదుపరి పెట్టుబడులకు రాని అనుమతి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్).. మొజాంబిక్ గ్యాస్ బ్లాక్ డీల్‌లో అవకతవకలు జరిగాయా?.. ఇక్కడ బీపీసీఎల్ పెట్టిన పెట్టుబడులపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది మరి. ఆ బ్లాక్‌లో బీపీసీఎల్ మరిన్ని పెట్టుబడులపై నిర్ణయాన్నీ నిలుపుదల చేసింది. బీపీసీఎల్ చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పాదక అనుబంధ సంస్థ భారత్ పెట్రోరిసోర్సెస్ లిమిటెడ్ (బీపీఆర్ఎల్).. అమెరికా చమురు దిగ్గజం అనడార్కో పెట్రోలియం కార్ప్ నుంచి రొవుమా బ్లాక్‌లోని ఏరియా-1లో 10 శాతం వాటాను 2008 ఆగస్టులో కొనుగోలు చేసింది. 75 మిలియన్ డాలర్లతో దక్కించుకున్నది. ఇదే నెలలో వీడియోకాన్.. తమ అనుబంధ సంస్థ ద్వారా ఇదే బ్లాక్‌లో 10 శాతం వాటాను సొంతం చేసుకున్నది. అయితే నిజానికి బీపీసీఎల్‌కు మొత్తం 20 శాతం వాటా కొనుగోలు ఆఫర్ వచ్చిందని, అయినప్పటికీ సగానికే పరిమితమైందని సమాచారం. ఆ మిగతా సగాన్నే వీడియోకాన్ చేజిక్కించుకున్నది.

**ఓఎన్జీసీ విదేశ్ లిమిటెడ్‌కు అమ్మకం**

2013లో వీడియోకాన్ తమ వాటాను ఓఎన్జీసీ విదేశ్ లిమిటెడ్ (ఓవీఎల్)కు అమ్మేసింది. 2.475 బిలియన్ డాలర్లతో ఓవీఎల్ కొనుగోలు చేయడం గమనార్హం. ప్రభుత్వ రంగ చమురు, సహజ వాయువు అన్వేషణ, ఉత్పత్తి దిగ్గజం ఓఎన్జీసీ అనుబంధ సంస్థే ఓవీఎల్ అన్న విషయం తెలిసిందే. అయితే బీపీసీఎల్ ఎందుకు మొత్తం 20 శాతం వాటాను కొనుగోలు చేయలేదు?.. ఓఎన్జీసీ వంటి ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు ఎందుకు ముందుకు రాలేదు?.. విభజన సమస్యలు ఏవైనా వస్తాయా? అని బీపీసీఎల్ భావించిందా?.. వంటి వాటిపై మోదీ సర్కారు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఇక్కడ 2.2-2.4 బిలియన్ డాలర్ల తదుపరి బీపీసీఎల్ పెట్టుబడులపై ఇంకా కేంద్రం నిర్ణయం తీసుకోలేదని తెలుస్తున్నది. ఈ మొత్తం వ్యవహారంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలోని మంత్రుల బృందం సమీక్ష చేస్తున్నది.

### ఎన్నెన్నో అనుమానాలు..

**బీజేపీ** నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం.. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి కాంగ్రెస్ సారథ్యంలోని గత యూపీఏ పాలన అక్రమాలపై దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. మన్మోహన్ సర్కారు హయంలో మొజాంబిక్‌లోని రొవుమా ఆఫ్‌షోర్ ఏరియా-1లో భారతీయ ప్రభుత్వ రంగ సంస్థలు 30 శాతం వాటాను కొనుగోలు చేశాయి. వీడియోకాన్ నుంచి 10 శాతం వాటానేగాక అనడార్కో నుంచి మరో 10 శాతం వాటాను 2.64 బిలియన్ డాలర్లతో ఓవీఎల్ కొనుగోలు చేసింది. వీడియోకాన్ నుంచి కొన్న వాటాలో మరో ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ ఇండియా లిమిటెడ్‌కు ఓవీఎల్ 4 శాతం వాటాను విక్రయించింది. అయితే వీడియోకాన్‌కు ఓవీఎల్ ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లించిందని మోదీ సర్కారు ఆరోపిస్తున్నది. తమ ప్రభుత్వ హయాంలో ఈ డీల్ జరిగినా.. దీనిపై విచారణ చేపట్టేవాళ్లమని స్పష్టం చేస్తున్నది. నిజానికి 2012లో ఓవీఎల్‌కు తక్కువ ధరకే తమ వాటాను అమ్మేందుకు వీడియోకాన్ ముందుకు వచ్చిందని గుర్తుచేస్తున్నది కేంద్రం. థాయిలాండ్‌కు చెందిన పీటీటీ అన్వేషణ, ఉత్పాదక సంస్థలో 1.9 బిలియన్ డాలర్లతో 8.5 శాతం వాటాను వీడియోకాన్ కొనాలనుకున్నది. దీంతో 2.3 బిలియన్ డాలర్లకే అమ్ముతామన్నది. అయినప్పటికీ 2013లో 2.475 బిలియన్ డాలర్లకు కొన్నారని కేంద్రం ఆరోపిస్తున్నది. మరోవైపు ఈ ఆరోపణలను ఓవీఎల్ కొట్టిపారేస్తున్నది.

### ఎఫ్‌పీఐలు మరో రూ.3,800 కోట్లు

దేశీయ మార్కెట్లో పెట్టుబడి పెట్టిన విదేశీ మదుపరులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** దేశీయ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగుతున్నాయి. వరుసగా రెండు నెలలుగా భారీగా పెట్టుబడులు పెడుతున్న ఎఫ్‌పీఐలు..ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు రూ.3,800 కోట్లను చొప్పించారు. దేశీయంగా డిమాండ్ పెంచడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తోడు అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ఆశావాద పరిస్థితులు ఇందుకు దోహదం చేశాయి. తాజాగా డిపాజిటరీ వద్ద ఉన్న సమాచారం మేరకు ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు ఈక్విటీ మార్కెట్లలోకి రూ. 3,769.56 కోట్ల పెట్టుబడులు పెట్టగా, డెబిట్ మార్కెట్లలోకి కేవలం రూ. 58.40 కోట్ల పెట్టుబడులు పెట్టారు. మొత్తంగా రూ.3,827.90 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు అయింది. జూలై, ఆగస్టు నెలల్లో వరుసగా నిధులను ఉపసంహరించుకున్న విదేశీ మదుపరులు వరుసగా రెండు నెలలుగా దేశీయ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్నారు. సెప్టెంబర్‌లో రూ. 6,557.80 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు..ఆ మరుసటి నెలలో రూ.3,800 కోట్లకుపైగా ఇన్వెస్ట్‌చేశారని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ వర్గాలు వెల్లడించాయి.

# రూ.7,614 కోట్ల సమీకరణ

### దేశ, విదేశీ సంస్థలతో జీవీకే ఒప్పందాలు

**ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌లో వాటా విక్రయం ....రుణ భారం తగ్గించే దిశగా అడుగులు**

**హైదరాబాద్, అక్టోబర్ 28:**

దేశీయ ప్రముఖ మౌలిక రంగ సంస్థ జీవీకే గ్రూప్.. భారీగా నిధులను సమీకరించింది. రుణ భారాన్ని తగ్గించుకోవడానికి, తమ ఆధ్వర్యంలో నడుస్తున్న ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (ఎంఐఏఎల్)లో సహచర సంస్థల వాటాలను దక్కించుకోవడానికి విదేశీ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నది. తద్వారా రూ.7,614 కోట్లను పొందింది. జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అనుబంధ సంస్థలు జీవీకే ఎయిర్‌పోర్ట్ డెవలపర్స్ లిమిటెడ్ (జీవీకేఏడీఎల్), జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ (జీవీకేఏహెచ్ఎల్).. యూఏఈకి చెందిన అబుదబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), కెనడాకు చెందిన పబ్లిక్ సెక్టార్ పెన్షన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్), కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎన్ఐఐఎఫ్)లతో అగ్రిమెంట్లు చేసుకున్నాయి. ఈ మేరకు ఓ ప్రకటనలో జీవీకే ఆదివారం వెల్లడించింది. తాజా ఒప్పందాల ప్రకారం జీవీకేఏహెచ్ఎల్‌లో జీవీకేఏడీఎల్, ఏడీఐఏ, పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్, ఎన్ఐఐఎఫ్‌లకు వాటాలు ఉంటాయి. జీవీకేఏడీఎల్‌కు 20.9 శాతం వాటా ఉంటుంది. కొత్త భాగస్వామ్య సంస్థలకు జీవీకే గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ జీవీకే రెడ్డి ఈ సందర్భంగా స్వాగతం పలికారు. కాగా, ఈ డీల్‌తో జీవీకే ఎయిర్‌పోర్ట్ ఆస్తుల విలువ రూ.9,608 కోట్లుగా తేలింది. ఎంఐఏఎల్‌ను జీవీకేఏహెచ్ఎల్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (ఎన్ఎంఐఏఎల్) అభివృద్ధి ప్రాజెక్టునూ జీవీకేనే తగ్గించుకున్న సంగతీ విదితమే. తాజా ఒప్పందాల నేపథ్యంలో ఎంఐఏఎల్, ఎన్ఎంఐఏఎల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా జీవీకే రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్‌గా జీవీ సంజయ్ రెడ్డిలే కొనసాగనున్నారు. కాగా, గతేడాది మార్చి నాటికి జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ రుణ భారం రూ.12,854 కోట్లుగా ఉన్నది.




**ఎంఐఏఎల్‌లో పెరిగిన వాటా**

ఎంఐఏఎల్‌లో జీవీకే గ్రూప్, ఏఏఐలతోపాటు బిడ్‌వెస్ట్, ఏసీఎస్ఏలకూ వాటాలున్నాయి. దక్షిణాఫ్రికాకు చెందిన బిడ్ సర్వీసెస్ డివిజన్ మారిషస్ లేదా బిడ్‌వెస్ట్‌కు 13.5 శాతం వాటా ఉంటే, అదే దేశానికి చెందిన ఏసీఎస్ఏ గ్లోబల్‌కు మరో 10 శాతం వాటా ఉన్నది. ఇక ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు 26 శాతం, జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ (జీవీకేఏహెచ్ఎల్)కు 50.5 శాతం వాటాలున్నాయి. బిడ్‌వెస్ట్, ఏసీఎస్ఏల వాటాలను జీవీకే గ్రూప్ కొనుగోలు చేసింది. దీంతో ఎంఐఏఎల్‌లో జీవీకేఏహెచ్ఎల్ వాటా 74 శాతానికి పెరిగింది.

### అదానీకి చెక్

జీవీకే గ్రూప్ చేసుకున్న ఈ ఒప్పందాల వెనుక ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (ఎంఐఏఎల్) లోకి అదానీ గ్రూప్ రాకను అడ్డుకోవడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తున్నది. విమానాశ్రయాల నిర్వహణ రంగంలోకి గతేడాది అడుగుపెట్టిన గౌతమ్ అదానీ గ్రూప్.. దూకుడుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆరు విమానాశ్రయాలను తమ ఖాతాలో వేసుకున్న సంగతీ విదితమే. మరోవైపు జీవీకే.. ముంబై అంతర్జాతీయ ఎయిర్‌పోర్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నది. ఈ క్రమంలో బిడ్‌వెస్ట్, ఏసీఎస్ఏలు తమ వాటాలను అమ్మేయాలని చూస్తున్నాయి. దీంతో అదానీ ఆసక్తిని చూపుతుండగా, జీవీకే తాజా ఒప్పందాలకు తెరతీసింది. ఇలా వచ్చిన నగదుతో సదరు వాటాలను కొనేసింది.

### రెండింతలైన ఫ్లిప్‌కార్ట్ నష్టం

2018-19లో రూ.3,837 కోట్లుగా నమోదు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** మరో ఆన్‌లైన్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ కూడా భారీ నష్టాలను మూటగట్టుకున్నది. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ 3,836.80 కోట్ల నష్టాన్ని చవిచూసింది. కంపెనీ చరిత్రలో ఇంతటి స్థాయిలో నష్టాలు రావడం ఇదే తొలిసారి. రెగ్యులేటరీ డాక్యుమెంట్ ద్వారా ఈ సమాచారం వెల్లడైంది. మార్చి 31, 2018తో ముగిసిన ఏడాదికిగాను నమోదైన రూ.2,063.8 కోట్ల నష్టంతో పోలిస్తే 85.91 శాతం అధికం. కానీ, కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 42.82 శాతం పెరిగి రూ.30,931 కోట్లకు చేరుకున్నది. కంపెనీకి చెందిన అనుబంధ సంస్థయైన ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్ రూ.4,234 కోట్ల ఆదాయంపై రూ.1,624 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. ప్రస్తుతం సంస్థ మొబైల్, టీవీ, ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్, మొబైల్ యాక్సెసరీస్, ఫుట్‌వియర్, బట్టలు వంటి వాటిపై సేవులు అందిస్తున్నది. వాల్‌మార్ట్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో ఫ్లిప్‌కార్ట్‌లో కంపెనీ వాటా 77 శాతంగా ఎగబాకింది.

# దర్యాప్తు చేయాలి

### ఆన్‌లైన్ సంస్థల భారీ రాయితీలతో జీఎస్టీకి గండి

కేంద్రానికి సీఏఐటీ ఫిర్యాదు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:**

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర ఈ-కామర్స్ దిగ్గజ సంస్థలపై అఖిల భారత వర్తకుల సమాఖ్య (సీఏఐటీ) కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. ఈ ఆన్‌లైన్ సంస్థలు ఇస్తున్న భారీ రాయితీలతో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ఆదాయానికి గండి పడుతున్నదని తెలిపింది. పండుగల వేళ పెద్ద ఎత్తున ఆఫర్లను ఈ-మార్కెటీర్లు కొనుగోలుదారులపై గుప్పిస్తున్నది చూస్తూనే ఉన్నాం. పాదరక్షలు, దుస్తులు, మొబైల్స్, టెలివిజన్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఎయిర్ కండీషనర్లు, వంట సామాగ్రిసహా ఇతర గృహోపకరణాలన్నింటిపై భారీ డిస్కౌంట్లను ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అయితే దీనివల్ల అటు కేంద్రానికి, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే జీఎస్టీ ఆదాయం పోతున్నదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు సోమవారం సీఏఐటీ ఓ లేఖ రాసింది. మార్కెట్ విలువ కంటే తక్కువ ధరకే ఆయా ఉత్పత్తులను ఈ-మార్కెటీర్లు అమ్ముతున్నారని వివరించింది.

**ఇంత రాయితీ ఎలా?**

సంప్రదాయ మార్కెట్‌లో దొరికే వస్తువులు..




ఆన్‌లైన్ మార్కెట్‌లో దాదాపు సగం ధరకే లభిస్తున్నది చూస్తూనే ఉన్నాం. దీంతో ఇది ఎలా సాధ్యం?.. ఈ వస్తువులు అంత చౌకగా ఎలా దొరుకుతున్నాయన్న దానిపై దర్యాప్తు జరుగాల్సిన అవసరం ఉందని సీపీఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ అంటున్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన దగ్గర్నుంచి ఇప్పటిదాకా ఆయా వస్తూత్పత్తుల మార్కెట్ విలువ, బిల్లింగ్ ధర మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గణించి జీఎస్టీ నష్టపరిహారం వసూలు చేయాలని సూచించారు. మార్కెట్ విలువ కంటే తక్కువగా ఒక వస్తువును అమ్మితే.. దాన్ని ప్రశ్నించే అధికారం జీఎస్టీ చట్టం ప్రభుత్వానికి ఇస్తున్నదని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కాగా, ఇదే లేఖను కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్‌కు, అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకూ సీఏఐటీ పంపింది.

### సంప్రదాయ మార్కెట్ వెలవెల

**ఆన్‌లైన్** మార్కెట్ జోరు.. సంప్రదాయ మార్కెట్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. 4జీ రాకతో పెరిగిన స్మార్ట్‌ఫోన్ల వాడకం, ఇంటర్నెట్ వినియోగం.. ఈ-కామర్స్ సంస్థలకు కాసుల వర్షం కురిపిస్తున్నది. ఈ క్రమంలో డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్‌లు.. సంప్రదాయ మార్కెట్‌ను కళావిహీనంగా చేస్తున్నాయి. ఇదే ఆందోళనను వర్తక, వ్యాపార సంఘాలు.. ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లడంతో ఈ-కామర్స్ సంస్థలపై పలు ఆంక్షలు వచ్చిపడిన విషయం తెలిసిందే. కాగా, క్షణం తీరికలేని ఈ యాంత్రిక జీవనంలో షాపింగ్ కోసం ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించడం ప్రతీ ఒక్కరికీ సమస్యే అవుతున్నదని, అందుకే ఇంట్లోనే కూర్చుని ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేస్తున్నారని, దీనివల్ల అటు సమయం, ఇటు డబ్బు ఆదా అవుతున్నదని మెజారిటీ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.




మూరత్ ట్రేడింగ్‌ను గంటకొట్టి ప్రారంభిస్తున్న బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు (ఎడమ)..



ఉత్సాహంగా ట్రేడింగ్‌ను చేస్తున్న మదుపరులు, వారి కుటుంబ సభ్యులు

# మురిసిన మూరత్

### సెన్సెక్స్ 192, నిఫ్టీకి 43 పాయింట్ల లాభం

### సంవత్ 2076కి లాభాలతో స్వాగతం

**ముంబై, అక్టోబర్ 28:**

దలాల్ స్ట్రీట్‌లో దీపావళి కాంతులు వెలుగులుజిమ్మింది. సంవత్ 2075 సంవత్సరానికి లాభాలతో వీడ్కోలు పలికిన దేశీయ స్టాక్ మార్కెట్లు..సంవత్ 2076 సంవత్సరానికి లాభాలతో స్వాగతం తెలిపింది. ఆదివారం సాయంత్రం 6.15 గంటల నుంచి రాత్రి 7.15 గంటల వరకు నిర్వహించిన మూరత్ ట్రేడింగ్‌లో మదుపరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 39,397.37 వద్ద ప్రారంభమైన బీఎస్ఈ సెన్సెక్స్..ఆటో, ఐటీ, బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగబడటంతో ఒక దశలో 39,400లను తాకింది. చివరకు దలాల్‌స్ట్రీల్ వర్గాలు ప్రాఫిట్ బుకింగ్‌కు పాల్పడటంతో ఆ దశలో లాభాలను నిలుపుకోలేకపోయింది. చివరకు 192 పాయింట్ల లాభంతో 39,250.20 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 42.25 పాయింట్లు అధికమై 11,627.15 వద్ద స్థిరపడింది. మూరత్ ట్రేడింగ్‌లో టాటా మోటర్స్, యెస్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, వేదాంత, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రాల షేర్లు 16.54 శాతం వరకు లాభపడగా.. మారుతి, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్‌లు స్వల్పంగా నష్టపోయాయి. సంవత్ 2076కి లాభాలతో స్వాగతం పలికినట్లు, టెలికం, కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగాలు తప్పా మిగతా అన్ని రంగాలకు చెందిన షేర్లకు మదుపరుల నుంచి విశేష స్పందన లభించిందని, ముఖ్యంగా ఇండస్ట్రీయల్, ఆటో, బేసిక్ మెటిరియల్, క్యాపిటల్ షేర్లు ఆకట్టుకున్నాయి. బీఎస్ఈ స్మాల్-క్యాప్ ఇండెక్స్ 1.20 శాతం అధికమవగా, మిడ్-క్యాప్ స్వల్ప లాభాలతో ముగిసింది. సంప్రదాయ హిందు క్యాలెండర్ ప్రకారం 'విక్రమ్ సంవత్'ను ప్రతి దీపావళి పండుగ రోజు స్టాక్ మార్కెట్లు జరుపుకుంటాయి. గతేడాదిలో సెన్సెక్స్ 4,066.15 పాయింట్లు(11.62 శాతం), నిఫ్టీ 1,053.90 పాయింట్లు(10 శాతం) లాభపడ్డాయి. దివాలీ బలిప్రతిపదా సందర్భంగా సోమవారం(అక్టోబర్ 28)న స్టాక్ మార్కెట్లు మూసివేసివుంచారు.

**ఫెడ్ నిర్ణయమే కీలకం..**

కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలకు తోడు వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వు తీసుకునే నిర్ణయం ఈ వారం స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. దివాలీ బలిప్రతిపద సందర్భంగా సోమవారం స్టాక్ మార్కెట్లకు సెలవుకావడంతో ఈ వారంలో ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానున్నది. ప్రస్తుత నెలకుగాను ఆటోమొబైల్ సంస్థలు తమ వాహన విక్రయ గణాంకాలను ఈవారం చివర్లో వెల్లడించనుండటం, వడ్డీరేట్లపై ఈ బుధవారం యూఎస్ ఫెడ్ తన నిర్ణయానికి తోడు బ్రెగ్జిట్, ట్రేడ్‌వార్‌పై కూడా మదుపరులు దృష్టి సారించే అవకాశం ఉన్నదని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐవోసీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యెస్ బ్యాంక్‌లు తమ రెండో త్రైమాసికపు ఆర్థిక ఫలితాలను ఈ వారంలో ప్రకటించనున్నాయి. అలాగే ఈ శుక్రవారం విడుదలకానున్న తయారీరంగానికి సంబంధించి పీఎంఐ డాటా ట్రేడింగ్ సరళిని ప్రభావితం చేసే అంశాల్లో ఇది కూడా ఒకటని దలాల్‌స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. వీటితోపాటు డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలిక, క్రూడాయిల్ ధరలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల పెట్టుబడులు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనున్నాయి.



### మెగా డిజిటల్ సంస్థ

అడుగులేస్తున్న ముకేశ్ అంబానీ

రూ.1.73 లక్షల కోట్లతో అలీబాబా స్థాయిలో ఏర్పాటు

**ముంబై, అక్టోబర్ 28:** ముకేశ్ అంబానీ.. మెగా డిజిటల్ సంస్థకు శ్రీకారం చుడుతున్నారు. రూ.1.73 లక్షల కోట్లతో చైనాకు చెందిన అలీబాబా కంపెనీ స్థాయిలో ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఇందుకు తగ్గట్లుగానే ప్రణాళికనూ రచిస్తున్నారు. ఇప్పటికే రిలయన్స్ జియోపై భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టిన ముకేశ్.. దాన్ని ఈ డిజిటల్ సంస్థ పురోగతికి ఆయువుపట్టుగా మార్చాలని చూస్తున్నారు. దేశంలోనే అతిపెద్ద ఇంటర్నెట్ షాపింగ్ వేదికగా.. భారతీయ ఈ-కామర్స్ రంగంపై తనదైన ముద్ర వేసేలా 24 బిలియన్ డాలర్లతో డిజిటల్ సర్వీసెస్ హోల్డింగ్ కంపెనీని ఏర్పాటుచేసే దిశగా ముకేశ్ అడుగులు వేస్తున్నారు. 1999లో అలీబాబాను జాక్ మా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ మాజీ ఆంగ్ల ఉపాధ్యాయుడు.. అలీబాబాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లగా, దీని మార్కెట్ విలువ 454 బిలియన్ డాలర్లు. మార్చితో ముగిసిన ఏడాది కాలంలో 56 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని అందుకున్న అలీబాబా.. 13 బిలియన్ డాలర్ల లాభాన్ని పొందింది.



వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట దర్గా ఉర్సులో భాగంగా సోమవారం చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, ఎంపీ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత సామరస్యానికి ప్రతీక కాజీపేట దర్గా అని వారు పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల ఫకీర్లు నిర్వహించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. - సిద్ధార్థనగర్(వరంగల్ అర్బన్)



కుటుంబసభ్యులు, రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని తన అధికారిక నివాసంలో దీపావళి పండుగ జరుపుకుంటున్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

## సుజిత్ కోసం.. ఆగని ప్రయత్నాలు

**తిరుచిరాపల్లి, అక్టోబర్ 28:** తమిళనాడులోని తిరుచిరాపల్లి జిల్లా నడుకట్టుపట్టి గ్రామంలో నాలుగు రోజుల క్రితం (శుక్రవారం సాయంత్రం) బోరుబావిలో పడిపోయిన చిన్నారి సుజిత్ విల్సన్‌ను రక్షించే ప్రయత్నాలు సోమవారం కూడా కొనసాగాయి. సుమారు 88 అడుగుల లోతున గల బావిలో పడిపోయిన సుజిత్‌ను వెలికి తీసేందుకు అదనపు సిబ్బంది ఆ బావికి సమాంతరంగా మరో బావిని తవ్వడం ప్రారంభించారు. మౌలిక వసతుల సంస్థ ఎల్ అండ్ టీ.. జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక డ్రిల్లింగ్ మిషన్ సాయంతో నిపుణుల సూచనలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ బావి తవ్వకం పనులను వేగవంతం చేశారు. సుజిత్ ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, కెమెరా ద్వారా అతడి కదలికలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. బాలుడికి శ్వాస కోసం ఆక్సిజన్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మంత్రులు విజయ భాస్కర్, నాగరాజన్ ఎండీఎంకే చీఫ్ వైగో, స్థానిక కాంగ్రెస్ ఎంపీ జోతిమణి అక్కడే బస చేసి, సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. సహాయ చర్యలపై తమిళనాడు సీఎం పళనిస్వామితో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు. బోరుబావులను తెరిచి ఉంచడం నేరంగా పరిగణించాలని నటుడు కమల్‌హాసన్ పేర్కొన్నారు.



బోరుబావిలో చిక్కుకుపోయిన సుజిత్



# నడి సంద్రంలో బతుకు పోరాటం!

- రెండు తుఫాన్లు విరుచుకుపడటంతో ధ్వంసమైన పడవ
- ఆహారంలేక సహచరుడి దుర్మరణం
- వాన నీటితో కడుపు నింపుకొని.. 28 రోజుల తర్వాత ఒడ్డుకు చేరిన వ్యక్తి



అమృత్ కుజూర్

**భువనేశ్వర్:** ఓడ ప్రమాదంలో కుటుంబాన్ని కోల్పోయి.. సముద్రం మధ్యలో చిక్కుకొని పులితో సహవాసం చేస్తూ చిన్న పడవ మీద ఓ బాలుడు సాగించిన జీవన్మరణ పోరాటాన్ని అత్యంత హృద్యంగా చూపించిన 'లైఫ్ ఆఫ్ పై' సినిమా నిజజీవితంలోనూ జరిగింది. అయితే, సినిమాలో చూపించినట్టు ఈ వ్యక్తి పులికి బదులు విధితో పోరాడాడు. 28 రోజులపాటు సముద్రం మధ్యలో నిత్యం గండాలు ఎదుర్కొంటూ గడిపేశాడు. బతుకుదామన్న ఆశను ఉగ్గబట్టుకుని తీరం కోసం వేచి చూశాడు. చివరకు అతని ఆశ నెరవేరి ఒడ్డుకు చేరి ప్రాణాల్ని నిలుపుకున్నాడు. అండమాన్ నికోబార్ దీవుల్లోని షాహీద్ ద్వీపానికి చెందిన 49 ఏండ్ల అమృత్ కుజూర్ తన స్నేహితుడు దివ్యరాజన్‌తో కలిసి సముద్రంలో రాకపోకలు సాగించే నౌకలకు ఆహారం, మంచినీరు సరఫరా చేసి డబ్బులు సంపాదించుకుంటూ ఉంటారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ రూ. 5 లక్షల సరుకుతో గత నెల 28న సముద్రంలోకి తమ ప్రయాణాన్ని సాగించారు. అయితే, బయల్దేరిన కొద్ది రోజులకే వారి పడవ తుఫానులో చిక్కుకుని దారి తప్పింది. తుపాను దెబ్బకు పడవ పైభాగం ధ్వంసమైంది. కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా నాశనమైంది. దీంతోపాటు పడవలో ఇంధనం కూడా అయిపోయింది. పడవ మునిగిపోకుండా స్నేహితులిద్దరూ సరుకును సముద్రంలో పారేశారు. సాయం కోసం ఎదురుచూస్తున్న వాళ్లకు చుట్టుపక్కల ఒక్క నౌకా కనిపించలేదు. చివరికి మయన్మార్ నేవీ నౌక ఒకటి వారికి చేరువగా వచ్చింది. అందులోని సిబ్బంది 260 లీటర్ల డీజిల్, దిక్సూచి(కంపాస్)ని అందజేసింది. ప్రమాదం నుంచి తప్పించుకున్నామనుకున్న ఆ స్నేహితులకు ఆ సంతోషం ఆవిరి కావడానికి ఎంతో సమయం పట్టలేదు. అప్పటికే, పాక్షికంగా దెబ్బతిన్న వాళ్ల పడవ మీదకి మరో తుఫాను విరుచుకుపడింది. దీంతో పడవ మరింత దెబ్బతిన్నది. ఆహారం లేకపోవడంతో దివ్యరాజన్ కొన్ని రోజుల్లోనే చనిపోయాడు. రెండు రోజులపాటు పడవలో ఉన్న అతని మృతదేహం కుళ్లిపోవడంతో ఇష్టంలేకపోయినప్పటికీ అమృత్ దాన్ని సముద్రంలోకి విసిరేశాడు. తనను తాను కాపాడుకోవడానికి వర్షపు నీటిని తువ్వాలతో ఒడిసిపట్టుకుని వాటినే ఆహారంగా తీసుకున్నాడు. వర్షం కురవని రోజుల్లో సముద్రపు నీటిని బలవంతంగా తాగేవాడు. విధి కనికరించడంతో అతని పడవ ఒడిశా తీరానికి కొట్టుకొచ్చింది. పోలీసులు అమృత్‌ను కాపాడి చికిత్స కోసం దవాఖానకి తరలించారు. తుఫాన్ల మధ్య.. బయల్దేరిన ప్రాంతం నుంచి 1300 కి.మీ. దూరంలోని తీరానికి కొట్టుకొచ్చిన అతని తెగువను జనం మెచ్చుకుంటున్నారు. 'బతుకుదామన్న నా ఆశలన్నీ సమాధి అయిపోతుండగా.. దేవుడు నన్ను కరుణించాడు' అని అమృత్ ఎంతో ఆనందంగా చెబుతున్నాడు. అండమాన్‌లోని అమృత్ కుటుంబ సభ్యులను సంప్రదించామని, ఒకటి రెండు రోజుల్లో వాళ్లు ఒడిశాకు వస్తారని అధికారులు తెలిపారు.

# లాఠీతోపాటు దయ ఉండాలి

- సమాజం పట్ల పోలీసులు సున్నితంగా వ్యవహరించాలి
- ఎస్సైల శిక్షణా కార్యక్రమంలో హైకోర్టు సీజే రాఘవేంద్రసింగ్‌చౌహాన్
- నేరపరిశోధనలో శాస్త్రీయ దృక్పథం పెరుగాలి: డీజీపీ మహేందర్‌రెడ్డి





సోమవారం రాష్ట్ర పోలీస్ అకాడమీలో సబ్ ఇన్‌స్పెక్టర్ల శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్. చిత్రంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, టీఎస్‌పీఏ డైరెక్టర్ వినయ్‌కుమార్‌సింగ్ తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

సమాజం పట్ల పోలీసులు సున్నితంగా వ్యవహరించాలని, బాధతో వచ్చినవారికి ఓదార్పు నివ్వాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్ సూచించారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ (టీఎస్‌పీఏ)లో ఏర్పాటుచేసిన సబ్ ఇన్‌స్పెక్టర్ల శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. వృత్తిపట్ల పోలీసులు నిబద్ధతను కలిగి ఉండాలని పేర్కొన్నారు. లాఠీతోపాటు దయ, కరుణ లాంటి లక్షణాలున్నవారే పోలీసు వృత్తిలో రాణిస్తారని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సైలుగా ఎంపికైనవారికి శుభాకాంక్షలు తెలిపి పోలీస్‌శాఖలోకి ఆహ్వానించారు. నేర పరిశోధనలో శాస్త్రీయ దృక్పథాన్ని పెం పొందించాల్సిన అవసరమున్నదని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొనేలా పోలీస్ అధికారులు వ్యవహరించాలని, రాజ్యాంగం ద్వారా ప్రజలకు సంక్రమించిన హక్కులకు విఘాతం కలిగించకుండా విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు. ప్రజలంతా ప్రశాంతంగా నివసిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏ సందర్భాల్లో ప్రజలను అరెస్టు చేయాలన్నదానిపై పోలీసులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో చురుగ్గా పనిచేయాలని, ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ బాధ్యతలను నిర్వర్తించాలని డీజీపీ సూచించారు. పోలీసు వృత్తిని ఎంచుకున్నవారికి శారీరక, మానసిక క్రమశిక్షణ తప్పనిసరని, ఈ వృత్తిలో ఉన్నవారు ఎలాంటి వివక్షలేకుండా ప్రజలకు సేవలందించాలని ఉద్బోధించారు. సమస్యల్లేని సమాజాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఉన్నదని డీజీపీ మహేందర్‌రెడ్డి ఉద్ఘాటించారు. శిక్షణకు విచ్చేసినవారికి టీఎస్‌పీఏ డైరెక్టర్ వినయ్‌కుమార్‌సింగ్ ఆహ్వానం పలికారు. పోలీసు వ్యవస్థపై ప్రజల అంచనాలు పెరుగుతున్నాయని, వాటిని అందుకోవడానికి సరికొత్త శిక్షణ విధానం అవసరమని పేర్కొన్నారు. ఎస్సై శిక్షణకు సంబంధించిన కోర్సు గురించి ఐపీఎస్ అధికారి డాక్టర్ బీ నవీన్‌కుమార్ పీపీటీ ద్వారా వివరించి, కొత్త నియమ నిబంధనల గురించి తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌పీఏ డిప్యూటీ డైరెక్టర్ జానకిషర్మిలా తదితరులు పాల్గొన్నారు.

# గుట్టుగా దోచుకున్న 'గుడ్‌విన్'

- మహారాష్ట్రలో ఖాతాదారులను మోసగించిన జ్యుయలరీ సంస్థ
- కోట్లలో దండుకుని నిర్వాహకులు పరార్





ముంబైలోని డోంబివలీలో గుడ్‌విల్ షోరూమ్ ఎదుట బాధితుల నిరసన

**ముంబై, అక్టోబర్ 28:** మహారాష్ట్రలో 'గుడ్‌విన్' అనే బంగారు ఆభరణాల తయారీ సంస్థ ఖాతాదారులను భారీ ఎత్తున మోసగించింది. ఆకర్షించే పెట్టుబడి పథకాల పేరుతో ఖాతాదారుల నుంచి కోట్లలో దండుకున్న నిర్వాహకులు శనివారం నుంచి పత్తాలేకుండా పోయారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితులు లబోదిబోమంటూ స్థానిక పోలీస్ స్టేషన్లకు క్యూకడుతున్నారు. కేరళలోని త్రిస్సూర్‌కు చెందిన ఏజీ మోహనన్ 1992లో గుడ్‌విన్ పేరుతో బంగారు ఆభరణాల తయారీ సంస్థను ప్రారంభించారు. 1995లో హోల్‌సేల్ వ్యాపారంలోకి దిగిన ఈ సంస్థ 2004లో మహారాష్ట్రకు విస్తరించింది. ముంబై, థాణె నగరాల్లో 12 షాపులను ఆయన కుమారులైన సునీల్ కుమార్, సుదీశ్ కుమార్ నిర్వహిస్తున్నారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయంటూ ఖాతాదారులను ఆకట్టుకున్నారు. నమ్మిన వేలాది మంది స్థానికులు రెండు పొదుపు పథకాల్లో కోట్లలో పెట్టుబడి పెట్టారు. దీపావళి పండుగ నేపథ్యంలో బంగారం పథకాల్లో పొదుపు చేసిన సొమ్మును వినియోగించుకోవాలని కొందరు భావించారు. అయితే శనివారం నుంచి ఈ సంస్థకు చెందిన పలు శాఖలు తెరుచుకోలేదు. తొలుత ముంబైలోని డొంబివిలి శాఖకు చెందిన 35 మంది ఖాతాదారులు తాము మోసపోయినట్లు గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం నగరమంతటా వ్యాపించడంతో పలువురు బాధితులు ఆయా శాఖల పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు క్యూకడుతున్నారు. ఆదివారం నాటికి 54 మంది రూ.2.93 కోట్ల మేర పెట్టుబడిపెట్టి మోసపోయినట్లు ఫిర్యాదు చేశారని డొంబివిలి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ అహిర్ తెలిపారు. బాధితుల సంఖ్య 300కు చేరడంతో ఫిర్యాదుల నమోదుకు ఓ అధికారిని ప్రత్యేకంగా నియమించినట్లు ఆయన తెలిపారు. గుడ్‌విల్ సంస్థ గ్రూప్ చైర్మన్ సునీల్‌కుమార్, ఎండీ సుదీశ్‌కుమార్, డొంబివిలి శాఖ మేనేజర్ మనీశ్ ఇండ్లకు వెళ్లి ఆరా తీయగా వారు పారిపోయినట్లు తెలిసిందన్నారు. కేరళకు చెందిన సంస్థ చైర్మన్, ఎండీ కోసం లుకౌట్ నోటీసు జారీచేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు తాము ఎక్కడికి పారిపోలేదని, ఖాతాదారుల డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని, తమపై నమ్మకం ఉంచాలంటూ నిర్వాహకులు చెబుతున్న ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్నది. దీనిపై ఆరా తీస్తామని పోలీసులు పేర్కొన్నారు.

## గల్లంతైన యువకుల మృతదేహాల వెలికితీత

**దస్తురాబాద్:** నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రేవోజిపేట గ్రామ సమీపంలో శనివారం కడెం ప్రధాన కాల్వలోకి కారు దూసుకెళ్లగా గల్లంతైన మంచిర్యాల జిల్లా జన్నారం మండలానికి చెందిన సాయిసంగీత్, శశాంక్ అనే ఇద్దరు యువకుల మృతదేహాలు లభించాయి. గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం ఉదయం కడెం ప్రధాన కాల్వ డిస్ట్రిబ్యూటర్-8 వద్ద ఒకరి మృతదేహం, డిస్ట్రిబ్యూటర్-11 వద్ద మరో మృతదేహం లభించిందని ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇందన్‌పెల్లి కడెం ప్రధాన కాల్వ వద్ద పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# కోరుకున్నంత మంది పిల్లల్ని కనండి

### ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** 'ప్రభుత్వం ఇప్పుడు ఉద్యోగాలు ఇవ్వడంలేదు. ఇక ముందు కూడా ఎలాగూ ఉద్యోగాలు ఇవ్వదు. కాబట్టి ప్రభుత్వం తీసుకొచ్చిన (ఇద్దరు పిల్లలకే పరిమితం కావాలి) విధానాన్ని పాటించాల్సిన అవసరం లేదు. ఇద్దరు పిల్లల్ని మాత్రమే కనాలనే భావనను ఇస్లాం నమ్మదు. అందుకని ఆ విధానాన్ని పక్కనపెట్టి మీరు కోరుకున్నంత మంది పిల్లల్ని కనండి' అని ముస్లింలకు పిలుపునిస్తున్నారు ఆలిండియా యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) అధినేత బద్రుద్దీన్ అజ్మల్. 'ఇద్దరు పిల్లలనే కనండి' అనే కొత్త విధానాన్ని అసోంలోని అధికార బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ విధానాన్ని తేవడం దురదృష్టకరమన్న అజ్మల్, బీజేపీ ప్రభుత్వ తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'మావారు తాము కోరుకున్నంత మంది పిల్లల్ని భరించగలరు. వారికి కొద్దిగా విద్య అందిస్తే చాలు వ్యాపార అవకాశాలు సృష్టించుకుంటారు. ఇతర మతాలవారికి ఉద్యోగాలు కల్పిస్తారు' అని పేర్కొన్నారు. అజ్మల్ వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ వంటి పార్టీలకు ఉపయోగపడుతాయని కాంగ్రెస్ నాయకుడు జితిన్‌ప్రసాద్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అజ్మల్ వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ ఎమ్మెల్యే సురేంద్ర సింగ్ మాట్లాడుతూ.. దేశంలో జనాభా నియంత్రణ చట్టం చేయకపోతే మరో 50 ఏండ్లయినా భారత్‌లోనూ హిందుత్వం సురక్షితంగా ఉండదన్నారు.



ఢిల్లీ నుంచి పాకిస్థాన్‌కు భారీ ఊరేగింపుగా బయలుదేరిన సిక్కు భక్తులు

# పాక్‌కు భారతీయ సిక్కు భక్త బృందం

### ఊరేగింపులో ముఖ్య అతిథిగా పాక్ ఇంచార్జి హై కమిషనర్ సయ్యద్ హైదర్ షా

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌లోని ప్రసిద్ధ నానక్ సాహిబ్ గురుద్వారాను సందర్శించేందుకు భారతీయ సిక్కు భక్త బృందం సోమవారం ఢిల్లీ నుంచి ఊరేగింపుగా బయలుదేరింది. ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ (డీఎస్‌జీఎంసీ) మాజీ అధ్యక్షుడు సర్దార్ పరమ్‌జిత్ సింగ్ సార్నా నేతృత్వంలోని 'నగర కీర్తన' బృందానికి సీఎం కేజ్రీవాల్‌తోపాటు పలువురు ఘనంగా వీడ్కోలు పలికారు. పాక్ ఇంచార్జి హై కమిషనర్ సయ్యద్ హైదర్ షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్టోబర్ 31న పాక్‌కు చేరుకోనున్న ఈ బృందానికి అక్కడి అధికారులు స్వాగతం పలుకుతారని పాక్ హై కమిషన్ తెలిపింది. సిక్కుల గురువు గురునానక్ దేవ్ 550వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో పాక్‌లోని నానక్ సాహిబ్, భారత్‌లోని దర్బార్ సాహిబ్ గురుద్వారాలను కలుపుతూ సంయుక్తంగా నిర్మించిన కర్తార్‌పూర్ కారిడార్‌ను నవంబర్‌లో ఇరు దేశాల ప్రధానులు ప్రారంభించనున్న సంగతి తెలిసిందే.

# హిందూ ముస్లింల విరాళాలతో గుడి

- ప్రారంభించిన మౌల్వీ.. పశ్చిమబెంగాల్‌లో మత సామరస్యం

**మిడ్నాపూర్:** పశ్చిమబెంగాల్‌లోని బీర్భూం జిల్లా నానూర్ ప్రాంతం బాసాపరా గ్రామంలో హిందు, ముస్లింల మధ్య మత సామరస్యం వెల్లి విరుస్తున్నది. రెండేండ్ల క్రితం రోడ్డు నిర్మాణం కోసం కాళీకాదేవి గుడిని అధికారులు కూల్చేశారు. ఆ గుడిని మరోచోట నిర్మించాలని హిందువులు, ముస్లింలు నిర్ణయించి, అందుకు భూమిని కొనుగోలుచేశారు. గుడి నిర్మాణానికి రూ.10 లక్షలు సేకరిస్తే.. అందులో రూ.7 లక్షలు ముస్లింలే సేకరించారని దేవాలయ కమిటీ అధ్యక్షుడు సునిల్ సాహ చెప్పారు. మత సామరస్యంతో నిర్మించిన ఈ గుడిని ఆదివారం కాళీ పూజ సందర్భంగా స్థానిక మౌల్వి నజీరుద్దీన్ మండల్ ప్రారంభించారు. ముస్లింల సహకారం లేకుంటే గుడి నిర్మాణం జరిగేదే కాదని సునీల్ సహ తెలిపారు.

## బుర్కినా ఫాసోలో నరమేధం..15 మంది మృతి

**వాగడూగు:** పశ్చిమ ఆఫ్రికా దేశమైన బుర్కినా ఫాసోలో మరో నరమేధం జరిగింది. ఇందులో 15 మంది మరణించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. జిహాదీ ఘర్షణల నేపథ్యంలో శనివారం ఆయుధాలు ధరించిన కొందరు పొబి-మెన్‌గావో గ్రామంపై దాడి చేసి కొందరిని కిడ్నాప్ చేశారు. ఆదివారం సమీప ప్రాంతాల్లో 11 మంది మృతదేహాలు కనిపించినట్లు భద్రతా సిబ్బంది తెలిపారు. ఆదివారం మరోసారి దాడి చేశారని, నాలుగు మృతదేహాలను గుర్తించామని చెప్పారు.

## ఎస్బీఐలో చోరీకి విఫలయత్నం

**నల్లగొండ సిటీ:** నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్బీఐ ప్రధానశాఖలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్ సమీప ఎస్బీఐ ప్రధానశాఖ భవనం వెనుక భాగంలో తలుపునకు ఉన్న గ్రిల్స్ తాళాన్ని పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు లోపనికి ప్రవేశించారు. బ్యాంకులోని బీరువా తాళం పగులగొట్టారు. అందులో కేవలం ఫైళ్లు మాత్రమే ఉండటంతో స్ట్రాంగ్‌రూంను తెరిచేందుకు యత్నించారు. అది తెరుచుకోకపోవడంతో వెనుదిరిగారు. సోమవారం ఉదయం విధులకు వచ్చిన బ్యాంకు చీఫ్ మేనేజర్ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో నుంచి డబ్బులు, వస్తువులు చోరీకి గురికాలేదని బ్యాంకు అధికారులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలు స్వీకరించారు. బ్యాంకులో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ కొన్ని సాంకేతిక కారణాలతో తమకు అందలేదని, మంగళవారం బ్యాంకు టెక్నికల్ అధికారులు వచ్చిన తర్వాత వాటిని పరిశీలించి దొంగలను గుర్తిస్తామని టూటౌన్ ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

# ట్రక్ డ్రైవర్ కాల్చివేత

- కశ్మీర్‌లో మిలిటెంట్ల ఘాతుకం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో మిలిటెంట్లుగా అనుమానిస్తున్న వ్యక్తులు సోమవారం ఒక ట్రక్కు డ్రైవర్‌ను పొట్టన బెట్టుకున్నారు. కశ్మీర్ లోయలో 27 మంది యూరోపియన్ యూనియన్ (ఈయూ) పార్లమెంట్ సభ్యుల ప్రతినిధి బృందం పర్యటించడానికి ఒకరోజు ముందు మిలిటెంట్లు ఈ దారుణానికి పాల్పడటం గమనార్హం. అనంతనాగ్ జిల్లా బిజ్‌బెహరాలోని కనిల్‌వాన్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం నారాయణ్ దత్ అనే డ్రైవర్‌పై మిలిటెంట్లు కాల్పులు జరుపడంతో అక్కడికక్కడే మరణించాడు. కాల్పుల శబ్దం విని సమీపంలో ఉన్న పోలీసు అధికారులు అక్కడికి చేరుకుని మరో ఇద్దరు ట్రక్కు డ్రైవర్ల ప్రాణాలను రక్షించారు. పోలీసులు, భద్రతా దళాలు మిలిటెంట్ల కోసం గాలింపు చేపట్టారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దుచేసిన తర్వాత మిలిటెంట్లు నలుగురు ట్రక్కు డ్రైవర్లను పొట్టన బెట్టుకున్నారు. ఈ నెల 14న సోపియాన్ జిల్లాలో రాజస్థాన్‌కు చెందిన ట్రక్కు డ్రైవర్‌ను హతమార్చిన మిలిటెంట్లు.. కశ్మీరీ ఆపిళ్లు తీసుకెళ్లేందుకు వచ్చిన మరో ఇద్దరు కశ్మీరేతర ట్రక్కు డ్రైవర్లను ఈ నెల 24న హత్య చేశారు.

## పేద పిల్లలకు.. స్టార్ హోటల్‌లో విందు

- వినూత్నంగా దీపావళి జరుపుకున్న మధ్యప్రదేశ్ మంత్రి

**ఇండోర్:** మధ్యప్రదేశ్‌కు చెందిన మంత్రి జితు పట్వారీ దీపావళిని వినూత్నంగా జరుపుకున్నారు. పేద పిల్లలను బస్సులో స్వయంగా ఫైవ్ స్టార్ హోటల్‌కు తీసుకెళ్లి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక బహుమతులను అందజేశారు. 'పేద, అనాథ, దివ్యాంగ పిల్లాలకు ఫైవ్ స్టార్ హోటల్‌లో విందు ఇచ్చినందుకు సంతోషంగా ఉన్నది. ఇతరుల జీవితంలో సంతోషం నింపితే, మన సంతోషం రెట్టింపు అవుతుంది' అని ట్వీట్ చేశారు.

## సాధ్విపై సామూహిక లైంగిక దాడి

- బీహార్‌లో దారుణం

**షేక్‌పురా:** బీహార్‌లోని షేక్‌పురా జిల్లాలో ఓ సాధ్విపై సామూహిక లైంగిక దాడి జరిగింది. మహిళా పోలీస్ స్టేషన్ అధికారిని యశోదా దేవి కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ బస్తీ జిల్లాకు చెందిన ఓ మహిళ సాధ్విగా మారింది. కోల్‌కతా ఆశ్రమంలో ఉంటున్న ఆమెను ఆదివారం సొంత గ్రామానికి చెందిన ఇద్దరు కలిశారు. ఆమె తల్లి తీవ్ర అనారోగ్యంతో ఉన్నదని చెప్పారు. దీంతో వారితోపాటు ఆశ్రమంలోని ఇద్దరు అనుచరులతో కలిసి ఆదివారం కారు లో స్వగ్రామానికి బయలుదేరారు. బీహార్‌లోని ఫుల్‌చోడ్ గ్రామం సమీపంలో రాత్రి వేళ కారులోని నలుగురు కలిసి సాధ్విపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యశోదా దేవి తెలిపారు.


## బ్రెయిన్ స్ట్రోక్‌ని ఎలా ఎదుర్కోవాలి?

**స్ట్రోక్ అంటే ఏమిటి?**
మెదడులోని కొంత భాగానికి రక్త సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు లేదా సరఫరా తీవ్రంగా తగ్గినప్పుడు, ఆక్సిజన్ మరియు పోషకాలు మెదడు కణాలకు అందనప్పుడు అలా జరిగిన కొద్ది నిమిషాల్లో మెదడు కణాలు చనిపోతాయి. ఈ స్థితిని బ్రెయిన్ స్ట్రోక్ అంటారు

**స్ట్రోక్ రావడానికి గల కారణాలు ఏమిటి ?**
వృద్ధాప్యం, అనారోగ్యకరమైన ఆహారం, పొగాకు వాడకం, శారీరక వ్యాయామం లేకపోవడం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఉబకాయం, డయాబెటిస్, గుండె జబ్బులు మరియు వాస్కులర్ కాగ్నిటివ్ బలహీనత స్ట్రోక్ కి ప్రధానమైన కారణాలు, ముఖ్యంగా రక్తపోటు, ధూమపానం, కొలెస్ట్రాల్ మరియు డయాబెటిస్ వంటివి నియంత్రించుకోవడం వల్ల స్ట్రోక్ రాకుండా వుండే అవకాశం ఉంది.

**స్ట్రోక్‌ని నిర్ధారించటం ఎలా?**
చాలా సందర్భాల్లో తప్ప అనేక స్ట్రోక్‌లలో లక్షణాలు మరియు స్ట్రోక్ వచ్చే సంకేతాలు ఉంటాయి. స్ట్రోక్ లక్షణాలు.... ముఖం, చేయి లేదా కాలు ఆకస్మికంగా బలహీనపడడం లేదా తిమ్మిరి రావడం, చాలా తరచుగా శరీరం యొక్క ఒక వైపు 90% స్ట్రోక్‌లలో సంభవిస్తుంది. ఇతర లక్షణాలు... గందరగోళం లేదా మాట్లాడటంలో ఇబ్బంది, ఒకటి లేదా రెండు కళ్ళతో చూడటంలో ఇబ్బంది, నడకలో ఇబ్బంది, మైకము మరియు సమన్వయం కోల్పోవడం, తెలియని కారణం లేని తీవ్రమైన తలనొప్పి, మూర్ఛ లేదా అపస్మారక స్థితి కలిగి ఉంటారు.

**స్ట్రోక్ లో ఎన్ని రకాలు కలవు?**
మెదడు నాళాలలో రక్త ప్రవాహాన్ని నిరోధించబడడం లేదా రక్తస్రావం వల్ల కలిగే స్ట్రోక్ ను ఇస్కీమిక్ స్ట్రోక్ అంటారు. మెదడు లో రక్త నాళాలలో ప్రవాహం నిరోధించబడినప్పుడు లేదా ఇరుకైనప్పుడు 85% ఇస్కీమిక్ స్ట్రోక్ అంటారు. మెదడు నాళాలు స్రావం అయినప్పుడు లేదా చీలిక ఏర్పడ్డప్పుడు ఇంట్రాసెరెబ్రల్ హెమరేజ్, సబ్‌రాచ్నోయిడ్ హెమరేజ్ లేదా సబ్/ఎపిడ్యూరల్ హెమరేజ్ (మెదడు యొక్క మెనింజల్ పొరలలో రక్తస్రావం) అయినప్పుడు రక్తస్రావం 15% స్ట్రోక్ వస్తుంది. మెదడు సిరల వ్యవస్థలో రక్తం గడ్డకట్టి అడ్డుపడటం వల్ల సిరల స్ట్రోక్ వస్తుంది.

**స్ట్రోక్‌ను నిర్ధారించడానికి మరియు చికిత్స చేయడానికి ఏ పరీక్షలు చేస్తారు?**
స్ట్రోక్ క్లినికల్ ప్రెజెంటేషన్ ద్వారా మరియు మెదడు వాస్కులర్ ఇమేజింగ్‌తో పాటు మెదడు ను సిటి స్కాన్ చేయడం ద్వారా లేదా ఎంఆర్ఐ చేయడం ద్వారా నిర్ధారించబడుతుంది. క్లాట్ బస్ట్ ట్రీట్మెంట్ లేదా ఎండోవాస్కులర్ ట్రీట్మెంట్ ప్రారంభించడానికి చేసిన ఇతర రక్త పరీక్షలలో మెదడులోని గడ్డ కట్టే ప్రదేశానికి ఎండోవాస్కులర్గా తో పంపిణీ చేయబడిన పరికరం ద్వారా గడ్డ కట్టిన రక్తం తొలగించబడుతుంది.

**స్ట్రోక్ చికిత్సకు గల చికిత్స విధానాలు.**
స్ట్రోక్ అనేది ఒక అత్యవసర వైద్య పరిస్థితి. సత్వర చికిత్స చాలా ముఖ్యం. వీలైనంత త్వరగా చికిత్సను అందించడం వల్ల మెదడు దెబ్బతినడం వంటి సమస్యలను తగ్గించగలదు. మంచి విషయం ఏమిటంటే స్ట్రోక్‌లకు చికిత్స చేయవచ్చు మరియు స్ట్రోక్ యూనిట్ 14%, క్లాట్ బస్ట్ థెరపీ 30% మరియు ఎండోవాస్కులర్ థెరపీ 50% తో మంచి ఫలితాలు కలవని అనేక క్లినికల్ అధ్యయనాలలో, మరియు వైద్య పరిశోధనల ద్వారా వివరించబడింది. స్ట్రోక్ లక్షణాలు మరియు సంకేతాలు ఎప్పుడు ప్రారంభమయ్యాయో గమనించండి ఎందుకంటే సమయం తక్కువగా ఉంటే 4.5 గంటల క్లాట్ బస్టింగ్ చికిత్స మరియు 4.5 గంటలకు మించి ఎండోవాస్కులర్ (మెకానికల్ థ్రోంబెక్టమీ) చికిత్స ఇస్కీమిక్ స్ట్రోక్ ప్రాణాలతో మెరుగైన ఫలితాలు ఉంటాయి.

**ఎండోవాస్కులర్ థెరపీ/ మెకానికల్ థ్రోంబెక్టమీ అంటే ఏమిటి?**
ఇస్కీమిక్ స్ట్రోక్‌లో ఎండోవాస్కులర్ చికిత్సలో మెదడులోని గడ్డ కట్టిన ప్రాంతంలో కి ప్రత్యేక పరికరాన్ని పంపి క్లాట్‌ని తొలగిస్తారు. అత్యాధునిక టెక్నాలజీ అయిన ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ తో మెకానికల్ థ్రోంబెక్టమీలో శిక్షణ పొందిన వైద్య నిపుణులతో స్ట్రోక్ చికిత్స చేయవచ్చు.



**Dr. Mohammed Ateequr Rahman**
MBBS, MD (Gen. Medicine), DNB (Neurology),
FINS (Interventional Neurology & Stroke),
FINR( Interventional Neuroradiology).
**Consultant Interventional Neurologist**

మరిన్ని వివరాల కోసం సంప్రదించండి: 9000 900 773

E-ONE CITIZENS EMERGENCY CARE 67 19 20 21 24x7 Availability of Emergency Specialists

నల్లగండ్ల, హైదరాబాద్
ఫోన్: 040 6719 1919
www.citizenshospitals.com

CITIZENS SPECIALTY HOSPITAL

నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 29 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



# హైలెస్సో.. హైలెస్సా

ఏలో యాలా ఏలో యాలా హైలెస్సో
హైల పట్టు హైలెస్సా బల్లాకట్టు హైలెస్సా
అద్దిర బాబు హైలెస్సా అక్కడ పట్టు హైలెస్సా
సన్నాజాజి చీరకట్టి సిన్నాదొచ్చి హైలెస్సా
కన్నూగొట్టే హైలెస్సా...
తన్నానన్న తన్నన తన్నానన్నా హైలెస్సా

**హైలెస్సో.. హైలెస్సా.. ఎత్తర లంగరు హైలెస్సా.. వెయ్యరతెడ్లు హైలెస్సా.. తొయ్యరా నావా హైలెస్సా.. అంటూ నల్లబంగారు నేల గోదావరిఖని సమీప గోదారమ్మా కొత్త పాటందుకుంది. తన ఒడిలో ఉరకలేస్తున్న ఉత్సాహంతో తెప్పలపై సాగిపోతున్న ధీరులను చూసి మురిసిపోయింది. సింగిడి రంగుల్లా సప్తవర్ణశోభితంగా అలంకరించిన తనను తానూ చూసుకుని పరవశించిపోయింది. నిండు గర్భిణిలా ఉప్పొంగుతున్న తన చుట్టూ చేరి ఆనందంతో గంతులేస్తున్న బిడ్డల చూసి పసుపు కుంకుమలతో సారె పోసినంత సంబురపడింది. ఎన్నాళ్లుగానో ఎడారిగా మారిన గోదావరి కాళేశ్వరంతో పునర్జీవం పోసుకుని తెలంగాణలోనే తొలిసారి రెగట్టా పోటీలకు వేదికైంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఇటీవల నిర్వహించిన రెగట్టా పోటీలు విజయవంతం కావడంతో సిరుల సింగరేణి గోదావరి మాగాణి పర్యాటక రంగంలో మణిపూస కానున్నది.**

**పవిత్ర** గోదావరి పయనించిన ప్రతిచోట పల్లెలెల్లా మల్లెలాయేరా..ప్రతి పల్లె పచ్చనాయేరా.. అంటూ గోదావరి పరీవాహ ప్రాంత ప్రజలు ఆనందంతో పాడుకుంటుంటారు. ఆ గోదావరినే నిలువెల్ల ఖనిజాలను నింపుకుని తెలంగాణలో నల్లబంగారానికి పురుడుపోసింది. తలాపున గోదావరి, కడుపున బొగ్గును నిలుపుకున్న గోదావరిఖని తన పేరును సార్థకం చేసుకున్నది.

### నాడు ఎడారి..నేడు నిండు గోదారి

తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తొలి అడుగు పెట్టిన గోదావరి అడవి మల్లెల్లాంటి పల్లెలను చుట్టి గోదావరిఖనిలోకి ప్రవేశిస్తుంది. పట్టణాన్ని ఆనుకునే ప్రవహిస్తూ అనేక ఏండ్లుగా చల్లని 'గంగ'మ్మ గా ఈ ప్రాంత ప్రజలతో పూజలందుకుంటున్నది. పండుగైనా, వేడుకైనా, చావైనా, బతుకైనా అన్నింటికీ తొలి స్నానం గంగలోనే అనేంతగా ఇక్కడి ప్రజలతో మమేకమైంది. అలాంటి గోదావరి గడచిన కొన్నేండ్లుగా సరైన వర్షాలు లేక, పై భాగంలో ప్రాజెక్టుల మూలంగా చిన్నచిన్న పాయలుగా తప్ప నిండుగా ప్రవహించిన దాఖలాలు లేవనే చెప్పాలి. వేసవికాలంలోనైతే పూర్తిగా ఎండిపోయి ఇసుక మేటలు వేసేది. దీంతో పారిశ్రామిక ప్రాంత ప్రజలకు తాగునీరే కరువైన సందర్భాలు ఎన్నో. తలాపున గోదావరి పారుతున్నా ఎడారైన చేన్లు,చెలుకలు కోకొల్లలు. అలాంటి గోదావరి దాదాపు 40 ఏండ్ల తర్వాత నిండుగా, స్వచ్ఛంగా ప్రవహిస్తున్నది. దీనికంతటికీ కారణం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు. ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరి తన దిశను మార్చుకుని ప్రవహిస్తున్నది. దీంతో గోదావరినది సముద్రాన్ని తలపించేలా నిండు ప్రవాహన్ని అందుకున్నది. పైనుండి నీటి ప్రవాహం లేక ఎండి పాయల స్థాయికి కృశించుకుపోయిన గోదావరిని నిండు గోదారిలా చూస్తామని ఏనాడు అనుకోని ఈ ప్రాంత ప్రజలు తమ రెండు కళ్లను ఇప్పటికీ నమ్మలేకపోతున్నారు. గోదారి గోదారి ఓహో చుట్టూ నీళ్లు ఉన్న చుక్కదక్కని ఎడారి మా భూమి..అంటూ పాడుకున్న వారే నేడు 'నిండు గోదారి కదా ఈ నేల'..అంటూ మురిసిపోతున్నారు.

### చారిత్రక ఘట్టానికి వేదిక

కాళేశ్వరం నీటితో నిండుకుండలా ఇరువైపులా కన్నుల నిండుగా ప్రవహిస్తున్న గోదావరిని చూసిన స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు మనసులో ఒక ఆలోచన తట్టింది. గోదావరిలో పడవపోటీలు నిర్వహిస్తే ఎలా ఉంటుంది అని. తెలంగాణలో పడవల వాడకం తక్కువనే చెప్పాలి. అయితే ఇక్కడి చెరువుల్లో, నదుల్లో చేపలు పట్టడానికి మత్స్యకారులు తెప్పలను వినియోగించడం అనేక సంవత్సరాలుగా ఉన్నది. అందుకే తెప్పల పోటీల నిర్వహణకే మొగ్గుచూపారు. పోటీకి ముందే గోదావరిలో ఈ పోటీల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై పూర్తిస్థాయిలో పరిశీలించి అన్నీ అనుకూలమని నిర్ధారించుకున్న తర్వాత సెప్టెంబర్ 29 ఆదివారం రోజున పోటీల నిర్వాహణ తేదీని ప్రకటించారు.



వీటికి 'తెలంగాణ మత్స్యవీర కేసీఆర్ తెప్పల పోటీలు' అని పేరు పెట్టారు. ఏ ఇరవై మందో యాభై మందో పోటీలకు వస్తారని ఊహించిన నిర్వాహకులకు ఆశ్చర్యపోయేలా పెద్దపల్లి, మంచిర్యాల, భూపాలపల్లి, జగిత్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల నుండి 214 మంది మత్స్యకారులు హాజరైనారు. గోదావరిఖని స్థానికుడు, ఒకప్పటి సింగరేణి కార్మికుడైన రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జెండా ఊపి ఈ పోటీలను ప్రారంభించారు.

### పోటీలు జరిగిందిలా...

పోటీలకు వచ్చిన 214 మందిని తొమ్మిది జట్లుగా విభజించి ఒక్కో జట్టులో 25 మంది ఉండేలా ప్రతి ఒక్కరికి నంబర్ కేటాయించారు. ప్రతి జట్టులో తొలిస్థానంలో నిలిచిన వారిని ఎంపిక చేసి వారందరికీ ఫైనల్ పోటీలు నిర్వహించారు. గోదావరినది అవతలిగట్టునుంచి ఇవతలకు, ఇవతల నుండి అవతలకు దాదాపు మూడు కిలోమీటర్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఎవరైతే తక్కువ సమయంలో లక్ష్యాన్ని చేరుకుంటారో వారిని విజేతలుగా నిర్ణయించారు. మంచిర్యాలకు చెందిన ఆరుగట్ల శ్రీనివాస్ కేవలం11.57 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకుని విజేతగా నిలవగా, పిట్టల వెంకటేశ్, ఆరుగట్ల రాజేష్‌లు తర్వాతి రెండు స్థానాల్లో నిలిచారు. వీరికి రూ.20వేలు, రూ.10వేలు, రూ.5 వేలు నగదుతోపాటు జ్ఞాపికలను అందించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఈ పోటీలు పారిశ్రామిక ప్రాంతానికి కొత్త గుర్తింపును తీసుకువచ్చాయి. వేలాదిగా ప్రజలు పాల్గొని తాము కేరళలోనో, కోనసీమలోనో ఉన్న అనుభూతిని పొందడంతోపాటు పోటీలు జరుగుతున్నంత సేపు పోటీదారులను ప్రోత్సహిస్తూ కేరింతలతో ఉత్సాహపరిచారు.

### పర్యాటకానికి కొత్త వేదిక

తెలంగాణలోనే తొలిసారి గోదావరిలో రెగట్టా పోటీలు నిర్వహించిన విషయాన్ని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆనందం వ్యక్తం చేయడంతోపాటు ఎమ్మెల్యేను అభినందించి ప్రతియేడాది పోటీల నిర్వహణను పరిశీలించాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశంతో గోదావరిఖనికి చేరుకున్న అధికారులు గోదావరినది పరిసరాలు పరిశీలించడంతోపాటు పోటీలు జరిగిన ప్రాంతాన్ని, పోటీలు నిర్వహించిన విధానాన్ని స్థానికులను అడిగి తెలుసుకుని ఒక నివేదిక తయారు చేశారు. అది సంబంధిత పర్యాటక శాఖమంత్రికి ,ముఖ్యమంత్రికి ఇవ్వనున్నారు. అన్నీ అనుకూలిస్తే ప్రతి యేడాది గోదావరినది రెగట్టా పోటీలకు తెలంగాణలోనే తొలివేదిక కానుందనడంలో సందేహం లేదు.

... మధుకర్ వైద్యుల







### చారిత్రాత్మకం

తెలంగాణలో అందులోను గోదావరిఖని గోదావరినదిలో తెప్పల పోటీలు నిర్వహించే రోజులు వస్తాయని ఎన్నడూ ఊహించలేదు. నదులు, నీళ్లు, మత్స్యసంపద అంటే ఆంధ్ర ప్రాంతమని పేరుండేది. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎడారిలాంటి గోదావరి సముద్రంగా మారింది. తెలంగాణలో కూడా తెప్పల పోటీలు నిర్వహించడం చారిత్రాత్మకం. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషివల్లే ఇది సాధ్యమైంది. కాళేశ్వరం నుంచి శ్రీరాంసాగర్ వరకు 250 కిలోమీటర్ల గోదావరి నదిని బ్యారేజీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే. తాగునీరు, సాగునీరు, మత్స్యసంపదకు కొదవలేకుండా చేశారు. ఈ ప్రాంతాన్ని టూరిస్టు హబ్‌గా అభివృద్ధి చేస్తాం. గోదావరినదిలో బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం.

–కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర సంక్షేమశాఖమంత్రి



### ప్రతి ఏడాదీ పోటీలు

ఒకప్పుడు తాగడానికే నీరులేని పరిస్థితి నుంచి ఏడాదంతా నిండుకుండలా ఉండే గోదావరిని కేసీఆర్ సాధ్యం చేశారు. ఆయన రాష్ట్రానికి అపరభగీరథుడు. కేసీఆర్ పేర పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది. తెలంగాణ రాష్ట్రానికి జలకళను తెచ్చిన ఘనత కేసీఆర్‌దే. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలను కలుపుతూ నియోజకవర్గాన్ని టూరిజం హబ్‌గా చేసేందుకు కృషి చేస్తాం. భవిష్యత్‌లో పర్యాటక శాఖ సహకారంతో ప్రతి ఏడాది తెప్పల పోటీలు నిర్వహించే ఏర్పాట్లు చేస్తాం.

–కోరుకంటి చందర్, ఎమ్మెల్యే, రామగుండం

## మైక్రోగ్రీన్స్‌తో పోషకాహారం




పిల్లలకు మార్కెట్లో దొరికే (విష పూరితమైన ) ఆహారానికి బదులు పోషకాహారాన్ని అందివ్వడానికి ప్రతి తల్లీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నది. వారిలో స్వాతి జైన్ కూడా ఒకరు. తక్కువ సమయంలోనే పండించి వాటినే పిల్లలకు ఆహారంగా పెడుతున్నది. దీనిని ఇతరులకు నేర్పుతున్నది.



ఢిల్లీకి చెందిన స్వాతి జైన్‌కు పాప పుట్టింది. అక్కడ కాలుష్యం కారణంగా మార్కెట్లో దొరికే కూరగాయలు, పండ్లు రసాయన రహితంగా ఉన్నాయని హామీ ఇవ్వలేము. వీటిని నేరుగా తినడం వల్ల పాప అనారోగ్యం బారిన పడడం ఖాయమనుకున్నది. ఆహారానికి కావాల్సిన కూరగాయలను తనే స్వయంగా పెంచుకోవాలని నిర్ణయించుకున్నది. ఇందుకు సరైంది మైక్రోగ్రీన్స్ అని నిర్ణయించుకున్నది. పట్టణాల్లో ఖాళీ ప్రదేశం లేనందువల్ల ఇంట్లోని బాల్కనీలోనే చిన్న టబ్బులు పెట్టి, తక్కువ సమయంలోనే మైక్రోబీన్స్‌ను పండిస్తున్నది. ఆవాలు, మెంతులు, నువ్వులు, వీట్‌గ్రాస్ మొదలైన వాటిని మొలకలుగా మైక్రోగ్రీన్స్ పండిస్తున్నది. పండ్లు, కూరగాయల కంటే 50 శాతం పోషకాలు మైక్రోగ్రీన్స్‌లో ఉంటాయి. ఇవి సుమారు రెండు అంగుళాలు పరిమాణంలో పెరుగుతాయి. మొక్క నుంచి కత్తిరించిన వీటిని మూడు గంటలలోపే తినేయాలి. టమాటాలు, మిరపకాయలు, వంకాయ వంటి కూరగాయలను ఈ పద్ధతిలో పండిస్తే విషపూరితమయ్యే అవకాశం ఉందని స్వాతి చెబుతున్నది. అందుకని ఇంట్లోనే సాగుచేసుకుంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవచ్చు అని అంటున్నది. ఈ విధంగా స్వాతి నెలకు 500 మైక్రోగ్రీన్ కుండీలను అమ్ముతున్నట్లు చెప్పుకొచ్చింది. మైక్రోగ్రీన్స్‌ను పెంచడం అందరికీ సాధ్యం కాదు. అందుకు తగిన శిక్షణ ఉండాలంటున్నది. మైక్రోగ్రీన్స్‌పై ఇతరులకు అవగాహన కలిగించేందుకు వర్క్‌షాపులు నిర్వహిస్తున్నది.

**అడుగండి చెబుతా**



నాకు 55 సంవత్సరాలు. మూడేళ్ల క్రితం నాకు హెపటైటిస్ బి వచ్చిందని చెప్పారు. దానికి మందులు వాడుతున్నాను. ఈ మధ్య స్కాన్ చేస్తే కాలేయంలో గడ్డ ఉందనీ, ఆపరేషన్ చేయాలనీ చెప్పారు. నాకు కాలేయంలో క్యాన్సర్ వచ్చిందా? ఇప్పుడు నన్ను ఏం చేయమంటారు?

– వెంకటయ్య, జగిత్యాల

## కాలేయంలో గడ్డ.. క్యాన్సరేనా ?

**మీ**రు చెప్పిన దాన్ని బట్టి చూస్తే మీకు కాలేయంలో వచ్చిన గడ్డ క్యాన్సర్ (హెపటో సెల్యులర్ క్యాన్సర్) అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. దీన్ని నిర్ధారించడానికి ఆల్ఫా ఫీటో ప్రొటీన్ అనే రక్తపరీక్ష, ట్రై ఫేసిక్ సిటి స్కాన్ లాంటి పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. వీటివల్ల ఆ గడ్డ క్యాన్సర్ గడ్డనా కాదా అనేది తెలుస్తుంది. ఎన్ని కణుతులు, ఎక్కడెక్కడ ఉన్నాయో కూడా తెలుస్తుంది. అంతకుముందు కాలేయం సిర్రోసిస్ స్టేజ్‌లోకి వెళ్లిందా లేదా తెలుసుకోవడానికి ఎండోస్కోపీ లాంటి పరీక్షలు కూడా అవసరమవ్వొచ్చు. ఒకవేళ మిగతా కాలేయం బాగానే ఉండి క్యాన్సర్ గడ్డ చీము స్టేజ్‌లో ఉంటే ఆ కాలేయ భాగాన్ని తొలగించడానికి హెపటెక్టమీ చేస్తారు. గడ్డ ఉన్న స్థానాన్ని బట్టి కాలేయంలోని కుడి లేదా ఎడమ పక్క లేదా మధ్యలోని భాగాన్ని తొలగిస్తారు. కాలేయం చెడిపోయి సిర్రోసిస్ దశలో ఉన్నట్టయితే కాలేయ మార్పిడి అవసరం అవుతుంది. క్యాన్సర్ గడ్డ పెద్దగా ఉండి, ఇతర భాగాలకు పాకితే కీమోథెరపీ మాత్రమే ఇస్తారు. అసలు మీకు క్యాన్సర్ అవునో కాదో తేల్చుకోవడానికి ముందు చెప్పిన పరీక్షలు చేయించుకుని తరువాత దానికి అనుగుణమైన చికిత్స తీసుకుంటే సరిపోతుంది. ఒకవేళ క్యాన్సర్ అయినా ఆందోళన చెందవద్దు. మీరు వెంటనే ఒక సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ను కలవండి.



**డాక్టర్ విమలాకర్ రెడ్డి**
సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్
సన్‌షైన్ హాస్పిటల్స్
హైదరాబాద్

## పెసరపిండితో పసిడికాంతి

**పెసర్లు ఆరోగ్యానికే కాదు.. అందానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. పెసర పిండితో ముఖ సౌందర్యాన్ని పెంచుకోవడం, జుట్టు రాలకుండా ఆపడం, జుట్టు అందంగా కాంతివంతంగా ఎలా ఉంచుకోవచ్చో తెలుసుకోండి.**

- 50 గ్రాముల పెసర్లను రాత్రి పడుకునే ముందు ఒక గిన్నెలో నానబెట్టుకోవాలి. ఉదయం లేచిన తర్వాత పిండిగా చేసుకొని ఇందులో ఒకస్పూన్ తేనె, ఒక స్పూన్ ఆల్మండ్ ఆయిల్ కలిపి మిక్స్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖంపై రాసుకొని 15 నిమిషాల తర్వాత క్లీన్ చేసుకుంటే ముఖం మెరిసిపోతుంది.
- ఒక గిన్నెలో రెండు స్పూన్ల నిమ్మరసంలో ఒక స్పూన్ పెసరపిండి కలిపి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖంపై ప్యాక్‌గా వేసుకొని 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో క్లీన్ చేసుకుంటే ముఖం మెరిసిపోతుంది.
- 100 గ్రాముల పెసర్లను రాత్రి నీటిలో నానబెట్టి ఉదయం పిండిగా చేసుకోవాలి. రెండు టేబుల్ స్పూన్ల గంధపు పొడి, 2 టేబుల్ స్పూన్ల ఆరెంజ్ తొక్కల పొడిని కలుపుకోవాలి. ఆ తర్వాత పాలు పోసి మిక్స్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖంపై మర్దన చేసుకోవాలి. ఇలా చేస్తే అవాంఛిత రోమాలు తొలగిపోతాయి.
- జుట్టు రాలడం ప్రతి ఒక్కరిలో ఓ సమస్య. ఒక స్పూన్ పెసరపిండిలో రెండు స్పూన్ల ఉసిరి రసం కలిపి తలపై రాసుకొని ఒక అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే క్రమంగా జుట్టు రాలడం తగ్గుతుంది. జుట్టు పెరిగేలానూ చేస్తుంది.



## అంధుల జీవితాల్లో వెలుగులు!

**అంధులకు ఉపాధి అందించడం కోసం ఓ సంస్థ శ్రీకారం చుట్టింది. 75 యేండ్లుగా వారిలో ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తూ.. జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతున్నది.**



**ఢి**ల్లీకి చెందిన 'బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్' అంధులకు పలు వస్తువుల ఉత్పత్తిలో శిక్షణ ఇచ్చి ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తున్నది. తయారు చేసిన వస్తువులను అమ్మడం ద్వారా వారికి ఆర్థిక స్వావలంబన చేకూరుస్తున్నది. ప్రతిఏటా రూపొందించిన పలురకాల ఉత్పత్తులతో ఢిల్లీలోని లాల్‌బహదూర్‌శాస్త్రి మార్గ్ సమీపంలోని మైదానంలో 'బ్లైండ్ స్కూల్ దీపావళి మేళా' నిర్వహిస్తుంటారు. 1980 నుంచి ఈ మేళా పెద్ద ఎత్తున జరుగుతున్నది. బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్ ద్వారా శిక్షణ పొందిన అంధులు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ అమ్ముతుంటారు. అవి విక్రయించగా వచ్చిన మొత్తాన్ని దృష్టిలోపం ఉన్న వారి సంక్షేమం కోసం ఖర్చు చేస్తుంటారు. అసోసియేషన్‌లో కేవలం ఉపాధి కల్పించడమేకాకుండా వారికి వ్యక్తిత్వ వికాసం, ఇంగ్లిష్‌తోపాటు కంప్యూటర్ శిక్షణ, పలు వృత్తిపరమైన కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆడియో బుక్స్ ద్వారా వారికి జాతీయ, అంతర్జాతీయ విషయాలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తున్నారు. 'బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్' ద్వారా ఎంతోమందికి పునరావాసం కల్పిస్తున్నామని ఆ సంస్థకు చెందిన మేనేజర్ కరణ్‌జోహార్ చెబుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతోమంది అంధులు తమ సంపాదనతో హాయిగా గడుపుతున్నారని ఆయన అంటున్నారు. ఘజియాబాద్‌కు చెందిన మహమ్మద్ షకీబ్‌ఖాన్ మైక్‌లో బహిరంగంగా మాట్లాలంటే చాలా భయపడేవారు. ఇక్కడ శిక్షణ పొందిన తర్వాత అతనిలో చాలా మార్పువచ్చిందట. నర్సరీ నుంచి ఇంటర్‌మీడియట్ వరకు అంధుల కోసం ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేసి విద్యాబోధన చేస్తున్నారు. 'ఇక్కడ నాకు పెద్ద కుటుంబం ఉన్నది. అందరం కుటుంబ సభ్యుల్లా కలిసిపోతాం. ఎవరికి ఏ సమస్యలున్నా పంచుకుంటూ అవసరమయిన సలహాలు ఇచ్చిపుచ్చుకుంటామని' జ్యోతిప్రజాపతి చెబుతున్నారు. దృష్టిలోపం ఉన్న వారికి అనేక అంశాల్లో శిక్షణ ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న 'బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్'ను అందరూ ప్రశంసిస్తున్నారు.

II.
నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[ కరీంనగర్ ]
మంగళవారం 29 అక్టోబర్ 2019

అక్టోబర్ 29న
వరల్డ్ స్ట్రోక్ డే



ఎంత చెట్టుకు అంత గాలి... అది ఒకప్పటి సామెత. ఎంత చెడ్డ అలవాట్లుంటే అన్ని రోగాలు.. ఇది ఇప్పటి మాట. మారిన ఆహార పద్ధతులు, చిన్నవయసులోనే మొదలుపెడ్తున్న దురలవాట్లు.. వెరసి.. ఎప్పుడో 60 దాటాక వచ్చే జబ్బులు కూడా ఇప్పుడు పాతికేళ్ల వయసులోనే వచ్చిపడుతున్నాయి. అలాంటి వ్యాధుల సరసన పోటీ పడుతున్న జబ్బు పక్షవాతం. అవును.. చిన్నవయసులోనే ఇప్పుడు పక్షవాతం బారిన పడుతున్నవాళ్ల సంఖ్య ఎక్కువవుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు, అంగ వికలత్వానికి రెండో కారణంగా మారింది పక్షవాతం. అయితే పక్షవాతం బారిన పడ్డామని కుంగి పోనవసరంలేదు. త్వరగా హాస్పిటల్ చేరితే పక్షవాతం వచ్చినా కూడా ఎప్పటిలా నడిచే వీలు ఇప్పుడుంది. నేడు వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా పక్షవాతానికి ఉన్న కొత్త చికిత్సల గురించి..

# బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇక భయం లేదు!

**ఒకప్పుడు..** పక్షవాతం అంటే ఇక అతని పని అయిపోయింది.. ప్రాణం పోయేవరకు మంచానికి అతుక్కుపోవడమే అని అనుకునేవాళ్లు. ఇంట్లో పక్షవాతం వచ్చిన రోగి ఉంటే కుటుంబమంతటి పైనా ఆ ప్రభావం ఉంటుంది. అందుకే పక్షవాతం అంటే చాలు.. ఆందోళన కలుగుతుంది. అయితే పక్షవాతం వచ్చిన వాళ్లకు వెనువెంటనే చికిత్స అందించగలిగితే వాళ్లను ఎప్పటిలా పనులు చేసుకునేట్టుగా చేయడం ఇప్పుడు సాధ్యమవుతున్నది. పక్షవాతం ఏ వయసులోనైనా రావొచ్చు. అందుకే పక్షవాతం లక్షణాలు, చికిత్సల గురించి అవగాహన పెంచుకుని సకాలంలో గుర్తించి, చికిత్స తీసుకోవాలి.



### పక్షవాతం ఎలా వస్తుంది?

శరీరంలోని కణాలన్నీ ఆరోగ్యంగా ఉండాలంటే కణ కణానికీ నిరంతరం రక్తం సరఫరా కావాలి. మెదడు లోని కణాలు కూడా అంతే. ఏ కారణం చేతనైనా మెదడుకు తగినంత రక్తం అందకపోతే ఆయా కణాలు దెబ్బతిని చనిపోతాయి. ఇలా రక్తం అందకపోవడానికి ప్రధానంగా రెండు రకాల కారణాలున్నాయి.

**ఇస్కిమిక్ స్ట్రోక్ :** మెదడుకు మొత్తం నాలుగు రక్తనాళాలు వెళ్తాయి. ఇందులో రెండు రక్తనాళాలు ఎడమవైపు మెదడుకి, రెండు కుడివైపు మెదడుకి వెళ్తాయి. ఈ రక్తనాళాల్లో ఎక్కడైనా రక్తం గడ్డకడితే అది రక్తప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది. దాంతో మెదడుకు రక్తసరఫరా సరిగా జరుగక పక్షవాతం వస్తుంది. దాదాపు 80 శాతం కేసుల్లో ఇదే కారణం.

**హెమరేజిక్ స్ట్రోక్ :** రక్తనాళాల్లో ఏదైనా చిట్లిపోయి, రక్తం బయటకు రావడంతో మెదడులోని కణాలు దెబ్బతింటాయి. ఇలాంటప్పుడు వచ్చే పక్షవాతం ఇది. దాదాపు 20 శాతం పక్షవాతం కేసులకు ఇదే కారణం.



## మొబైల్ స్ట్రోక్ యూనిట్స్

చాలాదేశాల్లో పక్షవాతానికి త్వరగా చికిత్స అందించేందుకు ప్రత్యేకమైన అంబులెన్స్ యూనిట్లు ఉంటాయి. వీటిని మొబైల్ స్ట్రోక్ యూనిట్స్ అంటారు. ఈ అంబులెన్స్ లోనే సిటి స్కాన్, డాక్టర్, నర్సు అందరూ ఉంటారు. పేషెంటు దగ్గరికి వెళ్లగానే అదే అంబులెన్సులో సిటి స్కాన్ చేసి, అక్కడే ఇంజెక్షన్ ఇస్తారు. ఇలాంటి యూనిట్లను ఇక్కడ కూడా ప్రారంభించే ఆలోచన ఉంది. అయితే మన దగ్గరి మొబైల్ స్ట్రోక్ యూనిట్‌లో సిటిస్కాన్‌ను ఉంచలేం. అందువల్ల పేషెంట్‌ను సిటిస్కాన్ చేయించుకుని రిపోర్ట్ వాట్సప్‌లో పంపమని చెప్తాం. ఈలోపు అంబులెన్స్ పేషెంట్ దగ్గరికి చేరుకుంటుంది. అక్కడే వెంటనే ఇంజెక్షన్ చేసేసి హాస్పిటల్‌కి తరలిస్తారు. పేషెంట్ హాస్పిటల్ దాకా వచ్చే టైం సేవ్ అవుతుంది.

...యేళ్లు దాటకుండానే పక్షవాతానికి గురవుతున్నారు. ఇలాంటి జీవనశైలి సంబంధిత కారణాలతో పాటు జన్యుపరమైన కారణాలు కూడా పక్షవాతం రావడానికి దోహదపడుతాయి.

పక్షవాతానికి మరో కారణం డైసెక్షన్. దీనిలో రక్తనాళం లోని రెండు పొరలు విచ్చుకుంటాయి. సాధారణంగా రక్తనాళంలో 3 పొరలుంటాయి. వీటిలోమొదటి రెండు పొరలు ఓపెన్ అయిపోయి అందులోకి రక్తం వెళ్తుంది. దానివల్ల పక్షవాతం వస్తుంది. ఎక్కువగా మసాజ్ చేయించుకోవడం, లాంగ్ డ్రైవ్ చేయడం, డ్రైవ్ చేస్తూ మెడ వెనక్కి తిప్పడం వల్ల రక్తనాళాలు ట్విస్ట్ అయిపోయి ఇలాంటి సమస్య రావొచ్చు. చిన్నారుల్లో గుండెజబ్బుల వల్ల పక్షవాతం వచ్చే అవకాశాలెక్కువ. ఆ తర్వాత సికిల్ సెల్ అనీమియా, మోయా-మోయా అనే వ్యాధి (దీనిలో రక్తనాళాలు సన్నగా అవుతాయి) లాంటివి చిన్నపిల్లల్లో పక్షవాతం రావడానికి కారణమవుతాయి.

## టైం.. అత్యంత కీలకం..!

నాడీకణాలు ఒకసారి చచ్చిపోతే ఇక కొత్త నాడీకణాలు ఏర్పడవు. కాబట్టి అవి నశించిపోకుండా చూసుకోవాలి. స్ట్రోక్ వచ్చినప్పుడు రక్తసరఫరా ఆగిపోయిన చోట ఉన్న కొన్ని కణాలు వెంటనే దెబ్బతింటాయి. నిమిష నిమిషానికీ ఇలా దెబ్బతినే కణాల సంఖ్య పెరుగుతూ పోతుంది. ఒక నిమిషానికి 7 బిలియన్ల న్యూరాన్లు చనిపోతాయి. అందుకే పక్షవాతం వచ్చినప్పుడు ప్రతీ నిమిషం కీలకమైనదే.



బ్లాక్ దగ్గర ఉన్న కణాల చుట్టూ కొంతమేర ఉండే కణజాలాన్ని పెనెంబ్రా అంటారు. దీన్ని రిస్క్‌లో ఉన్న కణజాలంగా పరిగణిస్తారు. ఈ కణజాలం ఎంత ఎక్కువ భాగం డ్యామేజి అయితే అంత ఎక్కువ నష్టం ఉంటుంది. టైం దాటిపోతున్న కొద్దీ చికిత్స ఫలితం వేరుగా ఉంటుంది. రిస్క్ కణజాలం మొత్తం డ్యామేజి అయితే ఏ చికిత్సా చేయలేం. అందుకే పక్షవాతం వచ్చినప్పుడు ఎంత తొందరగా హాస్పిటల్‌కి తీసుకొస్తే అంత మంచిది.

### ఎందుకు వస్తుంది?

పక్షవాతం రావడానికి ప్రధాన కారణం అధిక రక్తపోటు. మధుమేహం కూడా కారణమవుతుంది. బీపీ, మధుమేహం ఇంతకు ముందైతే అరవయ్యేళ్ల వయసులో కనిపించేవి. కాని ఇప్పుడు మూడు పదుల్లోనే కనిపిస్తున్నాయి. అందుకే పక్షవాతం కూడా ఈ వయసువాళ్లలో ఎక్కువగా కనిపిస్తోంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకుండా జంక్‌ఫుడ్‌కి అలవాటు పడడం, పబ్ కల్చర్ వల్ల స్మోకింగ్, ఆల్కహాల్ ఫ్యాషన్ అయిపోయాయి. డ్రగ్స్‌కు కూడా అలవాటు పడుతోంది నేటి యువత. ఇవన్నీ కూడా పక్షవాతానికి కారణమయ్యేవే. మరో ముఖ్య కారణం అధిక ఒత్తిడి. కార్పొరేట్ ఉద్యోగాలు పెరిగిన తరువాత చిన్న వయసులోనే అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దాంతో నిండా ముప్ప...

### పక్షవాతం వస్తే ఏమవుతుంది?

మెదడులోని నాడీ కణజాలానికి రక్తసరఫరాలో ఆటంకం ఏర్పడినప్పుడు ఆ కణాలకు పోషకాలు, ఆక్సిజన్ అందక అక్కడి కణాలు నశిస్తాయి. ఇలాంటప్పుడు ఏ నాడీకణజాలం మన శరీరంలోని ఏ పనిని నిర్వర్తిస్తుందో ఆ కణజాలం దెబ్బతినడం వల్ల ఆయా పనులు చేయలేకపోతాము. ఉదాహరణకు కాలు, చెయ్యి కదలికలను నియంత్రించే నాడీకణజాలానికి రక్తం అందక అది మరణిస్తే ఇక కాలు, చెయ్యి కదిలించలేము. మాటకు సంబంధించి పనిచేసే నాడీకణజాలం దెబ్బతింటే మాట పడిపోవడమో, సరిగా మాట్లాడలేకపోవడమో లాంటి సమస్యలు వస్తాయి. అదే విధంగా ఏ అవయవానికి సంబంధించిన నాడీకణజాలం దెబ్బతింటే ఆ అవయవం చచ్చుబడుతుందన్నమాట.

## వేగంగా స్పందిస్తే తప్పే పక్షవాతం ముప్పు

### ఎలా గుర్తించాలి?

- మాటలో తేడా రావడం, నత్తి
- మాట్లాడలేకపోవడం
- విన్నది అర్థం చేసుకోలేకపోవడం
- మూతి పక్కకి వెళ్లిపోవడం (ఫేషియల్ పెరాలిసిస్)
- ఒకవైపు చెయ్యి, కాలు బలహీనం కావడం
- ఒక కాలు లేదా ఒక చెయ్యి బలహీనం కావడం
- నడిస్తే అడుగులు తడబడడం
- ఒకరు ఇద్దరుగా కనిపించడం

ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సిటి స్కాన్ చేసి ట్రీట్‌మెంట్ మొదలుపెట్టాలి.

### చికిత్సతో బాగవుతుందా?

పక్షవాతం వచ్చినా నాలుగున్నర గంటల లోపు చికిత్స అందించగలిగితే శరీరం చచ్చుబడకుండా కాపాడవచ్చు. పక్షవాతానికి ఒకప్పుడు ట్రీట్‌మెంట్ లేదు. కానీ ఇప్పుడు గత 15 నుంచి 20 ఏళ్లుగా చికిత్స ఉంది. పక్షవాత లక్షణాలు కనిపించిన మొదటి నాలుగున్నర గంటలలోగా హాస్పిటల్‌కి వెళ్లి ట్రీట్‌మెంట్ మొదలుపెడితే అవకరాలు ఏర్పడకుండా ఉంటాయి. ప్రాణాపాయం తప్పుతుంది. హాస్పిటల్‌కి వెళ్లగానే మొదట సిటి స్కాన్ చేస్తారు. దీనిలో రక్తనాళం చిట్లి రక్తస్రావం కావడం వల్ల



పక్షవాతం వచ్చిందా లేక బ్లాక్ వల్ల వచ్చిందా అనేది తెలుస్తుంది. రక్తస్రావం వల్ల కాకుండా బ్లాక్ వల్ల వచ్చిన ఇస్కిమిక్ స్ట్రోక్ అయితే వెంటనే క్లాట్ కరగడానికి ఒక ఇంజెక్షన్ ఇస్తారు. ఇది టిష్యూ ప్లాస్మోజెన్ యాక్టివేటర్ (టిపిఎ) లేదా టెనెక్టిప్లేస్ ఇంజెక్షన్. ఇలా ఇంజెక్షన్ ఇవ్వడాన్ని థ్రాంబోలైటిక్ థెరపీ అంటారు. దీనివల్ల అప్పటివరకు చచ్చుబడిన భాగాల్లో మెరుగుదల ఉంటుంది. ఈ ఇంజెక్షన్ వల్ల రక్తసరఫరాకు ఆటంకంగా ఉన్న గడ్డ కరిగిపోయి రక్తనాళం తెరుచుకుంటుంది. దాంతో రక్తసరఫరా సాఫీగా జరుగుతుంది. ఫలితంగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న నాడీకణాలకు ఆక్సిజన్ అంది, ఇంప్రూవ్ అవుతాయి.

ఇంజెక్షన్ ఇచ్చినప్పటికీ రక్తనాళంలో గడ్డ కరగకుండా రక్తనాళం తెరుచుకోకపోతే, మెకానికల్ థ్రాంబెక్టమీ చేస్తారు. అంటే ఎండోవాస్కులర్ థెరపీ ద్వారా కెథటర్ పంపి, క్లాట్ తీసేస్తారు. ఇది 6 గంటలలోపు చేయాలి. కొందరిలో 24 గంటల లోపు కూడా చేయవచ్చు.

పక్షవాతం నుంచి కోలుకోవడానికి ఫిజియోథెరపీ అత్యంత ముఖ్యమైన చికిత్స. ఫిజియోథెరపీలో స్ట్రెంతెనింగ్ వ్యాయామాలు చేయిస్తారు. స్టిఫ్‌నెస్ పోవడానికి ఇంజెక్షన్లు ఇస్తారు. వాకింగ్ చేయిస్తారు. ఇలాంటి వాటివల్ల పక్షవాతానికి గురైన అవయవాలు శక్తిని పుంజుకుని, వాటి పనితీరు మెరుగుపడుతుంది. థ్రాంబోలైటిక్ థెరపీ ఇంజెక్షన్లు ప్రతి జిల్లాలోనూ జిల్లా స్థాయిలోనైనా అందుబాటులో ఉంటే అక్కడే వెంటనే చికిత్స ఇవ్వవచ్చు. వాళ్లు ఇక్కడివరకూ వచ్చే టైం మిగులుతుంది.



**డాక్టర్ కోమల్ కుమార్**
సీనియర్ న్యూరో ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్



## పక్షవాతానికి కొత్త ట్రీట్‌మెంట్

**2014 వ సంవత్సరం పక్షవాతం చికిత్సను కొత్త పుంతలు తొక్కించింది. పక్షవాతానికి గురైన పేషెంట్లకు అధునాతనమైన చికిత్సా పద్ధతిని అందుబాటులోకి తెచ్చింది. అదే.. థ్రాంబెక్టమీ. జనరల్ అనెస్తీషియా అవసరం లేని సర్జరీ ఇది. కేవలం లోకల్ అనెస్తీషియాతో పక్షవాతం వచ్చిన 24 గంటల్లోగా ఈ థ్రాంబెక్టమీ చేస్తే మంచి ఫలితాలుంటాయి.**

పక్షవాతంతో పోలిస్తే గుండెపోటు నుంచి బయటపడడం చాలా సులువు. గుండె ఎక్కడుంటుందో గుండెపోటు లక్షణాలు కూడా అక్కడే ఉంటాయి. కాని మెదడులో సమస్య వల్ల ఏర్పడే పక్షవాతం లక్షణాలు ఏ కాళ్లూ చేతుల్లోనో కనిపిస్తాయి. అందుకే పక్షవాతాన్ని తొందరగా గుర్తించలేకపోతారు. అంతే కాదు.. గుండెపోటుకు ఒక్క ఇసిజి చూసి అవసరమైన ట్రీట్‌మెంట్ కు సిద్ధం కావొచ్చు. కాని పక్షవాతం ఉన్నప్పుడు దానికి సిటి ఆంజియోగ్రామ్, సిటీ స్కాన్ లేదా ఎంఆర్ఐ ఆంజియోగ్రామ్, ఎంఆర్ఐ స్కాన్ చేస్తారు. వీటిలో ఏ రకమైన పక్షవాతం అనేదే కాకుండా, ఎంత నాడీ కణజాలం ప్రభావితం అయ్యిందనే విషయం కూడా తెలుస్తుంది. వీటిద్వారా సమస్యను పూర్తిగా నిర్ధారించి, దానికి అనుగుణమైన చికిత్స చేస్తారు.

### సర్జరీ ఏంటి?

సాధారణంగా స్ట్రోక్ వస్తే ప్రతి పది మందిలో నలుగురికి ఇంజెక్షన్ అవసరమైతే ఇద్దరికి సర్జరీ అవసరం అవుతుంది. సర్జరీ అనగానే ఇదేదో పెద్ద కోత పెట్టి చేసే ఆపరేషన్ అని భయపడనక్కర్లేదు. కాలి రక్తనాళం ద్వారా కెథటర్ గుండా స్టెంట్ రీవర్ అనే పరికరాన్ని క్లాట్ దగ్గరికి పంపించి, దాన్ని తొలగించడమే ఈ సర్జరీ. దీన్ని థ్రాంబెక్టమీ అంటారు. రోగి తొడ భాగంలో చిన్న కోత పెట్టి ఆప్టిక్ ఫైబర్ కేబుల్‌ను రక్తనాళం గుండా మెదడులో మూసుకుపోయిన రక్తనాళంలోకి పంపిస్తారు. తర్వాత సున్నితమైన గొడుగు లాంటి స్టెంట్ రీవర్‌ను కెథటర్ గుండా పంపిస్తారు. మెదడు రక్తనాళంలో పూడిక ఉన్న చోట స్టెంట్ రీవర్ గొడుగు లాగా తెరుచుకుని అక్కడ అడ్డంగా ఉన్న గడ్డను తనలోకి లాగేసుకుంటుంది. అప్పుడు దాన్ని బయటకు లాగేస్తారు. ఇలా రక్తనాళంలో ఏర్పడ్డ గడ్డ తొలగిపోవడంతో రక్తప్రసరణ సాఫీగా కొనసాగుతుంది.





### సర్జరీ.. ఎప్పుడవసరం?

- రక్తనాళంలో చిన్న చిన్న గడ్డలు లేదా క్లాట్స్ ఏర్పడినప్పుడు చేతికి ఇంజెక్షన్ ఇస్తే అవి కరిగిపోతాయి. కాని పెద్ద రక్తనాళంలో ఏర్పడే పెద్ద పెద్ద క్లాట్స్‌ను కరిగించాలంటే ఈ థ్రాంబోలైటిక్ థెరపీ ఇంజెక్షన్‌తో పాటు సర్జరీ కూడా అవసరం అవుతుంది.
- పక్షవాతం వచ్చిన నాలుగున్నర గంటల తర్వాత హాస్పిటల్‌కి వచ్చినా సర్జరీ అవసరం అవుతుంది.
- ఇంజెక్షన్ ఇవ్వలేని పరిస్థితులున్నవాళ్లకి కూడా సర్జరీ అవసరం అవుతుంది. అంటే థ్రాంబోలైటిక్ ఏజెంట్స్ లాంటి మందులు తీసుకున్నవాళ్లు, అంతకుముందు నెలలోపు సర్జరీ అయినవాళ్లు, ఇటీవలే స్ట్రోక్ వచ్చినవాళ్లకు థ్రాంబోలైటిక్ థెరపీ చేయలేము. ఇలాంటివాళ్ళకు థ్రాంబెక్టమీ సర్జరీ చేస్తారు.
- సాధారణంగా స్ట్రోక్ వచ్చిన నాలుగున్నర గంటల్లోగా థ్రాంబోలైటిక్ థెరపీ తీసుకోవాలి. ఏ కారణం చేతనైనా హాస్పిటల్‌కి రావడం ఆలస్యం అయినవాళ్లకు ఈ థ్రాంబెక్టమీ మరో దారి చూపిస్తుంది. ఈ సర్జరీని పక్షవాతం వచ్చిన 24 గంటల్లోగా చేయవచ్చు.
- ఒకసారి థ్రాంబెక్టమీ చేసిన తరువాత మళ్లీ తరువాత అవసరమైతే.. ఇలా ఎన్నిసార్లయినా చేయొచ్చు.
- సర్జరీ తరువాత 5 నుంచి 20 శాతం మందిలో బ్రెయిన్‌లో వాపు రావొచ్చు. వారికి ఓపెన్ సర్జరీ అవసరం పడొచ్చు.



**డాక్టర్ సురేష్ గిరగాని**
సీనియర్ న్యూరో ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్

# నిపుణ

## — విద్య ఉద్యోగ సమాచారం —

**కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల్లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

### ఐఐటీలో ఫ్యాకల్టీ

**భువనేశ్వర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- **అర్హతలు:** పీహెచ్‌డీతోపాటు బోధనలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** ప్రొఫెసర్ పోస్టులకు 55 ఏండ్లు, అసోసియేట్ ప్రొఫెసర్లకు 45, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 35 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏడాదంతా దరఖాస్తులు స్వీకరిస్తారు.
- **వెబ్‌సైట్:** http://www.iitbs.ac.in

### యూపీఎస్సీలో

- **పోస్టులు:** కంపెనీ ప్రాసిక్యూటర్-11, ప్రాసిక్యూటర్-1, జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్-2, డైరెక్టర్-2, గ్రేడ్-3 స్పెషలిస్ట్ (డెర్మటాలజీ-7, ఒబెస్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ-9, ఆప్తాల్మాలజీ-2, ఆర్థోపెడిక్స్-9, పీడియాట్రిక్స్-18, సైక్రియాట్రి-7 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** లా డిగ్రీ, పీజీ, ఎంబీబీఎస్, ఎంఎస్/ఎండీ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 14
- **వెబ్‌సైట్:** http://www.upsconline.nic.in

### ఎంటీఎస్ పోస్టులు

**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ జెనటిక్స్ & ట్రీ బ్రీడింగ్ (ఐఎఫ్‌జీటీబీ)లో ఎంటీఎస్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** మల్టిటాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-14, ఎల్‌డీసీ-1 ఖాళీలు ఉన్నాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 25
- **వెబ్‌సైట్:** http://ifgtb.icfre.org

### ఐఐటీలో పీహెచ్‌డీ

**జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ప్రకటన విడుదలైంది.**

- **కోర్సు:** పీహెచ్‌డీ
- **విభాగాలు:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఇంజినీరింగ్ సైన్సెస్, హ్యుమానిటీస్& సోషల్ సైన్సెస్.
- **కోర్సు:** ఇంటర్ డిసిప్లినరీ పీహెచ్‌డీ
- **విభాగాలు:** స్మార్ట్ హెల్త్ కేర్, క్వాంటమ్ ఇన్ఫర్మేషన్ అండ్ కంప్యూటేషన్, ఐవోటీ అండ్ అప్లికేషన్స్, ఏయూవీ టెక్నాలజీస్, డిజిటల్ హ్యూమానిటీస్ తదితరాలు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** నవంబర్ 5
- **వెబ్‌సైట్:** http://iitj.ac.in

### మ్యాట్

**మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్) డిసెంబర్ 2019 నోటిఫికేషన్‌ను ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) విడుదల చేసింది.**

- **పరీక్ష పేరు:** మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత లేదా డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పరీక్ష విధానం:** రాతపరీక్ష (పేపర్ బేస్డ్ టెస్ట్)/ కంప్యూటర్ ఆధారిత పరీక్ష.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీలు:** రాతపరీక్షకు 2019, డిసెంబర్ 1, కంప్యూటర్ ఆధారిత పరీక్షకు 2019, డిసెంబర్ 6.
- **రాతపరీక్ష తేదీ:** డిసెంబర్ 8,
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీ:** డిసెంబర్ 14
- **వెబ్‌సైట్:** http://mat.aima.in

# మద్యం మత్తు.. ఉద్యోగులు చిత్తు!

- 13 మంది విమానయాన ఉద్యోగులపై వేటు
- మూడు నెలలు సస్పెండ్ చేసిన డీజీసీఏ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** మద్యం తాగి విధులు నిర్వర్తించే విమానయాన సిబ్బందిపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కొరడా ఝుళిపిస్తున్నది. దేశంలోని విమానయాన సంస్థలు, విమానాశ్రయాల ఉద్యోగులకు గత నెల 16 నుంచి నిర్వహించిన బ్రీత్ ఎనలైజర్ (శ్వాస) పరీక్షల్లో 13 మంది విఫలమయ్యారని, దీంతో వారిని మూడునెలలపాటు సస్పెండ్ చేశామని డీజీసీఏ అధికారి ఒకరు సోమవారం వెల్లడించారు. ఈ పరీక్షలకు సంబంధించిన నిబంధనలు జారీ అయినప్పటి నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఏడుగురు ఉద్యోగులు, గోఎయిర్, స్పైస్‌జెట్ విమానయాన సంస్థలకు చెందిన ఒక్కో ఉద్యోగి ఆల్కహాల్ పరీక్షల్లో విఫలమైనట్టు ఆయన తెలిపారు. 'స్వచ్ఛంద దశ (వలంటరీ ఫేజ్)లో నిర్వహించిన బ్రీత్ ఎనలైజర్ టెస్టుల్లో వివిధ విభాగాలకు చెందిన 13 మంది ఉద్యోగులు విఫలమయ్యారు. తప్పనిసరి దశ (మాండేటరీ ఫేజ్) నవంబర్ నుంచి ప్రారంభమవుతుంది. దీంతో మా నిఘా, తనిఖీలు తరచుగా కొనసాగుతాయి. బ్రీత్ ఎనలైజర్ టెస్టుల్లో విఫలమైనవారిలో చాలామంది భద్రతకు ప్రాధాన్యమున్న సున్నితమైన విధులు నిర్వర్తించేవారే కావడంతో ప్రమాదాలు లేదా తీవ్రమైన ఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉంటుంది' అని ఆ అధికారి వివరించారు. దేశంలోని అన్ని విమానాశ్రయాలు, విమానయాన సంస్థల ఉద్యోగులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను డీజీసీఏ సెప్టెంబర్ 16న జారీచేసింది. ఈ పరీక్షల్లో మద్యం తీసుకున్నట్టు తేలిన ఉద్యోగులతో పాటు, పరీక్షలు చేయించుకునేందుకు నిరాకరించిన, విమానాశ్రయ ప్రాంగణం నుంచి వెళ్లిపోయి పరీక్షల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఉద్యోగులను విధులకు దూరంగా ఉంచడంతోపాటు వారి లైసెన్స్/అనుమతిని మూడు నెలలపాటు సస్పెండ్ చేయాలని ఈ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

కెనడాలోని టొరంటోలో టీడీఎఫ్ కెనడా, డీడీ రెడ్డి, జితేందర్‌రెడ్డి సహకారంతో బ్రిచ్మోంట్ ఫ్రెండ్స్ క్లబ్, మినిస్టరి ఆఫ్ మమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీపావళి పండుగ సంబురాల్లో పాల్గొన్న ఎన్నారైలు





# సైనికుల స్ఫూర్తితో అసాధారణ నిర్ణయాలు

- దేశరక్షణ కోసం వాళ్లు చూపించే తెగువ చాలా గొప్పది
- రాజౌరి సరిహద్దుల్లో సైనికులతో ప్రధాని దీపావళి సంబురాలు
- మిఠాయిలు పంచి, జవాన్లకు శుభాకాంక్షలు తెలిపిన మోదీ
- ప్రధాని రాక తమకెంతో గర్వకారణమన్న సైన్యం



ఆదివారం జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ సెక్టార్‌లో దీపావళి వేడుకల సందర్భంగా సైనికులకు స్వీట్లు తినిపిస్తున్న ప్రధాని మోదీ

**జమ్ము:** ప్రధాని నరేంద్ర మోదీ దీపావళి వేడుకలను సరిహద్దుల్లో జరుపుకున్నారు. జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు జిల్లా రాజౌరికి వెళ్లిన ఆయన అక్కడి సైనికులతో ఆదివారం దీపావళి సంబురాలు చేసుకున్నారు. దేశరక్షణ కోసం సైనికులు చూపించే తెగువ చాలా గొప్పదని కొనియాడారు. అత్యంత ధైర్యవంతులైన తన కుటుంబసభ్యులతో(జవాన్లతో) దీపావళి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటివరకూ అసాధ్యమనుకున్న నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోవడానికి సైనికుల శౌర్య పరాక్రమాలే కారణమని ఆయన ప్రశంసలు కురిపించారు. కంబాట్ జాకెట్(సైనికులు తొడుక్కునే జాకెట్)ను ధరించిన మోదీ తొడుక్కొని సరిహద్దుల్లోని సైనికులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారని, మిఠాయిలు పంచిపెట్టారని అధికారులు తెలిపారు. ఆయనతో పాటు సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ కూడా ఉన్నారు. దాదాపు వెయ్యి మంది సైనికులను ప్రధాని కలిశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'సైనికుల శౌర్య పరాక్రమాన్ని చూశాకే, ఇప్పటివరకూ అసాధ్యమనుకున్న ఎన్నో నిర్ణయాల్ని కేంద్ర ప్రభుత్వం తీసుకున్నది' అని అన్నారు. ఫిబ్రవరిలో బాలాకోట్‌పై సైన్యం చేపట్టిన వైమానిక దాడులు, ఆర్టికల్ 370 రద్దు తదితర నిర్ణయాల్ని ఉద్దేశిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రతి ఒక్కరు దీపావళిని తమ కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని కోరుకుంటారని, తాను కూడా అత్యంత ధైర్యవంతులైన తన కుటుంబసభ్యులతో(జవాన్లతో) ఈ పండుగను జరుపుకోవడానికి వచ్చానన్నారు. రాజౌరి, పూంచ్ సెక్టార్లలోకి ఉగ్రవాదులు చొరబడకుండా తమ ప్రాణాల్ని అర్పించిన అమరులైన జవాన్లు, అక్కడి పౌరులకు మోదీ నివాళులు అర్పించారు. రాజౌరిలోని 'హాల్ ఆఫ్ ఫేమ్' స్మారక చిహ్నాన్ని ఆయన సందర్శించారు. ఈ చిహ్నం 'పరాక్రమ భూమి, ప్రేరణ భూమి, పావన భూమి'కి సంకేతమని మోదీ కొనియాడారు. దేశ రక్షణ కోసం అత్యంత ధైర్య సాహసాలు, పౌరుషాన్ని ప్రదర్శిస్తున్న సైనికులకు దేశ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన అన్నారు. ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్‌ను చూసేందుకు వచ్చే సందర్శకుల సంఖ్య ఎక్కువవుతున్నదని, దేశం కోసం భద్రతా దళాల అంకితభావాన్ని ప్రజానీకం గౌరవిస్తున్నదనడానికి ఇదే నిదర్శనమని ఆయన తెలిపారు. మోదీ రాజౌరీ నుంచి పఠాన్‌కోట్ వాయుసేన వైమానిక స్థావరానికి వెళ్ళారు. ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో సిబ్బంది, వైమానిక యోధులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఇన్‌ఫాంట్రీ (పదాతి దళం) దినోత్సవాలను కూడా నిర్వహించారు. పాకిస్థాన్ మద్దతుతో జమ్ముకశ్మీరులోకి చొరబడినవారిని తరిమి కొట్టేందుకు 1947లో భారతీయ దళాలు ఆ రాష్ట్రంలో అడుగు పెట్టిన సందర్భానికి గుర్తుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. సరిహద్దుల్లో సైనికులతో జరుపుకున్న దీపావళి సంబరాల గురించి ఆ తర్వాత మోదీ వరుస ట్వీట్లు చేశారు. సైనికులకు మోదీ మిఠాయిలు పంచి పెట్టాక, సైన్యం 'భారత్ మాతాకీ జై' అంటూ నినదించారు. దీనికి సంబంధించిన వీడియోను కూడా ఆయన పోస్టు చేశారు. సైనికుల శౌర్య, పరాక్రమాలు, ధైర్యసాహసాలకు సంబంధించిన కథలు అందరికీ తెలుసునని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సైన్యం అందజేసే అద్భుత సేవల గురించి మీకు తెలుసా? అని ప్రజలను అడిగారు. సైనికులు అత్యంత వేగంగా స్పందించి, అందజేసే సేవలు చాలా మంది ప్రాణాలను కాపాడుతున్నట్లు, విపత్తుల్లో ప్రజల ఆస్తులు ధ్వంసం కాకుండా జవాన్లు నిరోధిస్తున్నట్లు తెలిపారు. కాగా, మోదీ సరిహద్దుల్లోకి వచ్చి తమతో దీపావళి జరుపుకోవడం తమకు అమిత ఆనందాన్నిచ్చిందని, ఆయన రాక తమకు ఆశ్చర్యాన్ని కలిగించిందని రాజౌరి సైనిక దళాలు పేర్కొన్నాయి. మోదీ తమతో సంబరాలు జరుపుకోవడాన్ని తామెంతో గర్వకారణంగా భావిస్తున్నామని తెలిపాయి. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత సరిహద్దుల్లోని జవాన్లతో దీపావళి సంబరాల్ని మోదీ జరుపుకోవడం ఇది మూడోసారి.

# హెల్త్ వాచ్

## క్యాన్సర్‌ని నివారించే వ్యాయామం



**క్యా**న్సర్‌ను నివారించాలన్నా, క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్నవాళ్లు త్వరగా కోలుకోవాలన్నా వ్యాయామం చాలా సహాయపడుతుందంటున్నారు పెన్ స్టేట్ యూనివర్సిటీ, అమెరికన్ క్యాన్సర్ సొసైటీల పరిశోధకులు. వారంలో మూడురోజులు రోజుకు 30 నిమిషాల ఏరోబిక్ ఎక్సర్‌సైజ్ చేయడం, వారానికి రెండు మూడుసార్లు స్ట్రెంత్ ట్రెయినింగ్ చేయడం మంచిదని సూచిస్తున్నారు. ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడం, బరువు నియంత్రణలో ఉంచడం, వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా వ్యాయామం క్యాన్సర్‌ను నివారించగలుగుతుందని చెప్తున్నారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం ఎంతో మేలుచేస్తుందనేది అందరికీ తెలిసిందే. ఇప్పుడు వ్యాయామం క్యాన్సర్ నుంచి కూడా రక్షిస్తుందని వెల్లడైంది. వ్యాయామం వల్ల బ్లాడర్, బ్రెస్ట్, పెద్ద పేగు, అన్నవాహిక, కిడ్నీ, జీర్ణాశయం, గర్భసంచి క్యాన్సర్లను నివారించవచ్చంటున్నారు నిపుణులు. అప్పటికే క్యాన్సర్ బారినపడినవాళ్లు కూడా రెగ్యులర్‌గా ఎక్సర్‌సైజ్ చేస్తే త్వరగా కోలుకోవడమే కాకుండా, ఎక్కువకాలం జీవించేందుకు అవకాశం ఉంటుందని చెప్తున్నారు.

## రాత్రుళ్లు మొబైల్ చూస్తున్నారా!



**స్మార్ట్** ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్ల లాంటి చేతిలో పట్టుకుని చూసే పరికరాలు కాంతిని విడుదలచేస్తాయి. వీటినుంచి వచ్చే నీలికాంతి కంటిచూపును దెబ్బతీసే ప్రమాదముందని ఇటీవలి పరిశోధనలు చెప్తున్నాయి. సాంకేతిక పరికరాల నుంచి విడుదలయ్యే బ్లూ లైట్ మాక్యులర్ డీజనరేషన్ అనే కంటిసమస్యకు దారితీస్తుందంటున్నారు టోలెడో యూనివర్సిటీ పరిశోధకులు. పగలూ, రాత్రీ తేడా లేకుండా చేతిలో గాడ్జెట్ లేకుండా ఉండేవాళ్లెవరూ కనిపించరు. రాత్రిపూట నిద్రపోకుండా గంటలుగంటలు మొబైల్ చూస్తూ గడిపేవాళ్లకు క్రమంగా కంటిలోని రెటీనా దెబ్బతిని మాక్యులర్ డీజనరేషన్ సమస్య రావొచ్చని హెచ్చరిస్తున్నారు. ఆ గాడ్జెట్స్ నుంచి వచ్చే నీలిరంగు కాంతి కండ్లను దెబ్బతీస్తుందని వారి పరిశోధనల్లో తేలింది. మాక్యులర్ డీజనరేషన్‌లో రెటీనాలోని ఫొటో రీసెప్టార్ కణాలు చనిపోతాయి. ఈ ఫొటో రీసెప్టార్ కణాలు మనం చూసే దృశ్యాల చిత్రాలను గ్రహించి, మెదడుకు సిగ్నల్స్ అందిస్తాయి. ఇందుకోసం రెటినల్ అనే మాలిక్యూల్ ఉపయోగపడుతుంది. కన్ను ఉత్పత్తి చేసే ఈ రెటినల్ బ్లూ లైట్ పడగానే చాలారకాల రసాయనిక చర్యలకు లోనవుతుంది. ఈ చర్యలు ఫొటో రీసెప్టార్ కణాలకు హానిచేస్తాయి. తద్వారా మనం చూసే దృశ్యాన్ని గ్రహించే ఆ కణాలు దెబ్బతింటాయి. ఫొటోరీసెప్టార్ కణాలు చనిపోతే మళ్లీ కొత్తవి పుట్టవు. అందువల్ల నెమ్మదిగా చూపు దెబ్బతింటుందని వివరిస్తున్నారు టోలెడో యూనివర్సిటీ పరిశోధకులు అజిత్ కరుణరత్నే. రాత్రిపూట చీకట్లో మొబైల్ మాత్రం చూస్తూ ఉండడం వల్ల దాని నుంచి వచ్చే కాంతి నేరుగా కంటి రెటీనాపై ఫోకస్ అవుతుంది. అందుకే రాత్రిపూట దీనివల్ల కలిగే హాని ఎక్కువగా ఉంటుందంటున్నారు. అయితే ఈ నీలిరంగు కాంతి ఎంత తీవ్రంగా, ఎంత సమయం ప్రభావం చూపిస్తే ఇటువంటి సమస్య వస్తుందనేది ఇంకా తేలలేదు. ఈ అంశంపై మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉందంటున్నారు పరిశోధకులు.

# తీర్పులను గౌరవిద్దాం!

- అయోధ్యపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడనున్న నేపథ్యంలో మోదీ పిలుపు
- 'మన్ కీ బాత్'లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగం




**న్యూఢిల్లీ:** అయోధ్యలోని బాబ్రీ మసీదు, రామజన్మ భూమి వివాదంపై ఇటీవల వాదనలను ముగించిన సుప్రీంకోర్టు నవంబరులో తుది తీర్పు ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం నాటి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ దీని గురించి ప్రస్తావించారు. న్యాయస్థానాల తీర్పును గౌరవించాలన్నారు. '2010 సెప్టెంబర్‌లో అలహాబాద్ హైకోర్టు రామజన్మ భూమి వివాదంపై తీర్పు ఇచ్చినప్పటి పరిస్థితులను నేను గుర్తు చేసుకున్నాను. మీరు కూడా ఒక్కసారి గతంలోకి వెళ్లి నాటి పరిస్థితులను నెమరువేసుకోండి. ఈ వివాదాన్ని అనుకూలంగా మార్చుకోవాలని కొందరు ప్రయత్నించారు. ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించేందుకు ఏవేవో మాట్లాడారు. ఐదు, ఏడు, పది రోజుల పాటు ఇది కొనసాగింది. కానీ కోర్టు తీర్పు వెలువడిన అనంతరం ఆశ్చర్యంగా దేశం మూడ్ మారిపోయింది. ఒకవైపు కొందరు తమ ధోరణిలో ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నించారు. మరోవైపు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు, పలు వర్గాలు, సాధువులు తమ ప్రకటనల్లో సమతుల్యం పాటించారు. ఉద్రిక్తత పరిస్థితులను మార్చేందుకు ప్రయత్నించారు. చివరకు అంతా న్యాయస్థానం తీర్పును గౌరవించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. ఈ గతాన్ని మనమంతా గుర్తు చేసుకోవాలి. సమైక్య స్వరం దేశాన్ని బలోపేతం చేస్తుందనడానికి ఇది ఒక నిదర్శనం' అని మోదీ పేర్కొన్నారు.

# బ్రెగ్జిట్ కొత్త గడువు జనవరి 31

- పొడిగింపు కోసం బ్రిటన్ అభ్యర్థనను అంగీకరించిన ఈయూ
- ముందస్తు ఎన్నికలపై బ్రిటన్‌లో ఈ వారంలోనే ఓటింగ్

**లండన్/బ్రసెల్స్, అక్టోబర్ 28:** యూరోపియన్ యూనియన్(ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలిగేందుకు ఉద్దేశించిన బ్రెగ్జిట్ గడువును మరోసారి పొడిగించేందుకు ఈయూ కౌన్సిల్ అంగీకారం తెలిపింది. తాజా గడువు వచ్చే ఏడాది జనవరి 31తో ముగియనున్నట్టు యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డొనాల్డ్ టస్క్ సోమవారం ట్వీట్ చేశారు. బ్రెగ్జిట్ గడువును పొడిగించాలన్న బ్రిటన్ అభ్యర్థనకు ఈయూలోని 27 దేశాలు అంగీకరించాయని ఆయన తెలిపారు. దీనికి సంబంధించిన లిఖితపూర్వక ఆదేశాల్ని త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. 'బ్రెగ్జిట్ గడువు పొడిగించాలన్న బ్రిటన్ అభ్యర్థనను ఈయూలోని 27 దేశాల సభ్యులు అంగీకరించారు. తదుపరి గడువు జనవరి 31, 2020గా నిర్ణయించాం. దీనికి సంబంధించిన వివరాల్ని లిఖితపూర్వకంగా త్వరలో వెల్లడిస్తాం' అని టస్క్ పేర్కొన్నారు. బ్రిటిష్ పార్లమెంటులో ఒకవేళ బ్రెగ్జిట్ బిల్లు ఆమోదం పొందితే తాజా గడువు కంటే ముందే ఈయూ నుంచి బ్రిటన్ విడిపోవచ్చని ఆయన తెలిపారు. మరోవైపు, బ్రిటన్ పార్లమెంట్‌కు డిసెంబర్ 12న ముందస్తు ఎన్నికలు నిర్వహించాలనుకున్న ఆ దేశ ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రతిపాదనపై ఓటింగ్ ప్రక్రియను ఈ వారం పార్లమెంటులో నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రతిపాదనతో ఈ నెల ఆఖరి వారంలో పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెడుతానని, దానికి ఎంపీలందరూ ఆమోదం తెలియచేయాలని గత వారం బోరిస్ కోరారు. ఈయూతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని సమగ్రంగా అధ్యయనం చేసేందుకు తమకు గడువు కావాలని ఎంపీలు కోరిన నేపథ్యంలో ఆయన ఈ ముందస్తు ఎన్నికల ప్రకటన చేశారు. ఈయూతో తాను కుదుర్చుకున్న అద్భుతమైన ఒప్పందాన్ని అధ్యయనం చేసేందుకు గడువు కావాలంటే ఎంపీలు తగిన సమయం తీసుకోవచ్చని, అయితే ముందుగా డిసెంబర్ 12 ఎన్నికల ప్రతిపాదనకు వారు అంగీకరించాల్సివుంటుందని ఆయన అన్నారు. కాగా, అక్టోబర్ 31నాటికి బ్రెగ్జిట్ ప్రక్రియను పూర్తి చేస్తామని తొలుత బోరిస్ ప్రకటించారు. అయితే, గత సోమవారం పార్లమెంటులో చర్చకు వచ్చిన బ్రెగ్జిట్ అంశం అనిశ్చిత వాతావరణంలో ముగిసింది. ఈయూ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఆ కూటమి నుంచి బ్రిటన్ బయటకు రావాలని 2016 జూన్ రిఫరెండమ్‌లో ప్రజలు స్పష్టంగా తీర్పునిచ్చారు. ఈ రిఫరెండమ్‌ను గౌరవిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన పార్టీలు వేర్వేరు కారణాలు చెబుతూ బ్రెగ్జిట్‌ను వాయిదాలు వేస్తూ వస్తున్నాయి.

## గుర్తింపులేని రైల్వే ఏజెంట్లపై దాడులు

### 14.51 లక్షల విలువైన టికెట్లు సీజ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గుర్తింపులేని ఏజెంట్లపై దాడులు నిర్వహించి రూ. 14.51 లక్షల విలువైన టికెట్లను సీజ్ చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే సోమవారం ప్రకటనలో తెలిపింది. తమ జోన్ పరిధిలోకి వచ్చే తెలంగాణ, ఏపీ, కర్ణాటక ప్రాంతాల్లో దీపావళి సందర్భంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్టు పేర్కొన్నది. చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ జీఎం ఈశ్వర్‌రావు పర్యవేక్షణలో జరిపిన ఈ దాడుల్లో 1,046 ఈ-టికెట్ల స్వాధీనంతోపాటు, 25 మంది ఏజెంట్లను అరెస్టుచేసి, రైల్వే చట్టం ప్రకారం కేసులు నమోదు చేసినట్టు తెలిపింది. బ్లాక్‌టికెట్ల దందాకు పాల్పడి ప్రయాణికులను మోసంచేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.



విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా పోటీల్లో విజేతగా నిలిచిన బాలికకు సర్టిఫికెట్ అందజేస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా

## సాంకేతికతతో అవినీతికి చెక్

- విజిలెన్స్ అవగాహనలో భారత్‌కు 78వ స్థానం
- దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం వల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని, తద్వారా అవినీతిని అంతమొందించవచ్చని దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా చెప్పారు. ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ ప్రచురించిన అవినీతి నిరోధక విజిలెన్స్ అవగాహన సూచిక 2018 ప్రకారం.. 180 దేశాల్లో భారత్ 78వ స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అవినీతి నిర్మూలనను ప్రతిఒక్కరు బాధ్యతగా భావించి నవ భారత నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఏఏ ఫడ్కే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ చంద్రిమారాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

- పొల్కిచెరువును రిజర్వాయర్‌గా మారుస్తాం: మంత్రి నిరంజన్‌రెడ్డి
- ఎమ్మెల్యే బీరంతో కలిసి పొల్కి చెరువులో చేపపిల్లల విడుదల



వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలకేంద్రంలోని పొల్కిచెరువులో పూలుచల్లి పూజలుచేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

**పాన్‌గల్:** మత్స్యకారుల అభ్యున్నతికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. సోమవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలోని పొల్కిచెరువుకు సమృద్ధిగా సాగునీరు చేరడంతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి మంత్రి నిరంజన్‌రెడ్డి పూలుచల్లి పూజలు చేశారు. 1.2లక్షల చేప పిల్లలను చెరువులో వదిలారు. గోప్లాపూర్ ఊరచెరువు, చింతకుంట వీరన్నచెరువు, మల్లాయిపల్లి తిమ్మయ్య చెరువు, దవాజీపల్లిలో ముందిరి చెరువులకు కూడా పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధికోసం చెరువులు, కుంటలు, జలాశయాల్లో రూ.కోట్లు వెచ్చించి చేపపిల్లలను వదులుతున్నామని తెలిపారు. దీంతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినందునే వ్యవసాయరంగం అభివృద్ధి చెంది విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయించి సస్యశ్యామలంగా మార్చిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎంజీకేఎల్ఐ డీ-8 ద్వారా కిష్టాపూర్, గోప్లాపూర్, అన్నారం, దవాజిపల్లి, మల్లాయిపల్లి, చందాపూర్ కాలువకు అదేవిధంగా కిష్టాపూర్ మీదుగా మాధవరావుపల్లి, ఆకులోనిపల్లి, నిజామాబాద్ తదితర గ్రామాలకు వెళ్లే డీ-6 కాలువలను వీలైనంత త్వరగా పూర్తి చేశామని పేర్కొన్నారు. పాన్‌గల్ గ్రామ ప్రజల చిరకాల కోరిక అయిన పొల్కిచెరువును రానున్న రోజుల్లో రిజర్వాయర్‌గా మార్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పొల్కిచెరువు ఎత్తు, సామర్థ్యం పెంచి అన్ని వనరులను సమకూర్చుతామని భరోసా కల్పించారు.

## శివకుమార్ చేతిలో జేడీఎస్ జెండా!



బెంగళూరులో ఊరేగింపు సందర్భంగా జేడీఎస్ జెండాతో కాంగ్రెస్ నేత శివకుమార్

**బెంగళూరు, అక్టోబర్ 28:** కర్ణాటక కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ జేడీఎస్ పార్టీ జెండాను పట్టుకోవడంపై సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. మనీ లాండరింగ్ ఆరోపణలపై కొన్ని రోజుల పాటు తీహార్ జైల్లో ఉన్న ఆయన శుక్రవారం బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. శనివారం ఢిల్లీ నుంచి బెంగళూరు వచ్చిన ఆయనకు పార్టీ నేతలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఎస్ కార్యకర్తలు తమ పార్టీ జెండాను శివకుమార్‌కు అందించగా కొద్దిసేపు ఊపి వారికి తిరిగి ఇచ్చారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం సిద్దరామయ్య దీనిపై విమర్శించారు. అయితే శివకుమార్ తన చర్యను సమర్థించుకున్నారు. 'నేను ఎక్కడికి వెళ్లినా నా అభిమానులు కర్ణాటక జెండాతోపాటు పలు జెండాలు నా చేతికి ఇస్తారు. అన్ని వర్గాలకు చెందిన ప్రజలు నా వద్దకు వస్తారు. ఇప్పుడు కూడా నన్ను కలిసేందుకు ముగ్గురు జేడీఎస్ ఎమ్మెల్యేలు ఎదురుచూస్తున్నారు. రావద్దని నేను వారితో చెప్పనా?' అని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్‌లోనే పుట్టానన్న శివకుమార్, దేవాలయంగా భావించే పార్టీ కార్యాలయానికి నేరుగా వచ్చానని, ఇతర పార్టీల జెండా పట్టుకోవడం సమస్యగా భావించడం లేదని అన్నారు. సిద్దరామయ్యకు తనపై ఎంతో ప్రేమ ఉన్నదంటూ ఆయన విమర్శలను తిప్పికొట్టారు.

# సింగరేణిభవన్‌లో విజిలెన్స్ వారోత్సవాలు



హైదరాబాద్ సింగరేణి భవన్‌లో విజిలెన్స్ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

**హైదరాబాద్/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** అవినీతి రహితంగా సింగరేణి సంస్థను తీర్చిదిద్దేందుకు అనేకచర్యలు తీసుకుంటున్నట్టు జీఎం (సీడీఎన్, మార్కెటింగ్) ఆంటోనీ రాజా చెప్పారు. సింగరేణివ్యాప్తంగా 11 ఏరియాల్లోని అన్ని డిపార్ట్‌మెంట్‌లు, గనులు, కార్యాలయాల్లో సోమవారం విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో జరిగిన విజిలెన్స్ వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణిలో 1987లో విజిలెన్స్‌శాఖను ప్రారంభించామని, సంస్థలో ప్రతి ఉద్యోగి అవినీతికి తావు లేకుండా పనిచేయాలని, ఎవరైనా అవినీతికి పాల్పడితే విజిలెన్స్‌శాఖకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సోమవారం నుంచి నవంబర్ 2వ తేదీ వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయని చెప్పారు. సింగరేణిలో చైతన్య వంతులైన ఉద్యోగులు ఉన్నందువల్లనే సంస్థ నిజాయితీతో ముందుకుపోతున్నదని తెలిపారు. సంస్థలోనే కాక బయటిసమాజంలో కూడా సింగరేణీయులు నిజాయితీలతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా ఈ ఏడాది 'నిజాయితీ ఒక జీవనశైలి' నినాదంపై సింగరేణి ఉద్యోగులకు వ్యాసరచన పోటీలు, సింగరేణి విద్యాసంస్థల్లోని విద్యార్థులకు వ్యాసరచన, నినాదాల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సీనియర్ కమ్యూనికేషన్ ఆఫీసర్ గణాశంకర్ పూజారి నేతృత్వంలో సింగరేణిభవన్ అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీఎం మార్కెటింగ్ ఎన్‌వీకే శ్రీనివాసరావు, డీజీఎం (పర్చేజ్) విజేందర్‌రెడ్డి, డీజీఎం (ఎఫ్అండ్ఎం) బీరాజేశ్వర్‌రావు, డాక్టర్ శేషగిరిరావు, ఏడీఎం భాస్కర్, పీఆర్వో మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి దారుణహత్య

**టేకులపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం జంగాలపల్లికి చెందిన ఓ యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం గ్రామంలో సంచలనం సృష్టించింది. ఈసం రాంబాబు(35)కు 15 ఏండ్ల కిందట ఇదే మండలంలోని రాయపాడుకు చెందిన రాంబాయితో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. రాంబాబు వ్యవసాయం చేస్తుండగా, భార్య అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నది. దంపతులు ఆదివారం పొలానికి వెళ్లగా, సాయంత్రం రాంబాయి ఇంటికి వచ్చింది. రాంబాబుతో తనకు గొడవైందని, కొట్టాడంటూ అత్త పోతమ్మకు గాయాలను చూపించింది. ఆదివారం రాత్రి కూడా రాంబాబు ఇంటికి రాకపోవడంతో తల్లి పోతమ్మ సోమవారం పొలానికి వెళ్లి చూడగా, కుమారుడు విగతజీవుడిగా ఉండటం చూసి నిర్ఘాంతపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి మృతుని ఒంటిపై గాయాలను, ముఖం సగం కాలి ఉండటాన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 29 అక్టోబర్ 2019


'రెడ్' చిత్రంలో రామ్


'అల వైకుంఠపురములో' పూజాహెగ్డే, అల్లు అర్జున్, నివేధా పేతురాజ్


'రూలర్' చిత్రంలో బాలకృష్ణ

# సరికొత్త తారాజువ్వలు

**వెలుగుదివ్వెల కాంతిధారలతో ప్రతి ఇంటా ఆనందాల హరివిల్లుల్ని వెదజల్లింది నవ్యదీపావళి. అదే తరుణంలో క్రొంగొత్త ముచ్చట్లతో, నూతన ప్రచార చిత్రాల సందడితో చిత్రసీమ సినీ ప్రియుల హృదయాల్ని ఆనందడోలికల్లో ముంచెత్తింది. దీపావళి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని పలు సినిమాలు కొత్త సంగతులతో ప్రేక్షకుల్ని పలకరించాయి.**

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. అనిల్‌రావిపూడి దర్శకుడు. రష్మిక మందన్న కథానాయిక. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీఎమ్‌బీ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో సీనియర్ నటి విజయశాంతి ప్రొఫెసర్ భారతి పాత్రలో కనిపించనున్నారు. మేజర్ అజయ్‌కృష్ణగా మహేష్‌బాబు శక్తివంతమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాలో మహేష్‌బాబు కొత్త లుక్‌ను దీపావళి కానుకగా విడుదల చేశారు. జనవరి 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'అల వైకుంఠపురములో' చిత్ర గీతాలు సంగీతప్రియుల్ని అలరిస్తున్నాయి. అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ నిర్మాతలు. పూజాహెగ్డే, నివేథా పేతురాజ్ కథానాయికలు. తమన్ స్వరాల్ని సమకూర్చారు. దీపావళి సందర్భంగా 'రాములో రాముల..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. కాస్లర శ్యామ్ రాసిన ఈ గీతాన్ని అనురాగ్ కులకర్ణి, మంగ్లీ ఆలపించారు. విడుదలైన కొద్ది గంటల్లోనే సాంఘిక మాధ్యమాల్లో ఈ పాట సంచలనంగా మారింది. జనవరి 12న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు.

బాలకృష్ణ నటిస్తున్న తాజా చిత్రానికి 'రూలర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కె.ఎస్.రవికుమార్ దర్శకుడు. హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. డిసెంబర్ 20న విడుదల చేస్తున్నారు. 'ఈ చిత్రంలో బాలకృష్ణ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్ర భిన్న పార్శ్వాల్లో శక్తివంతంగా సాగుతుంది. బాలకృష్ణ 105 చిత్రంగా అనేక ప్రత్యేకతల సమాహారంగా రూపొందిస్తున్నాం. ఆయన అభిమానుల్ని అలరించే అన్ని అంశాలుంటాయి' అని చిత్రబృందం తెలిపింది.

నితిన్, రష్మిక మందన్న జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'భీష్మ'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. దీపావళి సందర్భంగా తొలి ప్రచార చిత్రాలను విడుదల చేశారు. ప్రస్తుతం రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతున్నది. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. పెళ్లివద్దనుకునే ఓ బ్రహ్మచారి కథ ఇది. వినోదానికి పెద్దపీట వేస్తూ తెరకెక్కిస్తున్నారు. మహతి స్వరసాగర్ స్వరకర్త. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'రెడ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. తిరుమల కిషోర్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీస్రవంతి మూవీస్ పతాకంపై రవికిషోర్ నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'నవంబర్ 16 నుంచి చిత్రీకరణ ప్రారంభిస్తాం. ఇప్పటివరకు రామ్ చేసిన పాత్రలకు పూర్తి భిన్నంగా ఉంటుంది' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సమీర్‌రెడ్డి ఛాయాగ్రాహణం అందిస్తుండగా మణిశర్మ స్వరాల్ని సమకూర్చుతున్నారు.

...చిత్రం డెస్క్


'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో మహేష్‌బాబు


'భీష్మ' చిత్రంలో రష్మిక మందన్న, నితిన్

**'మళ్లీరావా' 'ఈ నగరానికి ఏమైంది' 'ఫలక్‌నూమా దాస్' వంటి చిత్రాల ద్వారా ప్రతిభావంతుడైన హాస్యనటుడిగా గుర్తింపును తెచ్చుకున్నాడు అభినవ్ గోమటం. చక్కటి టైమింగ్‌తో వ్యంగ్యం జోడించిన సంభాషణలు పలికించడం ఆయన ప్రత్యేకతగా చెబుతారు. అభినవ్ ముఖ్యపాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మీకు మాత్రమే చెప్తా'. షమ్మీర్ సుల్తాన్ దర్శకుడు. నవంబర్ 1న విడుదలకానుంది. ఈ సందర్భంగా అభినవ్ గోమటం సోమవారం పాత్రికేయులతో ముచ్చటించారు.**


అభినవ్

## నటుణ్ణి అవుదామనుకోలేదు!

'ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఏదో రహస్యం ఉంటుంది..' అని ట్రైలర్‌లో చూపించాం. ఈ సినిమా కథాంశం కూడా మొబైల్ ఫోన్ చుట్టూ నడుస్తుంది. అయితే డాక్యుమెంటరీ మాదిరిగా మాత్రం ఉండదు. మొబైల్ ఫోన్, రహస్య వీడియోలు, మిత్రబృందం చేసే హంగామా..ఈ అంశాల చుట్టూ ఆద్యంతం వినోదాత్మకంగా నడుస్తుంది. సినిమాలో చూపించే సంఘటనలతో ప్రతి ఒక్కరూ ఎక్కడో ఓ చోట కనెక్ట్ అవుతారు. తొలుత ఈ చిత్రానికి 'ఎవరికీ చెప్పొద్దు' అనే టైటిల్ అనుకున్నాం. అయితే ఆ పేరుతో ఓ సినిమా విడుదలకు సిద్ధంగా ఉండటంతో 'మీకు మాత్రమే చెప్తా' అనే టైటిల్‌ను ఎంచుకున్నాం.

**వీడియో జాకీ పాత్రల్లో..**

సినిమాలో తరుణ్ స్నేహితుడిగా ఫుల్‌లెంగ్త్ పాత్రలో కనిపిస్తాను. ఇందులో మేమిద్దరం వీడియోజాకీలుగా కనిపిస్తాం. 'ఈ నగరానికి ఏమైంది' తర్వాత నేను ఎక్కువగా సినిమాలు చేయలేదు. ఆ టైమ్‌లో తేజ దర్శకత్వం వహించిన 'సీత' చిత్రానికి కమిట్ కావడం వల్ల మిగతా సినిమాల అవకాశాల్ని వదులుకోవాల్సి వచ్చింది. 'మజిలీ' 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో కూడా నేను నటించాల్సిఉంది. డేట్స్ కుదరక చాలా అవకాశాలు మిస్సయ్యాయి.

**అనుకోకుండా పరిశ్రమలోకి..**

నటుణ్ణి అవుదామనే కలలు ఉండేవి కావు. అనుకోకుండా పరిశ్రమలోకి వచ్చాను. నేను పుట్టిపెరిగింది హైదరాబాద్‌లోనే. అమ్మవాళ్లది వరంగల్. ఇంజినీరింగ్ పూర్తి చేసిన అనంతరం డెల్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా మంచి హోదాలో పనిచేశాను. అయితే పది నుంచి ఐదు గంటల వరకు చేసే ఉద్యోగాలు నాకు నచ్చేవి కావు. అందుకే జాబ్ వదులుకొని సినిమాల్లో అదృష్టాన్ని పరీక్షించుకున్నా. కేవలం కామెడీ రోల్స్ మాత్రమే కాకుండా అన్ని రకాల పాత్రల్లో నటించాలని ఉంది. ప్రస్తుతం కెరీర్ బాగుంది. వరుస అవకాశాలొస్తున్నాయి. జయంత్ సి పరాన్జీ దర్శకత్వంలో రూపొందించబోతున్న ఓ ముక్కోణపు ప్రేమకథా చిత్రంలో ఫుల్‌లెంగ్త్ రోల్‌లో నటించబోతున్నా. సుశాంత్ కథానాయకుడిగా నటించనున్న ఓ సినిమాలో నెగెటివ్ రోల్‌ను పోషిస్తున్నా. 'ఈ నగరానికి ఏమైంది' వెబ్‌సిరీస్‌లోనూ నటిస్తున్నా.


కె.విశ్వనాథ్‌తో 'అప్పుడు ఇప్పుడు' చిత్ర బృందం

## కళాతపస్వి ఆశీస్సులతో...

యు.కె.పిలింస్ నిర్మిస్తున్న చిత్రం 'అప్పుడు ఇప్పుడు'. సుజన్, తనిష్క నాయికానాయికలు. ఉషారాణి కనుమూరి, విజయ రామకృష్ణంరాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి చలపతి పువ్వుల దర్శకుడు. ఈ చిత్రం తొలిపాటను సోమవారం కళాతపస్వి కె.విశ్వనాథ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఫీల్‌గుడ్ చిత్రాలకు తెలుగు ప్రేక్షకుల ఆదరణ 'అప్పుడు ఇప్పుడు' ఎప్పుడూ వుంటుంది. ఇప్పుడు విడుదలైన పాట, ప్రచార చిత్రాలు ఆకట్టుకునే విధంగా వున్నాయి. సినిమా తప్పకుండా విజయం సాధించాలి' అని తెలిపారు.

## ప్రణయకథ

రమణ్, వర్ష విశ్వనాథ్, పావని, దీపికా నాయకానాయికలుగా త్వరలో ఓ చిత్రం ప్రారంభం కానుంది. రమేష్–గోపి దర్శకుకులు. సిరి మూవీస్ పతాకంపై కె.శిరీషారెడ్డి నిర్మిస్తారు. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రేమ, వినోదం అంశాల కలబోతగా తెరకెక్కించబోతున్న చిత్రమిది. అంతర్లీనంగా సందేశం ఉంటుంది. ఈ చిత్రం ద్వారా సీనియర్ నటి వాణీవిశ్వనాథ్ తనయ వర్ష విశ్వనాథ్ కథానాయికగా పరిచయమవుతున్నది. నవంబర్ చివరివారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని చెప్పారు.


వర్ష విశ్వనాథ్

## ప్రతి ఇంట్లో 'అశ్వత్థామ'


రమణతేజ, ఉషా ముల్పూరి, శంకర్‌ప్రసాద్

నాగశౌర్య, మెహరీన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రానికి 'అశ్వత్థామ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రమణతేజ దర్శకుడు. ఐరా క్రియేషన్స్ పతాకంపై ఉషా ముల్పూరి నిర్మిస్తున్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇప్పటివరకు నాగశౌర్య ఈ తరహా కథతో సినిమా చేయలేదు. అతని పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది. టాకీపార్ట్ పూర్తయింది. ఒక పాట బ్యాలెన్స్‌గా ఉంది. ఫిబ్రవరిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. 'ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ ఇది. ప్రతీ ఇంట్లో ఒక అశ్వత్థామ ఉంటాడు. కుటుంబ భావోద్వేగాలు కలబోసిన కథ ఇది. పోరాట ఘట్టాలు సహజంగా ఉంటాయి. 'కేజీఎఫ్' చిత్రానికి స్టంట్స్ సమకూర్చిన అన్బు అరివు అద్భుతమైన పోరాట ఘట్టాల్ని కంపోజ్ చేశారు' అని దర్శకుడు చెప్పారు. బ్యాలెన్స్‌గా ఉన్న పాటను చిక్‌మంగళూరులో చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నామని సమర్పకుడు శంకర్‌ప్రసాద్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్‌రెడ్డి, స్క్రీన్‌ప్లే: రమణతేజ, ఫణీంద్ర, సంగీతం: శ్రీచరణ్, దర్శకత్వం: శ్రీచరణ్.

## మహిళా సాధికారతను చర్చిస్తూ..

**'హైదరాబాద్ బ్లూస్' 'డోర్' 'ఇక్బాల్' చిత్రాలతో సృజనాత్మక దర్శకుడిగా జాతీయస్థాయిలో గుర్తింపును సంపాదించుకున్నారు నగేష్ కుకునూర్. ఎవరూ స్పృశించని ఇన్నోవేటివ్ కాన్సెప్ట్స్‌ను ఎంచుకొని సినిమాలు చేయడం ఆయన శైలిగా చెబుతారు. ప్రస్తుతం ఆయన తెలుగులో కీర్తి సురేష్ కథానాయికగా 'గుడ్‌లక్ సఖీ' పేరుతో ఓ క్రీడానేపథ్య చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆది పినిశెట్టి, జగపతిబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సందర్భంగా నగేష్ కుకునూర్ ఇటీవల హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు. ఆయన చెప్పిన సంగతులివి..**


నగేష్ కుకునూర్

కెమికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన నేను అనుకోకుండా సినీరంగంలోకి వచ్చాను. 'హైదరాబాద్ బ్లూస్' చిత్రాన్ని రూపొందించడం నా జీవితంలో కీలక మలుపుగా అభివర్ణించవొచ్చు. ఆ సినిమాతో దర్శకత్వాన్ని కెరీర్‌గా ఎంచుకున్నా. నేను స్వతహాగా హైదరాబాదీని. ఇక్కడే పుట్టి పెరిగాను. అయితే హిందీలో ఎక్కువ సినిమా చేశాను. ఎట్టకేలకు మాతృభాష తెలుగులో సినిమా చేయడం సంతోషంగా ఉంది. 'మహానటి' సినిమా చూసిన తర్వాత నేను అనుకున్న కథకు కీర్తి సురేష్ అయితేనే బాగుంటుందనిపించింది.

**మహిళా సాధికారత నేపథ్యంలో...**

'గుడ్‌లక్ సఖీ' క్రీడానేపథ్యంలో సాగే రొమాంటిక్ కామెడీ చిత్రం. ఇందులో కీర్తి సురేష్ 10 మీటర్స్ పిస్టల్ షూటర్ పాత్రలో కనిపిస్తుంది. పల్లెటూరికి చెందిన ఓ అమ్మాయి షూటింగ్‌లో ఎలా రాణించిందనే అంశాన్ని ఈ చిత్రంలో చర్చిస్తున్నాం. మహిళా సాధికారత ప్రధానంగా సినిమా కథ సాగుతుంది. హీరో ఆది ఈ సినిమాలో రంగస్థల కళాకారుడిగా కనిపిస్తాడు. వయోవృద్ధులైన షూటర్స్ ప్రకాశీతోమర్, చంద్రోతోమర్ గురించి 20ఏళ్ల కిత్రం ఓ పేపర్‌లో చూశాను. వాళ్లిద్దరి స్ఫూర్తితో ఈ కథ రాసుకున్నాను.

**జయాపజయాల్ని పట్టించుకోను..**

ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఏం సాధించాననే దాని గురించి నేను పెద్దగా పట్టించుకోను. నేను తీసిన సినిమాల్ని కూడా థియేటర్లలో చూడను. రివ్యూలు చూడా చదవను. ఎవరికైనా తమ భావాల్ని వ్యక్తీకరించే హక్కు ఉందని నమ్ముతా. కాబట్టి సమీక్షల మీద చర్చించడం వృథా నా అభిప్రాయం.

